ఆంధ్రప్రదేశ్ గురించి

- 1971 జనాభా లెక్కల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ జనాభా భారతదేశ జనాభాలో 7.93 శాతానికి, ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణం భారతదేశ విస్తీర్ణంలో 9 శాతానికి సమానం.

- ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణం 2.75,109 చ. కి. మీటర్లు.

- 1971 లో సేకరించిన లెక్కల ప్రకారం. ఆంధ్రప్రదేశ్ జనాభా 4,33,94,951 మంది. దేశజనాభా 54,69,55,945.

- 1971 లెక్కల ప్రకారం, రాష్ట్ర జనాభాలో అక్షరాస్యులు 24.56 శాతం మంది వున్నారు. 1961 లో 21.19 శాతం. భారతదేశం మొత్తంమీద వున్న అక్షరాస్యుల శాతం 1971 లో 29.35. 1961లో 24.03 శాతం.

- మన రాష్ట్రంలో జనాభా సాంద్రత చ. కి. మీ. 1కి 157 మంది హైదరాబాదు జిల్లాలో సాంద్రత చ. కి. మీ. 1కి, 362. అన్ని జిల్లాల కంటే యిది ఎక్కువ. అదిలాబాద్ జిల్లాలో జనాభా సాంద్రత 79 మంది. అన్నింటి కంటే యిది తక్కువ.

- రాష్ట్రంలో తలసరి సగటు ఆదాయం (1960-61 నాటి ధరలు) మొదటి ప్రణాళిక అంతానికి రూ. 281లు, రెండవ ప్రణాళిక అంతానికి రూ. 306లు, మూడవ ప్రణాళిక అంతానికి రూ. 333 ల చొప్పున ఉంది. నాలుగవ ప్రణాళిక ముగింపు నాటికి తలసరి సగటు ఆదాయం రూ. 430 లకు పెరుగుతుంది.

- రాష్ట్రంలో 1,000 అడుగుల లోతు మేరలో సుమారు 1,000 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు వున్నాయి. 2,000 అడుగుల లోతు మేరలో 1,320 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు లభించగలవని అంచనా.

- భారతదేశంలో, బారైట్స్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్‌దే అగ్రస్థానం దేశంలో ఉత్పత్తి అయ్యే బారైట్స్‌లో 90 శాతం మొదలు 95 శాతం వరకు రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్నది.

- అభ్రకం ఉత్పత్తిలో బీహారు, రాజస్థాన్ రాష్ట్రాల తరువాత స్థానం ఆంధ్రప్రదేశ్‌ది.

ఆంధ్ర ప్రదేశ్

సంపుటి : 17

అక్టోబర్ 1973
ఆశ్వయుజ—కార్తీక, 1895 శా. శ.

సంచిక : 12

ప్రధాన సంపాదకుడు :
పెండ్యాల వామనరావు

సంపాదకుడు :
ఈరంకి వెంకట సుబ్బారావు

దేశమును ప్రేమించుమన్నా
మంచియన్నది పెంచుమన్నా
వట్టిమాటలు కట్టిపెట్టోయ్
గట్టిమేల్ తలపెట్టవోయ్

మూడవ అట్ట : సాలార్ జంగ్ మ్యూజియంలో పాలరాతి "రెబెకా" శిల్పం.

చివరి అట్ట : సింహాచలం దేవాలయ గోపురం.

సాలు చందా : ఆరు రూపాయలు

విడిప్రతి : 50 పైసలు

రిజిస్టరు నెం : 133

19–1

సంచికలో

చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధి

శక్తి వంతమైన ప్రచార సాధనాలలో చలన చిత్ర ప్రదర్శన ఒకటి. దేశమంతటా విస్తరించివున్న థియేటర్లద్వారా ప్రదర్శించే కథా చిత్రాలు ప్రజలకు వినోదాన్ని కల్గించడమేకాక ప్రజల మనస్సుల మీద చెరిగిపోని ముద్రవేస్తాయి. వారికి ఒక సందేశాన్నిస్తూ వారి అలవాట్లు వేషధారణల మీద ఎంతో ప్రభావాన్ని ప్రసరింపజేస్తాయి. హిందీ చిత్రాలు, హిందీ మాతృభాషకాని ప్రాంతాలలో కూడా ప్రదర్శించబడి హిందీ భాషను అవగాహన చేసుకోడానికి ఎంతగానో తోడ్పడ్డాయి.


తెలుగు చిత్రాలను తయారు చేయడానికి హైదరాబాదును కేంద్రంగా అభివృద్ధిచేసే వుద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గత కొన్నేళ్లగా రాష్ట్రంలో చలన చిత్ర పరిశ్రమ ప్రగతికి కొన్ని చర్యలను తీసుకొంది. చలనచిత్ర రంగంవల్ల ఏర్పడే ఉపాధి సౌకర్యాలు, తదితర ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని రాష్ట్ర రాజధానీ నగరంలో తెలుగులోగాని, హిందీలోగాని, మరి ఏ యితర భాషలో గాని చలన చిత్ర నిర్మాణాన్ని ప్రోత్సహించడం మంచిదని 1963 లోనే ప్రభుత్వం నిశ్చయించింది. ఏ భాషా చిత్రమైనా ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించినప్పుడు దానికి రూ 50,000 లు సబ్సిడీ యివ్వాలని నిశ్చయించింది. తెలుగు చిత్రనిర్మాతలే కాకుండా హిందీ, మరాఠీ నిర్మాతలు కూడా ఈ రాష్ట్రంలో చలన చిత్రాలను నిర్మించడానికి యీ సబ్సిడీ పథకం ఎంతగానో ప్రోత్సాహాన్నిచ్చిందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమాభివృద్ధికి అనువైన వాతావరణం నెలకొనడానికి కూడా యిది దోహదం చేసింది. యిక్కడ తయారయ్యే చిత్రాలు మొదట్లో అనుకున్నట్టుగా ఒక ఏడాదికన్న మరొక ఏడాది ఎక్కువ కాకపోవడానికి కారణం కొంతవరకు గత నాలుగైదు ఏళ్ళగా రాష్ట్రంలో ఏర్పడిన అనిశ్చిత పరిస్థితులే. కొంతకాలం వరకు మాత్రమే సబ్సిడీ యివ్వాలని మొదట్లో ఉద్దేశించినప్పటికీ హైదరాబాదుకు చలన చిత్రరంగాన్ని ఆకర్షించేందుకు యీ సబ్సిడీ పద్ధతి అమితంగా తోడ్పడుతుంది కాబట్టి దీనిని యింకా కొనసాగించాలని ఉద్దేశించారు. సబ్సిడీ అనేది ప్రోత్సాహాన్నిచ్చే ఒకరకమైన ఆకర్షణేగాని పూర్తిగా సినిమాకు అయ్యే ఖర్చంతా భరించడం దీని ఉద్దేశం కాదని గుర్తుంచుకోవడం అవసరం. ఇంతవరకు 40 చలన చిత్రాలకు సబ్సిడీ యివ్వడం జరిగింది.

రాష్ట్రంలో నిర్మించిన కథా చిత్రాలకు సబ్సిడీ యివ్వడమే కాక 'బ్రహ్మానంద చిత్రపురి ' అనే చిత్రనగర్ ఒకదానిని ఏర్పాటు చేసే పథకాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఆ ఉద్దేశంతోనే హైదరాబాదు-విజయవాడ రోడ్డులో హయాత్‌నగర్ వద్ద కొత్త స్టూడియోలు, తదనుబంధ విభాగాలు, ఇళ్ళకాలనీ నిర్మాణానికిగాను డబ్బు చెల్లింపు పద్ధతిన 200 ఎకరాలకు పైగా స్థలాన్ని చలనచిత్ర పరిశ్రమకు ప్రత్యేకించడం జరిగింది. ఈ చలనచిత్ర నగర్‌కు విద్యుచ్ఛక్తి, టెలిఫోను, మంచినీటి సరఫరా వంటి ప్రాథమిక సౌకర్యాలను ప్రభుత్వం అప్పుడే కల్పించింది కూడా. ఇలా చలనచిత్ర పరిశ్రమకు అవసరమయ్యే పునాది సంబరాలను సమకూర్చడం జరిగింది. ఇక చలన చిత్రరంగంలో వున్నవారు వీటిని వినియోగించుకోడానికి ముందుకు రావలసివుంది. ముందుకొచ్చి, స్టూడియోలను నిర్మించడానికి తమకు స్థలం కేటాయించాలని కోరవలసినది వారే. అప్పుడే ప్రముఖ చలనచిత్ర నిర్మాతలు యిద్దరికి చెరొక 20 ఎకరాలూ, మరొక నిర్మాతకు 20 ఎకరాలూ కేటాయించడం జరిగింది. ప్రస్తుతము వున్న స్టూడియోలను విస్తరింప జేయడానికి, కొత్త స్టూడియోలను నిర్మించడానికి తదనుగుణంగా ఋణాలు మంజూరు చేయబడ్డాయి.

విద్య, సాంస్కృతిక విలువలతో ఉన్నత సాంకేతిక, కళాత్మక తెలుగు చలనచిత్రాలు నిర్మాణం కావడానికి ప్రోత్సాహాన్నిచ్చే ఉద్దేశంతో రాష్ట్రప్రభుత్వం మరికొన్ని చర్యలు తీసుకొంది. ప్రతి సంవత్సరం తెలుగులో నిర్మింపబడే ఉత్తమ చిత్రాలకు బహుమతులిచ్చే పద్ధతిని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమాభివృద్ధికి అర్హతపొందిన, శిక్షణపొందిన వ్యక్తులను లభింపజేసే వుద్దేశంతో పూనాలోని భారతప్రభుత్వంవారి ఫిల్మ్ అండ్ టెలివిజన్ సంస్థ వారు కల్పిస్తోన్న సౌకర్యాన్ని ప్రభుత్వం వినియోగించుకోవడం జరుగుతోంది. ఆ సంస్థలో వివిధ కోర్సులలో శిక్షణ పొందేందుకు ఆంధ్రప్రదేశ్ నుంచి విద్యార్థులకు ఉపకార వేతనాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇంతవరకు 21 మంది విద్యార్థులు యీ సౌకర్యాన్ని వినియోగించుకున్నారు. అవుట్‌డోర్ షూటింగుకు ఆయా ప్రభుత్వ శాఖలు వసూలుచేసే ఛార్జీలు బాగా తగ్గించడం జరిగింది. బాలల నిమిత్తం ప్రత్యేకంగా ఒక థియేటర్‌ను ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంకూడా వుంది. చలనచిత్ర పరిశ్రమాభివృద్ధికి సంబంధించిన వివిధ కార్యక్రమాలను చేపట్టేందుకై వినోదపుపన్ను నుండి కొంతభాగం కేటాయించి చలనచిత్ర అభివృద్ధినిధి ఏర్పాటు చేయడం అనేది చలన చిత్ర పరిశ్రమాభివృద్ధికి తీసుకునే చర్యల్లో ఒకటి. రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి మండలి, బాలల చలనచిత్ర సంఘం ఏర్పాటు చేయబడ్డాయి.

తెలుగు చిత్రాల నిర్మాణానికి హైదరాబాదు కేంద్రం కావాలంటే యింకా చేయవలసినది ఎంతోవుంది. ప్రభుత్వానికి వున్న ఆర్థిక వనరులు చాలా పరిమితమైనవి. ప్రభుత్వం కేవలం పునాది సంబరాలను సమకూర్చి యివ్వగలదు, చైతన్యస్ఫూర్తిని కలిగించడానికి దోహదకారి కాగలదు. చలనచిత్ర రంగంలోని సంపన్నులూ, పలుకుబడి గలవారూ దేశాభిమానంతో ముందుకొచ్చి యిక్కడ చలనచిత్ర పరిశ్రమాభివృద్ధికి ప్రాణప్రదమైన స్టూడియోలను నిర్మించడానికి పెట్టుబడులు పెట్టవలసివుంది. ఇక్కడ ఫ్లోర్ సౌకర్యాలు తగినంతగా లేవు. నిర్మాతలు యిక్కడకు రావడానికి యిదే పెద్ద ప్రతి బంధకముగా వుంటోంది. అందుకే చలనచిత్ర పరిశ్రమ అంతగా అభివృద్ధి చెందలేకపోతోంది. రాష్ట్రంలో చలనచిత్రాలు నిర్మించడంవల్ల యీ పరిశ్రమాభివృద్ధికి అనుకూల వాతావరణం ఏర్పడడమేగాక అనేకమందికి ఉపాధి సౌకర్యం లభిస్తుంది. రాష్ట్రానికి అమ్మకంపన్ను రూపంలోనూ, నిర్మాతలు హోటళ్ళలో బస చేసినందువల్లా యితరత్రా ఖర్చులు చేసినందువల్లా ఆదాయం రూపంలోనూ పరోక్షంగా లాభం చేకూరుతుంది.

—పి. వి. ఆర్.



"వన్యమృగ సంరక్షణ కృషిలో సహకరించండి"

వన్యప్రాణి సప్తాహం సందర్భంగా ప్రజలకు గవర్నరు విజ్ఞప్తి

"వన్యమృగ సంపదను సంరక్షించాల్సిన అవసరాన్ని గూర్చి, వాటి ప్రాముఖ్యాన్ని గూర్చి గుర్తు చేసుకొనేందుకు గాను గతంలో వలె యీసారికూడా 'వన్యమృగ సంరక్షణ వారోత్సవాన్ని' జరుపుకుంటున్నాం. పంధొమ్మిదవ శతాబ్దం ఉత్తరార్థంలోనే 'వన్యమృగాలను సంరక్షించాలి' అనే అభిప్రాయం ప్రచారంలోకి వచ్చినా, యింకా యిది ప్రజాహృదయాలలో గాఢంగా నాటుకుపోలేదనే చెప్పాలి.

వన్యమృగాలు ప్రకృతిలో అంతర్భాగం. ప్రకృతిలో ప్రతి ప్రాణికి తగిన స్థానం వుంది.

ఇటీవల రెండువందల సంవత్సరాల క్రితం వరకూ మన అడవుల్లో వన్యమృగ సంపద పుష్కలంగా వుండేది. జనాభా పెరిగి నివాసస్థలాల కోసం ఒత్తిడి ఎక్కువ కావడంతో పెద్దపెద్ద అటవీ ప్రాంతాలను కొట్టివేయవలసివచ్చింది. దానితో వన్యమృగాల సహజ నివాస ప్రాంతాలైన అరణ్యాలు క్రమక్రమంగా తగ్గిపోతూవస్తున్నాయి. ఈ విధంగా అరణ్యాలూ, తద్వారా వన్యమృగాలూ నిర్మూలన అయిపోతూండడం వన్యమృగాభిమానులు గుర్తించి, వన్యమృగ సంపద నాశనం కాకుండా వుండేందుకు చట్టాన్ని చేయవలసిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించేట్టు చేశారు. ప్రభుత్వానికి సంబంధించిన అరణ్యాలలో వేటను నిషేధిస్తూ మొట్టమొదటి సారిగా 1887 లో ప్రభుత్వం ఒక చట్టాన్ని చేసింది. 1930 లో అఖిలభారత స్థాయిలో వన్యమృగ సంరక్షణ మహాసభ ఒకటి జరిగింది. ఇటువంటి సమావేశం జరగడం అదే మొదటిసారి. ఆనాటి బ్రిటిష్ ఇండియా ప్రభుత్వ ప్రతినిధులే కాకుండా సంస్థానాల ప్రతినిధులు కూడా యీ సమావేశానికి హాజరయ్యారు. ప్రభుత్వము, ప్రకృతి సౌందర్యోపాసకులు నిరంతరంగా చేసిన కృషివల్ల వన్యమృగాల సంపద పరిరక్షణ, నిర్వహణలు సమర్థంగా జరగడానికై 'బ్లాక్ షూటింగ్ పద్ధతి' ప్రవేశపెట్టడం జరిగింది. స్వాతంత్ర్యం వచ్చాక వన్యమృగాలను సంరక్షించే అంశానికి మరింత ఎక్కువ ప్రాధాన్యం లభించింది. 1952 లో అధికారులతోనూ, సౌందర్యోపాసకులతోనూ 'వన్యమృగ సంరక్షణ' బోర్డు ఒకటి ఏర్పాటు చేయబడింది. వన్యమృగాలను పరిరక్షించే నిమిత్తం యీ బోర్డు జాతీయ పార్కులు, అభయారణ్యాలను ప్రారంభించింది. గిర్ అడవులలో భారతీయ సింహానికి పునరావాసం కల్పించడం యీ బోర్డు మొదట్లో చేపట్టిన పనులలో ముఖ్యమైనది. ఈ బోర్డు కృషి వల్లనే భారతీయ సింహం, మంచు చిరుత, మామూలు చిరుతపులి, యింకా అనేక రకాల వన్యమృగాలకు పూర్తి రక్షణ కల్పించబడింది. ప్రకృతిని, ప్రకృతి వనరులను పరిరక్షించేందుకు ఏర్పాటైన అంతర్జాతీయ సంస్థ సలహా మేరకు భారత దేశమంతటా పెద్దపులి వేటను ఇటీవలే నిషేధించడం జరిగింది. జాతీయ ఉద్యానవనాలు వన్యమృగ అభయారణ్యాలు ఏర్పాటు చేయబడ్డాయి. చట్టాన్ని గట్టిగా అమలుపరచే వుద్దేశంతో 1972 లో వన్యమృగ సంరక్షణ చట్టాన్ని భారత దేశమంతటా ప్రభుత్వం వర్తింప చేసింది. ఇది ఆంధ్ర ప్రదేశ్‌లో 1973 ఆగస్టు 4వ తేదీ నుంచి అమలులోకి వచ్చింది. మన రాష్ట్రంలో 4 వన్యమృగ అభయారణ్యాలు, ఒక పక్షుల రక్షిత స్థావరం, నెహ్రూ జూలాజికల్ పార్కు ఏర్పాటు చేయబడ్డాయి.


ప్రకృతిలోని సామరస్య క్రమాన్ని కాపాడే విషయంలో వన్యమృగాలు వహించే ముఖ్యమైన పాత్రను గురించి ప్రజలు గుర్తిస్తున్నందుకు చాలా సంతోషం. హాని కలిగించే జంతువులు విపరీతంగా పెరిగిపోకుండా అడ్డుకొనే రీతిలో వన్యమృగాల అలవాట్లు వుంటాయి. వన్యమృగాలు వాటి సహజ పరిసరాలలో చూడ్డానికి చాలా యింపుగా వుంటాయి.

వన్యమృగాలను సంరక్షించి, వాటిని పరిపోషించే కృషిలో ప్రభుత్వంతో సహకరించ వలసినదిగా ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. అందువల్ల దేశానికీ, రానున్న తరాలవారికీ మనం ఎంతో మేలు చేసిన వారమవుతాము." ★

బాపూజీ హరిజనోద్ధరణ

శ్రీ వి. మధుసూదనరావు

బాపూజీకి ఎంతో ఇష్టమైన పనుల్లో హరిజనోద్ధరణ చాలా ముఖ్యమైంది. మనదేశంలో మొత్తం జనాభాలో అయిదు కోట్లకు పైగా హరిజనులున్నారు. వాళ్లను క్రిష్టియన్లనరు. మహమ్మదీయులని అనరు. హిందువులని చెప్పలేరు. మరి వారెవరు? సవర్ణులు వారిని తమవాళ్లు అనుకోకపోయినా, తక్కిన జాతుల వాళ్లు వీళ్లను హిందువుల కిందే చూస్తారు. న్యాయానికి వారు ముమ్మాటికీ హిందువులే! కాని వారు చేసే వృత్తులవల్లా పరిశుభ్రంగా ఉండక పోవడం వల్లా, వారిని సవర్ణులు చేరనీయడం లేదు.



సవర్ణులు ఎన్ని అవమానాలు చేసినా, ఎన్ని కష్టాలు పెట్టినా 'మేము హిందువులమే!' అని హరిజనులు మొరపెడుతున్నా, సవర్ణులు కాదంటున్నారు. ఇది చాలా అన్యాయము, మారుతున్న సంఘాచారాలను బట్టి, వారు అస్పృశ్యులే అయినా, వారిని సంఘం నుంచి వెలివేయడము పాపము.

ఆధునిక యుగంలో ఏ తెగలకూ కట్టుబాట్లూ, నీతి నియమాలూ అంతగా లేవు. గిచినగీటు చెరిగిపోయింది. అయినా పూర్వపు సవర్ణులు ఈ రోజుకూడా సవర్ణుల లాగే, అస్పృశ్యులు అస్పృశ్యులలాగే చూడబడుతున్నారు. అలా సంఘనియమాల్ని తిరస్కరించి వారు, కొన్ని వేల సంవత్సరాల కిందటే నశించిపోయినా, వాళ్ల సంతతి ఈ రోజు మిగిలింది, తమ పూర్వులు చేసిన తప్పిదానికి ఈ రోజున వీళ్లనుభవిస్తున్నారు.

సవర్ణులు కూడా ఈ రోజు పేరుకు మాత్రమే. వాళ్లలో ఎవ్వరూకూడా క్రమవర్తనులు కారు. వీళ్లెలా సవర్ణులవుతారో మరి? పూర్వపు కట్టుబాట్లలో ఉంటే అది వేరేసంగతి. కానీ ఈ నాడు వీళ్లూ వాళ్లూ నైతికంగా ఒకే పడవలో ప్రయాణం చేస్తున్నారు.

ముఖ్యంగా ఆత్మ సంయమనము కలిగి, నిజానిజాలాలోచిస్తే అంతా సమానంగానే, ఈశ్వర సంకల్పంగానే తోస్తుంది.

హరిజనోద్ధరణము మహాత్ముడు, సవర్ణులమీది ద్వేషముతో చేయలేదు, ఇంగ్లండులో పాశ్చాత్యులకు కూడా తన నిర్ణయాన్ని చెప్పాడు, మొదట సవర్ణులకు విజ్ఞప్తి చేశాడు. కానీ వాళ్లు వినక, మత విషయంలో జోక్యం కలిగించుకుంటే, వర్ణసంకర దోషం వస్తుందేమోనని భయపడి అదే తెగకు (అస్పృశ్యులకు) సంబంధించిన ప్రభుత్వంతో మొరపెట్టుకున్నారు, హిందువులలో చీలికలు తేవాలని, సవర్ణులు అడగడంతోనే హరిజనుల్ని ప్రత్యేక తెగగా నిర్ణయించారు. ఇది రాజకీయ తంత్రం. మహాత్ముడు ప్రభుత్వానికి ఇది కూడదని చెప్పాడు. లాభం లేకపోయింది, ఇంక ఇలా కాదనుకున్నాడు.

1931లో రౌండ్‌టేబిల్ కాన్ఫరెన్స్‌లో హరిజనుల గురించి ఒక ప్రసంగం చేశాడు. 1932లో ఇండియా కార్యదర్శికి ఉత్తరం రాశాడు. బ్రిటిష్ ప్రధానికి ఉత్తరం రాశాడు. రెండు ఉత్తరాల్లోనూ ఆజన్మాంతం ఉపవాసం చేస్తానని రాశాడు. సమాధానం లేదు. ఇంక, ఇలా లాభంలేదని, 20–9–32 న మధ్యాహ్నం ఉపవాసం ప్రారంభించాడు. భారత దేశంలోనూ, తక్కిన ప్రాంతాల్లోనూ ఎంతో సంచలనం కలిగింది. మహాత్ముని విలువ ప్రపంచానికి తెలిసి వచ్చింది. ప్రభుత్వం మహాత్ముని కోరికను అంగీకరించింది, మహాత్ముడు ఉపవాస దీక్షను విరమించాడు. కానీ సవర్ణులు మాత్రం మారలేదు.

అస్పృశ్యులు అంటే వినడానికి బాగుండదని 'హరిజనులు' అని పేరు పెట్టాడు నిజానికి మనుషులంతా హరిజనులే కదా? ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా, అస్పృశ్యులయిన అమాయకుల్ని ఒక్క పేరుతోనే, సవర్ణులతో సమానుల్ని చేశాడు. మానవజాతి మీద మహాత్మునికీ, సనాతన సవర్ణులకూ ఎంత వ్యత్యాసముందో దీనివల్ల తెలుస్తోంది.

ఉపవాసం తర్వాత బాపూజీ ఇలా అన్నారు

"హిందూ మతస్థుల హృదయములందు పరివర్తనము కలుగునట్లొనర్చి, వారిని సక్రమ మరాపలంబుల నొనర్చుటకొరకే ఉపవాసము తలపెట్ట బడినది.

కొంతమంది మేధావులు, రాజకీయ విషయాల్లో హరిజనోద్యమాన్ని ప్రారంభించినందుకు బాపూజీని విమర్శించారు. కానీ ఆయన కేవలం రాజకీయ విషయాల్లో మాత్రమే మునిగిపోయిన రాజకీయ నాయకుడు కాదు. మత ప్రవక్త. మానవతావాది. తన జీవితవిధానంతో ప్రపంచ జాతుల్ని ఉద్ధరించిన మహాపురుషుడు. ఏ జాతికి సంబంధించిన వారైనా సరే! మహాత్ముని ఆదరణకు నోచుకున్నారు. అలాంటప్పుడు ఆయన హరిజనుల కష్టాల్ని చూచి ఊరికే ఎలా ఉంటాడు? జీవితాన్నంతా కేవలం రాజకీయాల్లోనే గడిపితే ఈ దురాచారాన్ని ఎవరు మాన్పురారు? ఆయనకు సవర్ణులనిగాని, అస్పృశ్యులనిగాని భేదభావం లేదు. అందరూ సమానమే. మనషులంతా దేవుడిబిడ్డలే! మరి దేవుడికి ఒకపిల్లలమీద హెచ్చు తగ్గుల దృష్టి ఉండదుకదా? అలాగే మహాత్ముడు భూతదయ కలవాడు.

మహాత్మునికి ఈ సమస్యా పరిష్కారంలో రాజకీయ సాంఘికపరమైన దృష్టి ఉంది. రాజకీయంగా ఆ రోజుల్లో స్వాతంత్ర్య సంపాదనకు మైనారిటీ సమస్య ప్రతిబంధకంగా ఉండేది. హిందూ, మహమ్మదీయ, క్రైస్తవ జాతులు స్నేహంగా ఉండగలవేగాని, జాతి, మత భేదాల్ని వదిలి ఒకటి కావుగదా? ఇలా మైనారిటీ సమస్య ఉన్నప్పుడు స్వాతంత్ర్యం రావడానికి హిందువులు, హరిజనులు వేరు వేరుగా ఉండడంవల్ల హిందువుల బలం తగ్గిపోతుంది. సాంఘికాచార బహిష్కృతులైనంత మాత్రాన, వారిని ప్రత్యేక తెగగా చూడడంతో వాళ్లు వేరే మతాల్లో కలిసి పోతారుకదా! వీళ్లనే హిందూమతంలో చేర్చుకుంటే, హిందువుల బలం ఎక్కువవుతుంది కదా! దీనివల్ల మూడు విధాలైన లాభాలున్నాయి. 1. హరిజన సమస్య తీరిపోతుంది 2. హిందువుల బలం ఎక్కువవుతుంది 3. ఎన్నో కష్టాలు పడుతున్న హరిజనుల జీవితాలు బాగుపడుతాయి. మహాత్ముడు ఇలా ఆలోచించి హరిజనోద్ధరణకు నడుం కట్టాడు. సవర్ణులూ ఇలా మారాలని ఆశించాడు.

హరిజనోద్ధరణ ఎందుకు?

అస్పృశ్యత మహా పాపం. మన తోటివారిని, సాటి మనుషుల్ని, ఎంతో నీచంగా చూచి దారుణ గా హింసించడం ఘోరం. మనుషులంతా సమానమే అయినపుడు, మనిషిగా బతకలేకపోవడానికి అతను చేసుకున్న పాపం ఏమిటి? 'ఆత్మ ఒక్కటే అయితే, ఈశ్వరుడు ఒక్కడే అయితే, అంటరానివాడనేవాడు ఉండనే ఉండడు,' అన్నారు బాపూజీ. ఏ కాస్త మానవత్వం ఉన్నవాడైనా, అంటరానితనాన్ని గానీ, హరిజనులను హింసించడంగాని ఒప్పుకోడు.

ఈ కార్యక్రమం ముఖ్యంగా మత సంబంధి, సర్వమానవ సమానత్వాన్ని బోధించే హిందూమతంలో—ఇలాంటి చెడుగు ఉంటే, అది ఆ మతానికి మచ్చలాంటిది. అలాంటి మచ్చ తొలగించి హిందూ మతాన్ని పరిశుద్ధి చేసి, నిష్కళంకంగానూ, పరిపూర్ణంగానూ చేయాలి. అందుకు హరిజనోద్ధరణ జరగాలి. హరిజనుల్ని కూడా హిందూమతంలో చేర్చుకోవాలి. దీనికి మొదట మనిషిపై మనిషికి విశ్వాసం కలగాలి. సవర్ణుడు, నిర్మల హృదయంతో హరిజనుణ్ణి ఆహ్వానించాలి.

కార్యకర్త

"అస్పృశ్యతా నివారణకు సత్యమూ, అహింస, ఆత్మవిశ్వాసమూ తప్ప మరేవీ తోడ్పడవు. పనికిరావు. ఈ దృష్టితో హరిజనుల గురించీ, అస్పృశ్యతా నివారణగురించీ, ఆలోచించారు బాపూజీ. అస్పృశ్యతా నివారణ సంపూర్ణ సత్యంతోనే సాధ్యం మతానికీ, విశ్వాసానికీ సత్యం పునాది. సత్యమే దైవమైతే మతంలో అసత్యానికి అసలేమీ తావు ఉండదు." అన్నారు మహాత్ముడు.

సత్యమూ, విశ్వాసమూ, సౌశీల్యమూ కార్యకర్తకు ఉండాలి. నిరాశ్రయులూ, నిస్సహాయులూ అయిన హరిజనులకు సేవచేయాలంటే సౌశీల్యత కావాలి. అది లేకుంటే ఉత్తమమైన మేధా సంపత్తి, కార్యదక్షత ఉన్నా లాభంలేదు. కార్యకర్తకు తను చెప్పేదానిలో పూర్తిగా విశ్వాసం ఉండాలి. విశ్వాసంలేకుండా వేరేవాళ్ళకు చెప్పడం ఆత్మవంచనే అవుతుంది. కేవలం చెప్పడమేకాదు. తను చెప్పింది, ఆచరింప చేయాలి. తానూ ఆచరించాలి.

సంస్కరణకు సంస్కర్త ఎంతగా ముందుకు వచ్చినా, చాలా చోట్ల, సవర్ణుల ఆధిక్యతకు నిలబడటం కష్టం. ఎందుకంటే వారి సంఖ్య ఎక్కువగా ఉంది. సవర్ణుల ధాటికి తట్టుకోలేక సంస్కర్త నిస్సహాయుడు కావడం, ప్రభుత్వం కూడా సంస్కరణల విషయంలో సవర్ణులమాట అవుననడమో, లేక వారిని ఎదిరించలేక అసహాయత ప్రదర్శించడమో జరుగుతుంది.

ఒకసారి ఏమయిందంటే — 'కవిత' (ఊరు) లో రాజపుత్రులుగా చెప్పబడేవారు, హరిజనులు తమ పిల్లల్ని బహిరంగ పాఠశాలకు పంపించినందుకు దయాదాక్షిణ్యరహితంగా సవర్ణులు చేసిన దాడిని ఎదుర్కోవాల్సి వచ్చింది. కతియవాడలో వివిధ ప్రాంతాల్లో గ్రామాల్లో పశువులకు అంటువ్యాధి వచ్చి చాలా చచ్చిపోయాయి. అలా పశువులు చచ్చిపోవడానికి, హరిజనులు వేసిన మంత్రాలే కారణమనే విశ్వాసంతో, వాళ్ళను ఎన్నోరకాలుగా హింసించారు. సవర్ణులకు వ్యాధుల రాకగురించి తెలియచెప్తే, ఈ హింస జరగకపోను అమాయకులైన హరిజనులను హింసించడం సమంజసమని జ్ఞానంకల ఏ సనాతనుడూ అనడు. పీడితులైన హరిజనులను కాపాడటానికి, ప్రభుత్వం అండ ఉండాలి. లేకుంటే వత్తిడి తీసుకురావాలి.

కార్యక్రమం

అంటరానివారుగా చూడబడుతున్న హరిజనులకు, అంటే మాల, మాదిగ, ఇంకా ఇతర కులాల వారిని ఉద్ధరించడానికి బాపూజీ ఈ క్రింది కార్యక్రమాలను చేపట్టారు.

1. హరిజనుల్లో పరిశుభ్రత, ఆరోగ్యం పెంపొందించడం.
2. వారు చేసే పాకీపని, తోళ్ళపని మొదలైన వృత్తులలో మేలురకం పద్ధతులు నేర్పించడం.
3. కుళ్లిన గొడ్లమాంసాన్ని తినడాన్ని నిషేధించడం.
4. మద్యపానానికి స్వస్తి.
5. హరిజనుల పిల్లల్ని పాఠశాలలకు పంపమని వారి తల్లిదండ్రుల్ని అడగడం.
6. వారిలోవారికి అస్పృశ్యలపై ఉన్న విశ్వాసాన్ని రూపుమాపడం.

మహాత్ముడు ప్రతిచోటా హరిజనవాడలకు వెళ్ళి వాటిని శుభ్రం చేసేవారు. హరిజనుల సభలను ఏర్పాటుచేసి వారి అవసరాలను తెలుసుకునేవారు.

దేవాలయ ప్రవేశం

సంస్కరణకు మొదటి మెట్టు హరిజనులకు దేవాలయ ప్రవేశం కలిగించటం. ఆ రోజుల్లో హరిజనులకు దేవాలయ ప్రవేశం ఉండేది కాదు. అయితే హరిజనుల దేవాలయ ప్రవేశం కంటే ముందుగా సనాతనుల అభిప్రాయం మారాలి. తాము హరిజనుల దేవాలయ ప్రవేశానికి ఆటంకం కలిగించడం అపరాధమని గుర్తించేలాచేయాలి దీనికోసం సంస్కర్తలకు, సనాతనులకు కొంత ఘర్షణ తప్పదు, హృదయానికి హత్తుకునేట్లు చెప్పి, సనాతనుల్లో సంస్కారం పెంచాలి.

హరిజనులకు దేవాలయ ప్రవేశం కలిగించడం విషయంలో మొట్ట మొదట తిరువాన్కూరు మహారాజుగారు మార్గదర్శకులయ్యారు, ఆయన్ను బాపూజీ, తక్కిన కాంగ్రెసు నాయకులే కాకుండా, తిరువాన్కూరు రాష్ట్రంలో ఉంటున్న వేలమంది హరిజనులు, మనస్ఫూర్తిగా మెచ్చుకున్నారు. ఆ నోరులేని అమాయక ప్రజలు ఆ వార్తవిని, ఎంత సంతోషించారో! తరతరాలనుంచీ, పవిత్రస్థలంగా చెప్పబడుతూన్న పద్మనాభస్వామి ఆలయం గోడ దగ్గరికైనా వెళ్లడానికి నోచుకోని వాళ్లకు ఒక్కసారిగా దేవాలయంలోకే వెళ్ళవచ్చనే సరికి, వాళ్లు ఎంత ఆనందించారో! ఈశ్వరుని పూజకందరూ అర్హులేకదా!

తర్వాత కొన్ని రోజులకు, కాంగ్రెసు సహాయంతో, మద్రాసు ప్రభుత్వం హరిజన దేవాలయ ప్రవేశపు బిల్లు ఒప్పుకుంది. రాజధానిలో ముఖ్యమైన దేవాలయాల్లోకి హరిజనులు రావచ్చన్నారు. కానీ సవర్ణులడ్డుతగిలారు. మత సంబంధమైన విషయాల్లో ప్రభుత్వానికి, ఏ హక్కూలేదని, జోక్యం కలిగించుకోకూడదనీ విమర్శించారు. కొంతమంది మహనీయులు, దయా హృదయులు, ఈశ్వర సంభూతులు, ఆలయాల్ని మూసి, వాటి కడ్డంగా ప్రాణాహారులు పడ్డారు. వాళ్ళల్లో విద్యాధికులు, మేధావులూ కూడా ఉన్నారు బహుశః భగవంతుణ్ణి తామొక్కళ్ళే చూడాలనేమో వాళ్ళ ఉబలాటం!

పారిశుద్ధ్యం

హరిజన వాడలలో మంచినీటి వసతి, నగరంలో ఉండేవారి వసతి కంటే, ఎంతో హీనస్థితిలో ఉంటుంది. బహిరంగ బావులున్నా సవర్ణుల పెత్తనంవల్ల వాటిమీద, హరిజనులకు హక్కులేదు. హరిజన వాడలలో మురికి పారుదల ఏర్పాట్లు, పరిశుభ్రమైన అన్ని వసతులు కలిగిన ఇళ్లు, రోడ్ల నిర్మాణం, వాడల పరిశుభ్రమైన మంచినీటివసతి-మొదలైన కార్యక్రమాలు అమలు జరపాలని, అస్పృశ్యతా నివారణ కార్యకర్తలు, పురపాలక సంఘాలకు గట్టిగా చెప్పాలి.

ఒకసారి బాపూజీ, 1915లో 'ప్రేక్‌బరీ' నుంచి ఒక హరిజన పిల్లవాడిని తన ఆశ్రమానికి తీసుకువచ్చాడు వచ్చినప్పుడు ఆ పిల్లవాడు మహారోతగా ఉన్నాడు. అతనికి ముఖం, చేతులూ, కడిగించి, క్షవరం చేయించి, స్నానం కూడా చేయించి, చక్కటి ఉతికిన గుడ్డలు కట్టించే సరికి, అతను, సభ్య కుటుంబాలకు చెందిన పిల్లాడిలా తయారయ్యాడు.

ఒరిస్సాలో ఒకసారి, ఒకచోట సంతర్పణ జరిగింది. అందరూ హడావిడిగా తొందరపడుతూ, అన్నం అంతా చిందరవందర చేసి, కింద చుట్టూ పారబోసి, చేతులనిండా అన్నం పులుముకుని, తింటూఉంటే, హరిజనుల పిల్లలు, ఎంతో శుచిగా, శుభ్రంగా తింటున్నారు. అది చూసిన గాంధీజీకి ముచ్చటేసింది. వీళ్లకు చెప్పాల్సిన రీతిలో చెబితే, సవర్ణులకే, మార్గదర్శకులు కాగలిగిన తెలివితేటలు వీళ్లలో ఉన్నాయి కదా అనుకున్నారు.

మొట్టమొదట హరిజనులకు పారిశుద్ధ్యం గురించి, పాఠశాల్లో నేర్పించాలి. పాఠశాలలో చేరిన మొదటి మూడు నెలలూ, పరిశుభ్రత గురించి పిల్లవాడు తెలుసుకోవాలి. ఆ తర్వాతే పాఠాల్లు.

నాగరికత బాగా ముదిరిపోయిన ఈ రోజుల్లోకూడా, ఇటు ప్రపంచంలో చాలా దేశాల్లో, చాలా ప్రాంతాల్లో అంటరానితనమనేది ఉంది. క్రిందటి సంవత్సరం ఆంధ్రప్రదేశ్‌లోనూ, ఇటీవలే బీహార్‌లోనూ, హరిజనులపై జరిగిన అత్యాచారాలు మనం పత్రికల్లో చూశాం. బయటికిరాని సంఘటనలు ఇంకా ఎన్ని ఉన్నాయో! ఈ దురాచారం ఒక్కొక్క దేశంలో, ఒక్కొక్క ప్రాంతంలో, ఒక్కొక్క విధంగా ఉంది. ఈ సనాతన దురాచారాన్ని రూపు మాపడానికి, అనేక దేశాలలో, ఎందరో సంస్కర్తలు, మహానుభావులు కృషి చేశారు. అయితే ప్రబలిపోయిన రాజకీయ, మత ప్రాబల్యాలవల్ల ఈ కృషి అంతగా ఫలించటం లేదు.


భారత దేశంలో, ఈ అంటరానితనాన్ని నిర్మూలించడానికి బాటవేసిన వాడు, మహాత్ముడు. ★

ఆంధ్రప్రదేశ్‌లో యాత్రాభివృద్ధి

ప్రపంచంలో నేడు యాత్రిక విషయాలఅభివృద్ధి ఒక పెద్ద పరిశ్రమస్థాయిలో జరుగుతున్నది. ముఖ్యంగా అభివృద్ధిజెందుతున్న దేశం లేక వెనుకబడివున్న రాష్ట్రీ ఆర్థిక ప్రగతికి యాత్రిక విషయాలు చాలా వరకు తోడ్పడుతున్నట్లు సర్వత్రా అంగీకరించబడింది. యాత్రల ఫలితంగా ప్రపంచంలో వివిధ ప్రాంతాల ప్రజలు ఒక చోట కలవడానికీ, పరస్పర సాంఘిక జీవిత విశేషాలను అవగాహన చేసుకోడానికీ వీలు ఏర్పడడమేగాక దర్శనీయమైన స్థలాలను చూచి ఆనందించడానికి కూడా ఒక మహత్తర అవకాశం కలుగుతుంది. సువిశాలమైన మనదేశంలో ప్రజలమధ్య సమైక్యతను పెంపొందించడానికి యాత్రికవిషయాలు ఎంతో దోహదం చేస్తాయి.

యాత్రిక విషయాల వల్ల ఏర్పడే సాంఘిక సత్పరిణామాలు అందరికీ సువిదితమే. యాత్రిక ప్రభావాలు బహుముఖంగా వుంటాయి. కనుక యాత్రాభివృద్ధి సందర్భంగా జరిగే ఖర్చు ఒక పెట్టుబడివంటిది. దీనివల్ల ఆర్థికవ్యవస్థ పటిష్ఠమవుతుందనే విషయం మనం గుర్తుంచుకోవాలి. యాత్ర అనేది భారత దేశానికీ, భారతీయ మనః ప్రవృత్తికీ క్రొత్తది కాదు. అనాది నుంచీ అతిథి సత్కారాల విషయంలో మన సాంప్రదాయం చాలా ఉత్కృష్టమైనదిగా పేరు పొందింది. "అతిథి దేవోభవ" అని వేదవాక్కే వుంది. అంటే యాత్రికుని కానీ, లేక ఇంటికి వచ్చిన అతిథిని కానీ, సాక్షాత్తు భగవత్ స్వరూపునిగా చూడాలని దీని భావం. ఆధునిక యాత్రికావసరాలు మన సంస్కృతిలో సమ్మేళనం కావడం చాలా అవసరం. విదేశీయాత్రికులను ఆకర్షించేందుకు విందులు, వినోదాలు ఏర్పాటు చేసేవిషయంలో పాశ్చాత్య పద్ధతుల్ని పాటించడం అవసరమనే





భావం సరియైనదికాదు. ఎందుకంటే, మనకు ఏవి ఉత్తమమని భావిస్తామో, వాటిని ఆచరించడమే సర్వవిధాలా మంచిది. ఈ దేశాన్ని దర్శనీయమైన దేశంగా తయారు చేయాలంటే, మనలో వుండే విశిష్టతను చాటి చెప్ప వలసివుంటుంది. విదేశీ మారక ద్రవ్యం ఆర్జించే విషయంలో యాత్రిక విషయములకు గల ప్రత్యేక ప్రాముఖ్యతను మనం తక్కువ అంచనాతో చూడకూడదు. అయితే యాత్రిక విషయాలను పెంపొందించడానికి ఇది ఒకటే మన పరమ లక్ష్యం కాదు.

అనధికార సంస్థల పాత్ర

నిధులు పరిమితంగా వున్నకారణాన కేంద్ర లేక రాష్ట్రీ ప్రభుత్వస్థాయిలోనే యాత్రికాభివృద్ధి పూర్తిగాచేపట్టడంసాధ్యంకాదు. యాత్రిక విషయాలను వివిధ అధికార, అనధికార సంస్థల సహాయ సహకార కృషి పైన అభివృద్ధి పరచవలసి వుంటుంది. యాత్రిక విషయాలశాఖ యాత్రిక విషయాలను ప్రోత్సహించే పాత్ర నిర్వహిస్తుంది. యాత్రాభివృద్ధికి అనువైన పరిస్థితులు కల్పించడం, అనుసంధాన శాఖగా వ్యవహరించడం, వివిధ సంస్థలు ఈ రంగంలో ప్రవేశించడానికి వీలుగా వాటి వివిధ కార్యకలాపాలను సమన్వయ పరచడం వాటిని తగువిధంగా ప్రోత్సహించడం, మున్నగు విధులను ఈ శాఖ నిర్వహిస్తుంది.

ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంతవరకు, ప్రజలలో యాత్రిక విషయాల పట్ల జిజ్ఞాస కల్పించడానికి చతుర్థ పంచవర్ష ప్రణాళికా కాలంలో కొంత కృషి జరిగింది. విదేశీ యాత్రిక విషయాలు యెంత ప్రధానమైనవో, దేశీయ యాత్రిక విషయాలు కూడా అంత ప్రధానమైనవి. దేశీయ యాత్రిక విషయాల అభివృద్ధికై కల్పించే సదుపాయాలన్నీ విదేశీ యాత్రికాభివృద్ధికి కూడా తోడ్పడుతాయి. యాత్రిక విషయాలలో ప్రత్యక్షంగాను, పరోక్షంగాను కూడా ఉపాధి కల్పనకు అవకాశాలు హెచ్చుగా వుంటాయి. ట్రావెల్ ఏజెన్సీలు నడపడం, రవాణాబండ్లు నడపడం నుంచి హోటళ్ళు నడపడం, యాత్రికులకు వినూత్న ఆకర్షణలు సృష్టించడం వరకు గల అనేక రంగాలలో విద్యావంతులైన నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి యాత్రిక విషయాలు దోహదం చేస్తాయి

ఆంధ్రప్రదేశ్‌లో యాత్రికులకు ఆసక్తి కల్గించే దర్శనీయమైన స్థలాలు అంటే వన్యమృగాల ప్రాంతాలు, సుందర సముద్ర

తీర ప్రాంతాలు, చరిత్రాత్మకమైన స్థలాలు, కళలకు కాణాచులైన సుప్రసిద్ధ దేవాలయాలు ఎన్నో వెలసివున్నాయి. శీతాకాలపు వినోద క్రీడలు తప్ప ఆంధ్రప్రదేశ్‌లో పలురకాలైన ఆకర్షణలు వున్నాయి.

ఈ సందర్భంలో గోల్కొండకోట, కుతుబ్‌షాహి రాజ వంశీకుల సమాధులు, వరంగల్లులోని కాకతీయుల కోట యాత్రికులను ఆకర్షించే సుప్రసిద్ధ చారిత్రక కట్టడాలకు మచ్చుతునకలుగా పేర్కొనవచ్చు. పాఖాలలోని వన్యమృగ సంరక్షణ కేంద్రం, విశాఖపట్నం బీచ్, దర్శనీయమైన స్థలాలుగా రాణిస్తున్నాయి. రాష్ట్రంలోని వివిధ యాత్రా కేంద్రాలు అక్కడికి వెళ్ళే మార్గాలు అక్కడ లభిస్తున్న సౌకర్యాలను విపులంగా వివరించి చెప్పడం ఉద్దేశంకాదు. అయితే యాత్రాభివృద్ధికై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని గురించీ, రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాల ఫలితంగా కేంద్రప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేసిన ప్రాజెక్టులను గురించీ చెప్పవలసివుంది. ఈ విషయంలో ఇంతవరకు సాధించింది స్వల్పమే అయి వుండవచ్చు. అయితే యాత్రాభివృద్ధికి కొన్ని నిర్దుష్టమైన చర్యలు తీసుకోవడం జరిగిందనీ, తత్ఫలితంగా భారత యాత్రా చిత్రపటంలో ఆంధ్రప్రదేశ్‌కు సముచితస్థానం కల్పించడం జరిగిందనీ మనకు స్పష్టంగా గోచరిస్తుంది.

హైదరాబాదు నగరం

రాష్ట్ర రాజధాని హైదరాబాదు నగరం యాత్రా నగరంగా వాసికెక్కింది. దీనికి గొప్ప చరిత్ర వుంది. దేశంలో దీనికి ఒక విశిష్టమైన స్థానంవుంది. ఉత్తరదక్షిణాపథాలకు మధ్య యిది భౌగోళికంగానే కాకుండా సాంస్కృతికంగా, భాషా విషయికంగా కూడా ఒక కూడలి స్థానం వలె విరాజిల్లుతున్నది. ఈ దృష్ట్యా, దేశ సమైక్యతకు ఒక బలిష్టమైన శక్తిగా ఈ మహానగరం రూపొందింది. ఇక్కడ చార్మినారు మక్కామసీదు వంటి చారిత్రిక కట్టడాలతో పాటు అపూర్వ కళాఖండాలకు నిలయమై, ఖండఖండాంతరాలలో కీర్తి నార్జించిన సాలార్ జంగ్ మ్యూజియం వెలసివుంది. నెహూర్ జూలాజికల్ పార్కు చరిత్రపూర్వక జంతుజాతులను తెలిపేపార్కు, సఫారి పార్కు హైదరాబాదు నగరంలోవున్న వినూత్న ఆకర్షణలు. చూపరులకు ఆకర్షణీయంగా వున్న సహజ సిద్ధమైన శిలలు, సరస్సులు ప్రకృతి సౌందర్య శోభను ఇనుమడింప చేస్తున్నవి. వన భోజనాలకు అనుకూలమైన ఉస్మాన్‌సాగర్ వద్ద సర్వ సౌకర్యాలతోకూడిన రెండు అతిథి గృహాలున్నాయి. వీటికి తోడుగా కొత్తగా ఒక వన భోజనశాల కూడా నిర్మించడం జరిగింది. హుసేన్‌సాగర్ వద్ద యువజన హాస్టలు ఇప్పుడు నిర్మాణ దశలో వుంది. ఈ భవన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఇక్కడ సరసమైన రేట్లకు యువ యాత్రికులకు వసతి సౌకర్యాలు కల్పించబడినాయి. ఈ హాస్టలునుంచి కనిపించే ప్రకృతి దృశ్యం, మనోరంజకంగా, కన్నుల పండువుగా వుంటుంది. రాష్ట్ర రాజధానిలోని ప్రముఖ కట్టడాలలో ఈ యువజన హాస్టలు ఒకటి.

హైదరాబాదు, నాగార్జునసాగర్ యాత్రా స్థలాలను ఢిల్లీ, [illegible], ఆగ్రా స్థలాలతో పోల్చవచ్చు. దేశంలో మానవ [illegible] పెదది, ఎత్తైనది, పెద్దరాతి కట్టడపు డాము అయిన నాగార్జునసాగర్ రాష్ట్రంలోని యాత్రా స్థలాల్లో మకుటాయమానమైనది. ఈ సరస్సులో అపూర్వమైన ద్వీపవస్తు ప్రదర్శనాలయంలో అపురూపమైన ప్రాచీన బౌద్ధశిల్పకళాఖండాలు ప్రదర్శించబడి వున్నాయి. అంతర్జాతీయ యాత్రాకేంద్రంగా కేరళలోని కోవలం, తమిళనాడులోని మహాబలిపురం వలె మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా నాగార్జుసాగర్‌ను అభివృద్ధి పరచడానికి రాష్ట్రప్రభుత్వం సంకల్పిస్తున్నది. కేంద్రం నాగార్జున సాగర్‌లోని అతిథి గృహాల నిర్వహణను తన అధీనంలోకి తీసుకొని వాటిల్లో భోజన వసతి సౌకర్యాలను ఇతోధికంగా ఏర్పాటు చేసి అక్కడ రోడ్డు జలప్రయాణ సౌకర్యాలు కల్పించడానికి తగిన డబ్బు ఖర్చుపెట్టడానికి కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఒప్పించగలిగింది. ఉత్తరోత్తరా యాత్రిక విషయాల దృష్ట్యా నాగార్జునసాగర్ భారీయెత్తున అభివృద్ధి చెందగలదని ఆశింపబడుతున్నది. శ్రీశైలంలో సుప్రసిద్ధ పవిత్ర దేవాలయ వుంది. అక్కడ జలవిద్యుత్కేంద్రం నిర్మించడం జరుగుతున్నది. నాగార్జున సాగర్ నుంచి శ్రీశైలం వరకుగల అరవైమైళ్ళ జలమార్గం రమణీయమైన దృశ్యంతో కూడి వుంది. ఇది ఈ ప్రాంతపు యాత్రిక శోభను యినుమడింప చేస్తున్నది.

నాగార్జునసాగర్‌లో ఫెర్రీపాయింటు వద్ద యాత్రికుల కొరకు ఒక ఆశ్రయమందిరం విజయపురి నగర ద్వారం వద్ద డ్రైవ్-ఇన్ కౌంటర్ నిర్మించడం జరిగింది. నాగార్జునసాగర్, నాగార్జునకొండ వద్ద యాత్రికుల సౌకర్యాలను అభివృద్ధి పరచడం జరిగింది. నాగార్జునకొండ ద్వీపానికి విద్యుచ్ఛక్తి సరఫరా చేయడానికి వీలుగా ట్రాన్స్‌మిషన్ లైనులు వేయడం జరుగుతుంది. భారత ప్రభుత్వ యాత్రిక విషయాల శాఖ ద్వారా ఇక్కడ రెండు లాంచీలను త్వరలోనే ఏర్పాటు చేయడం జరుగుతుంది. నాగార్జున సాగర్‌కు విమానయాన సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర యాత్రిక విషయాల శాఖ ఒక సూచన చేసింది.

విశాఖపట్నం జిల్లాలోని గిరిజన ప్రాంతంలో ప్రకృతి సంపదతో అరకులోయ సుందరతమంగాను, నేత్రపర్వంగాను శోభాయమానంగాను విలసిల్లుతూ యాత్రికులను ఆకర్షిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికానిధులతో యిక్కడ యాత్రికుల విశ్రాంతిగృహం నిర్మించబడుతున్నది. నిర్మాణం పని చురుకుగా కొనసాగుతున్నది. విశాఖపట్నంలోని లాసన్స్ సముద్రతీరం అసంఖ్యాకులైన యాత్రికులను ఆకర్షిస్తున్నది. విశాఖపట్నం-అరకులోయ, మధ్య ఉన్న బొర్రగుహలు కర్బనం శిలలను నమూనాలుగా పేర్కొనవచ్చు. ఈ గుహలను సందర్శించడానికి వీలుగా మెట్లు నిర్మించడం జరిగింది. దుక్కయినుము రవాణానిమిత్తం బొర్రగుహలు మార్గంగా విశాఖపట్నం నుండి అరకులోయకు రైలుమార్గం నిర్మించబడింది. సుందరమైన లోయల ప్రకృతి దృశ్యాలను యాత్రికులు తిలకించడానికి వీలుగా యీ మార్గంలో ప్యాసింజరు రైళ్లను నడపాల్సిందిగా రైల్వే శాఖను కోరడం జరిగింది.

కృష్ణాజిల్లా మచిలీపట్నం సమీపంలోని మంగినపూడి బీచి యాత్రావిహార కేంద్రంగా రూపొందించబడుతున్నది. బీచి పొడుగునా విద్యుద్దీపాలు నెలకొల్పారు. సముద్రం వరకు డాంబరురోడ్డు

నిర్మించారు. రాష్ట్ర యాత్రా వ్యవహారాలశాఖ పెట్టిన మామూలు పెట్టుబడులతోపాటు జిల్లా అధికారులు అందజేసిన అసామాన్యమైన సహాయసహకారాలకు కృతజ్ఞతలు అందజేస్తున్నాము. స్నాన సౌకర్యాలతో కూడిన లాంజ్, ఫ్లడ్‌లైట్లతో కూడిన చిన్న ఉద్యాన వనం నిర్మించబడింది. ప్రకాశంజిల్లా, చీరాల సమీపంలోని వాడ్రేవు బీచిలో విశ్రాంతిగృహాన్ని, ఆదిలాబాదుజిల్లాలోని పోచారం జలపాతం సమీపంలో యాత్రిక పెవిలియన్ నిర్మించడానికి నిధులు మంజూరుచేశారు. కాకినాడలోని పడవ నిర్మాణకేంద్రంలో నిర్మించ బడిన ఆరు చిన్న పడవలు, ఒక ఫైబర్‌గ్లాస్ పడవను ఖమ్మంజిల్లా లోని వైరాప్రాజెక్టులోను, కాకినాడ, హైదరాబాదులోని హుస్సేన్ సాగర్ చెర్వులోను వినియోగించాలని నిర్ణయించారు. హుస్సేన్ సాగర్‌ను అభివృద్ధిపరచి, సుందరంగా తీర్చిదిద్దడానికి సూచనలుచేసే నిమిత్తం రాష్ట్రప్రభుత్వం ఏర్పాటుచేసిన హుస్సేన్‌సాగర్ సౌంద ర్యీకరణ సంఘం తమ పనిని త్వరితగతిని కొనసాగిస్తున్నది.

లగ్జరీ బస్సులు


లాభార్జనదృష్టితోకాక యాత్రికాభివృద్ధికి యాత్రికుల ప్రయో జనదృష్టితో రాష్ట్రయాత్రిక విషయాలశాఖ మూడు లగ్జరీమినీ బస్సులను దర్శనీయస్థలాల సందర్శన నిమిత్తం నిర్వహిస్తున్నది. ఇవి విశాఖపట్నం, విజయవాడ, వరంగల్లులలో ఉన్నాయి. అరకు లోయ, అమరావతి, నాగార్జునసాగర్, ప్రఖ్యాత రామప్ప దేవా లయం, వరంగల్లుజిల్లాలోని పాఖాల వన్యమృగ సంరక్షణ కేంద్రాలకు వెళ్తాయి వాటితోపాటు ప్రతిరోజు దర్శనీయస్థలాల సందర్శన కార్యక్రమాన్నికూడా నిర్వహించడం జరుగుతున్నది. దానికితోడు, భారత యాత్రికాభివృద్ధి కార్పొరేషన్‌వారు హైదరాబాదులో ప్రతి రోజు దర్శనీయస్థలాల సందర్శన నిమిత్తం ఒక బస్సును నిర్వ హిస్తున్నారు. అంతేగాక వారానికి ఒకసారి నగరం నుండి నాగార్జునసాగర్‌కు కూడా బస్సును నిర్వహిస్తున్నారు. విశాఖపట్నం తిరుపతి, వరంగల్లులలో ఉన్న మూడు ప్రాంతీయ యాత్రికకేంద్రా లను అభివృద్ధిపరచడం జరిగింది. రాష్ట్ర యాత్రిక సమాచార కేంద్రాన్ని బషీర్బాగ్‌లోని కూడలిస్థలంలో ఉన్న భవనానికి మార్చారు. ఈ భవనంలోనే ఐ.టి.డి.సి ట్రావెల్, ట్రాన్స్‌పోర్టు యూనిటును ఏర్పాటు చేశారు. విశాఖపట్నంలోని విమానాశ్రయంలో యాత్రిక విషయాలు, చేతిపరిశ్రమ వస్తువుల విక్రయకేంద్రం యిదివరకే పని చేస్తున్నవి. హైదరాబాదు విమానాశ్రయంలోకూడా త్వరలోనే యాత్రిక సమాచార విభాగం ఏర్పాటు చేయబడుతుంది. కొత్తఢిల్లీ లోని యాత్రిక సమాచార కేంద్రం యిప్పుడు కొత్త భవనంలోకి మార్చబడింది. అక్కడే లేపాక్షి పరిశ్రమల విక్రయశాలకూడా నిర్వహించబడుతున్నది.

ప్రస్తుతం ఉన్న యాత్రికుల విశ్రాంతిగృహాలను అభివృద్ధి పరచడానికి గత నాలుగు సంవత్సరాలుగా తీవ్రంగా కృషి జరుగు తున్నది. యాత్రా వ్యవహారాల సాహిత్యాన్ని ప్రచురించడానికి ప్రయ త్నాలు జరుగుతున్నాయి. సర్వే ఆఫ్ ఇండియా శాఖవారిసహకారంతో రాష్ట్ర యాత్రావిషయాల చరిత్ర పటం ప్రచురించబడుతున్నది.


యాత్రిక విషయాలపద్దు క్రింద మన రాష్ట్రంలో ప్రణాళి కలు, ప్రణాళికేతర బడ్జెటులో చాలా తక్కువ మొత్తాలు కేటాయిం చబడినప్పటికీ, కేంద్రప్రభుత్వం నుండి ఎక్కువ నిధులను ఆకర్షిం చడం గమనార్హమైన విషయంగా పేర్కొనవచ్చు. నూటికి నూరు శాతం కేంద్రప్రభుత్వ ఖర్చుపై చార్మినారును ఫ్లడ్‌లైట్లతో అలంక రించారు. చార్మినారు లోపలి భాగములో కూడా యిటువంటి ఏర్పాటుతో సుందరంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటు న్నారు. ఒక యువజన హాస్టల్‌తోపాటు అంతర్ రాష్ట్ర యాత్రి కుల కేంద్రమైన కర్నూలు జిల్లా మంత్రాలయంలో రూ. 5 లక్షల ఖర్చుతో యాత్రిక విశ్రాంతి గృహాన్ని నిర్మిస్తున్నారు. 24 డబుల్‌బెడ్ రూములు, యితర రెండుగిదులు దానిలో ఉంటాయి. అదేవిధంగా వరంగల్లులో కూడా రు. 8 లక్షల ఖర్చుతో యిటువంటి విశ్రాంతి గృహాన్ని నిర్మిస్తారు. ఈ రెండింటి నిర్మాణం ఖర్చును పూర్తిగా కేంద్ర ప్రభుత్వం భరిస్తుంది. సఫారీ పార్కు నిర్మాణం పూర్తి కావచ్చింది. దీని నిర్మాణం ఖర్చు లను పూర్తిగా .కేంద్రం యిస్తున్నది. ఈ పార్కు అపూర్వమైన దిగా చెప్పవచ్చు ఒకవైపు వన్యమృగాలు స్వేచ్ఛగా తిరుగుతూ ఉంటే యాత్రికులు అద్దాలతో మూసివేయబడిన మినీ బస్సులో మరొకవైపు నిర్భయంగా వాటిమధ్య విహరింపవచ్చు. ఈ మినీ బస్సునుకూడా కేంద్రప్రభుత్వమే బహూకరించింది. హైద్రాబాదులో మీర్‌ఆలం చెరువు సమీపంలో క్యాంపింగ్ శిబిరాన్ని ఏర్పాటుచేయ డానికి కూడా కేంద్ర యాత్రికశాఖ అంగీకరించింది. ఆంధ్రప్రదేశ్‌లో యాత్రికాభివృద్ధి విషయంలో అత్యంత శ్రద్ధాసక్తులు చూపుతూ, కొన్ని పథకాలకు పూర్తి ఆర్థికసహాయం అందజేస్తున్నందుకు కేంద్రప్రభుత్వానికి రాష్ట్రప్రభుత్వం కృతజ్ఞతలు అందజేస్తున్నది. హుస్సేన్‌సాగర్‌వద్ద కొత్త సచివాలయం ప్రదేశం సమీపంలో ఐ.టి.డి.సి వారు 5స్టార్ లగ్జరీ హోటల్‌ను నిర్మించడానికి కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించడం హర్షదాయకం. దీని కొరకు రాష్ట్రప్రభుత్వం దాదాపు 10 ఎకరాల భూమిని అందజేస్తు న్నది. బెంగుళూరులోని అశోకహోటల్ మాదిరిగా నిర్మించబడే యీ హోటల్ నిర్మాణం రాష్ట్రానికి ఒక మణిపూసవంటిది. దీనివల్ల పెరుగుతున్న యాత్రికుల అవసరాలు తీర్చవచ్చు. చరిత్రాత్మకమైన గోల్కొండకోటలో ధ్వని కాంతి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయ డానికికూడా కేంద్రప్రభుత్వం అంగీకరించింది. ప్రజల జీవన ప్రమా ణాల పెంపుదలకు జాతి చేస్తున్న మహత్తరకృషిలో యాత్రిక విషయాలు ఎంత చిన్నదైనప్పటికీ ఆ కృషిలో భాగంగానే ఉంటుంది, మన పరిసరాల ప్రకృతి సంపదను, శిల్ప కళాఖండాలను మానవ నిర్మిత అద్భుతాలను భద్రపరిచి, సంరక్షించడం యాత్రిక విషయాలలో ప్రధాన విభాగం. మనలోని మంచి అంశాలను సంర క్షిస్తూ, చెడును తొలగించే విధంగా యాత్రికవిషయాలపై మన దృక్పథం ఉండాలి. మన జీవితవిధానాలను, సాంస్కృతిక సంప దను మనం భద్రపర్చుకుంటూ మన వారసత్వాన్ని పెంపొందిం చుకోవాలి. పాశ్చాత్య సంప్రదాయాలను గుడ్డిగా అనుసరిస్తున్నట్టుగా మనం విదేశీయాత్రికులకు చూపరాదు. "ఇది మా భారతదేశం. ఇది మేము నిర్మించుకుంటున్న భారతదేశం, మేము గర్వంగా చెప్పుకో దగిన భారతదేశం యిదిగో," ఇవీ మనం మన విదేశీయాత్రికులకు చెప్పాల్సిన విషయాలు.

—పి. వి. ఆర్.

వార్తా చిత్రాలు



ప్రణాళిక, సహకారశాఖ కార్యదర్శి శ్రీ బి.పి.ఆర్. విఠల్ ఆగస్టు 2న రాష్ట్ర పంచవర్ష ప్రణాళికపై కొత్తఢిల్లీలో ఏర్పాటైన పార్లమెంటు సభ్యులు తదితరుల సమావేశంలో ప్రసంగించారు. శ్రీ జి. ఎస్. మేల్కోటే, ఎం.పి. (మధ్యన వున్నవారు) యీ సమావేశానికి అధ్యక్షత వహించారు.



ఈ సమావేశానికి హాజరై చర్చలలో పాల్గొన్న పార్లమెంటు సభ్యులు, ప్రభుత్వ సీనియర్ అధికార్లు మొదలైనవారు

పరిపాలనా విషయాలు

ఆంధ్రప్రదేశ్ అధికారభాష

దిగువ తెల్పిన ప్రభుత్వ కార్యాలయాలలో చట్ట సంబంధం కాని అధికార ఉత్తర ప్రత్యుత్తరాలలోను, అదే కార్యాలయాలలో దిగువ తెల్పిన అధికార వ్యవహారాలలోను, 1973 అక్టోబరు 1వ తేదీనుండి తెలుగు భాషను ఉపయోగించాలనీ, ఇంగ్లీషును వాడ రాదనీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశించింది.

దేవాదాయ ధర్మాదాయ శాఖ

జిల్లా స్థాయిలో దేవాదాయ, ధర్మాదాయశాఖ క్రింద ఉన్న అన్నికార్యాలయాలు—

(1) తనిఖీ నిమిత్తం, పూజల నిమిత్తం, యితర కార్యాలపై అధికారులు, ప్రముఖులు సందర్శించే విషయం తెలియ జేయడం. (2) గ్రామాధికారులు, దేవాదాయం మొదలైన సంస్థల అధికారులను పిలిపించడంలోను, గ్రామచావిడీలు, పంచాయతీ కార్యాలయాలు, సంబంధిత సంస్థలలో ప్రదర్శించే నోటీసులలోను, బహిరంగ ప్రదేశాలలో అంటించే నోటీసులలోను తెలుగువాడాలి, (3) చట్ట బద్ధమైన నివేదికలు తయారు చేయడానికి, సమర్పించడానికి సంబంధించిన ఆదేశాలు, యాజమాన్యానికి చెందిన నివేదికలు, బ్యాంకుల నుండి నిధులు తీసుకోడానికీ, మిగులు మొత్తాలను జాతీయ పొదుపు సర్టిఫికెట్లు, జాతీయరక్షణ సర్టిఫికెట్లు, రాష్ట్ర అభివృద్ధి ఋణాలు, యితరజాతీయ ప్రణాళిక ఋణాలలో మదుపుచేసే విషయాలలో నివేదికలు తయారుచేయడం, (4) తెలుగులో వచ్చిన లేఖలకు సమాధానాలు యివ్వడం, (5) ప్రజలతోను, గ్రామాధికారులతోను, గ్రామ పంచాయతీలు, పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్తులతోను, దేవాదాయ, ధర్మాదాయ శాఖకుచెందిన ఎగ్జిక్యూటివ్ సంస్థలు, ఇనస్పెక్టర్లతో ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులో జరపాలి.

విద్యా శాఖ

జిల్లా స్థాయిలో విద్యా శాఖకు చెందిన అన్ని కార్యాలయాలు–(1) ప్రజలతోను, గ్రామాధికారులు, గ్రామ పంచాయతీలు, పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్తులతో జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలు, (2) జాతీయోత్సవాలు, యితర అంశాలు, (3) తెలుగులో వచ్చిన లేఖలకు సమాధానాలు, (4) పీరియాడికల్ రిటర్న్స్, పర్యటనడైరీలు, సమీక్షలు: ప్రాథమిక, అప్పర్ ప్రాథమిక, సెకండరీ పాఠశాల తనిఖీ నివేదికలు, (5) ఎలిమెంటరీ పాఠశాలల గుర్తింపు, సహాయం మంజూరుచేసే ఉత్తర్వులు, (6) జిల్లా విద్యా శాఖాధికారులు, పాఠశాలల గజిటెడ్ ఇనస్పెక్టర్లు ఎలిమెంటరీ పాఠశాలల తనిఖీ వ్యాఖ్యలను తెలుగులోనే నమోదు చేయాలి, (7) సబార్డినేటు కార్యాలయాలతోను, ప్రజలతోను ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే జరపాలి. (8) తెలుగులో వచ్చిన లేఖలకు సమాధానాలు, (9) పాఠశాలల గజిటెడ్ ఇనస్పెక్టర్ల తనిఖీ నివేదికల సమీక్షలు, (10) విద్యా విషయకమైన లెక్కల వివరాలు, రిటరన్సు, (11) అన్ని పాఠశాలల వార్షిక నివేదికలు, (12) ఆడిట్ నివేదికలు, (13) బదిలీలు, నియామకాలు, (14) బిల్లులు, అక్కౌంట్లు, అక్కౌంటెంటు జనరల్‌తో సంప్రదించి తగు ఫారాలు రూపొందించాలి, (15) ఉపకార వేతనాలు, పరీక్షలు (16) జి. పి. ఎఫ్, పింఛను సెలవుకు సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలు, ఉత్తర్వులు, (17) శిక్షణ కోర్సులలో ప్రవేశానికి చెందిన దరఖాస్తులు, (18) ఉపాధ్యాయుల సంక్షేమనిధి, (19) సాహిత్య, కళా రంగాలలోని వ్యక్తులతో పాఠశాలల డిప్యూటీ ఇనస్పెక్టర్లు జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలు, (20) పాఠశాలల డిప్యూటీ ఇనస్పెక్టర్లు, బ్లాకుఅభివృద్ధి అధికారులు, మునిసిపాలిటీలు, జిల్లా పరిషత్తుల కార్యదర్శులు, సంస్థ అధిపతులతో జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలకు తెలుగు వాడాలి.



ఇది నా దేశం, ఇది నా భాష, ఇతడు నా నేత, ఈ నా దేశాన్ని ఇతరులు ఆక్రమించుకుంటే సహించలేను. ఈ నా భాషను ఇతరులు యీసడిస్తే ఒప్పుకోను, ఈ నేతల పరులు పరాభవిస్తే క్షమించను. నా భూమి దివికన్నా అందాలదీవి. నాభాష దేవతల భాషకన్నా తియ్యనిది. నా నేత సకల సౌభాగ్య విధాత.

ఇట్లు ప్రతి ఒక్కడూ భావించిననాడే పరువుగా ఏదేశమైనా బ్రతుకుతుంది. దురదృష్టవశాత్తూ కర్మ సిద్ధాంతం పాతుకుపోయి, మన దేశంలో నిరుపమానమైన వీరగాథలు నివురుగప్పిన నిప్పులయ్యాయి. పరాక్రమ గాథలు పరగడుపయినవి. ప్రాచీన కాలం నుండీ భారతదేశం పరుల దండయాత్రా పరంపరలకూ పరస్పర ప్రాంతీయ విద్వేషాలకూ లోనైనప్పుడు సహితం ఆత్మగౌరవాన్ని విస్మరించలేదన్న సత్యాన్ని అద్యతన నిస్తేజం అగౌరవిస్తూవున్నది.

నేటి అవసరమే—మన తాతముత్తాతల వీర వారసత్వం. వినిపించాలి మళ్లీ వాళ్ల సింహ గర్జన. విశదపర్చాలి మన కర్తవ్యం. చెవి యొగ్గి వినేవాడు వుంటే తెనుగు దేశంలోని ప్రతిరాయి ప్రాచీన పౌరుష గాథలని వినిపిస్తుంది. తెనుగు పట్టణాల మహోజ్వల చరిత్రల విత్తనాలు, భూమాత ఒడిలో నిద్రపోతున్న కట్టడాలు శాసనాలు తవ్వి రేపటి పౌరుల తలకెత్తడం మనకర్తవ్యం.

అయ్యో! ఆధునిక భారతీయుడు ఆంజనేయుడు. తన బలం తాను తెలుసుకోనేరడు. ఎవరికీ తీసిపోనట్టి ఎంతోచరిత్ర తనకున్నదనిన వాస్తవాన్ని మరిచిపోయి అన్యుల వాస్తవాన్ని జపిస్తాడు. అమరావతి, ధరణికోట, విజయపురి,వినుకొండ, గుడివాడ, బెజవాడ ప్రతిచోట ఒక భండన భీముడు, అసమాన అరిందలుడు ఆదిలో ప్రభవించారు. ఆసేతు శీతనగ పర్యంతమూ అందులో కొందరు విజయ విహారం చేశారు. పన్నెండువందలేళ్ల క్రిందట పరాక్రమ రుద్రుడు పండరంగుడు భారతదేశపు పదిదిక్కులా తెనుగు కాంతులు ప్రజ్వలింపజేశాడు. అతడి కీర్తి ఆ నాడు బెజవాడలో మారు మ్రోగింది, అక్కడి కొండలు ఆ గానాన్ని ప్రతిధ్వనించాయి. నాటి పాట నేటికీ ఆంధ్రలోని అణువణువూ ఆలపిస్తూన్నది. పన్నెండు వందలేళ్ల క్రిందట పండరంగుడు "ఇదినాదేశం ఇది నా భాష ఇతడు నా నేత ఈ నా దేశాన్ని ఇతరులు ఆక్రమిస్తే నేను సహించను: ఈ నా నేతను పరులు పరాభవిస్తే క్షమించను" అని ప్రతిజ్ఞ పట్టినాడు. చేసిన శపథం చెల్లించుకొనిన వీరుడు పండరంగుడు. చండచాళుక్య తేజాన్ని దేదీప్యమానంగా వెలిగించినవాడు పండరంగ నాయకుడు.

అనుపమానమైన అతని జీవిత చరిత్ర నేడూ, రేపూ ఎల్లప్పుడూ జాతీయ ఉత్తేజానికి దివ్య ఔషధం. ఆ చరిత్రను మననంచేసే యీ గాథ నేటి మనకు వీర వ్యాపకం.

* * * *

కుమారస్వామి జాతర కోలాహలంగా సాగుతూంది. డప్పులు డోళ్లు, బాకాలు మొదలయిన వాద్యాల నాదాలు తాళయుక్తంగా వినిపిస్తున్నాయి. చెవులతుప్పు వదలకొడుతున్నాయి, వాద్యాల శబ్దాన్ని అధిగమించి జనం కలిసికట్టుగా పాడుతున్నారు.

"చేదుకో కొమరయ్య చేబ్రోలు కొమరయ్య
చేదుకో కొమరయ్య చేబ్రోలు కొమరయ్య
యేడాదికోమారు యీ ఊరి కొచ్చేవు
బెజవాడ వాసుల్ని ప్రీతితో బ్రోచేవు
చేదుకో కొమరయ్య చేబ్రోలు కొమరయ్య"

కొండ పైపైకి పోతున్న కొద్దీ జాతర కోలాహలం తగ్గుతూంది. కొండపైకెక్కుతూ "పండరంగా" "పండరంగా" అని యెలుగెత్తి పిలుస్తున్నారు విజయాదిత్యుడూ, అతగాని తమ్ముడు యుద్ధమల్లుడూ. బెజవాడ కొండలమీద తమ స్నేహితుని కోసం వెతుకుతున్నారు. "పండరంగా! పండరంగా! పండరంగా!" అన్న పిలుపు కొండలలో ప్రతిధ్వనిస్తూంది. యెలుగెత్తి పిలుస్తున్న ఆ పిలుపునకు ఎక్కడ నుంచీ 'ఓయ్' అని సమాధానం రావడంలేదు "ఇక్కడే ఈ కొండపైనే పండరంగుడు తప్పక ఉంది తీరాలి. బదులు పలకడేం?" విజయాదిత్యునిలో విసుగుదల జనించసాగింది. పండరంగుడు పర్వతంపైకి రాలేదా? ఎందుకు రాడు? సూర్యుడు తూర్పుదిక్కున ఉదయించడం మానినా మానవచ్చును గాని పండరంగుడు ప్రతిదినం ఇంద్రకీలాద్రి పైనెక్కి సుందరమైన బెజవాడను చూడకుండా ఉండలేడు. మరి పలకడేం? 'నెచ్చెలికి నాపై నిర్లక్ష్యమా?' విసుగుదలలో రాకూడని తలంపులు కూడా వస్తాయి. అలా రాకపోతే అతగాడు మనిషి ఎలా అనిపించుకుంటాడు? కాని అలా వచ్చిన ఊహాలని మనస్సులో విచ్చలవిడిగా తిరగనియ్యని వాడే ప్రాజ్ఞుడు. 'ప్రాణ సమానుడైన పండరంగునికి నాపై గౌరవమే గాని నిదురలోకూడా నిర్లక్ష్యం ఉండదు" అనుకొని మళ్లీ విజయాదిత్యుడు గొంతెత్తి గౌళగాత్రంతో పిలిచాడు.

"పండరంగా? పండరంగా! పండరంగా". సమాధానం వినరాలేదు.

విజయాదిత్యుని స్వంత తమ్ములు విక్రమాదిత్యుడూ, మల్లపరాజూ, సవతి సోదరుడు నృపకాముడూ మెల్లగా నడుచుకుంటూ సోదరుని సమీపించారు.

"ముగ్గురం మూడు పక్కల గాలించాము. పండరంగుని జాడ లేదిక్కడ" అని సోదరునికి విన్నవించారు.

"ఇక్కడే ఎక్కడో ఉండాలి. మళ్లీ వెతకండి" అని ఆదేశించాడు విజయాదిత్యుడు.

"కొండ కింద అంత గొప్పగా జాతర జరుగుతూవుంటే అందు పాల్గొనకుండా ఈ వెతకడం యేమిటి?" అన్నాడు మల్లప్ప.

"పండరంగుణ్ణి చూసి, కూడా తీసుకొని జాతరకు పోదాము. అతగాడిని చూడనిదే ఉండలేను" అన్నాడు విజయాదిత్యుడు.

"వేంగీ సామ్రాజ్యాధిపతి మనుమలం, ఒక సామాన్యుని కోసం వెతకడమా?" మల్లపరాజు చిరాకు ప్రదర్శించాడు.

"అతనెలా సామాన్యుడు? అన్నగారి నెచ్చెలి" అని విక్రమాదిత్యుడు పలికాడు.

'ద్రోణాచార్యుల వారితో సరిసమానమైన కాడియరాజుగారి కుమారుడు' అన్నాడు నృపకాముడు.

"పండరంగుడూ పరాక్రమవంతుడే" అన్నాడు విజయాదిత్యుడు.

"ఏయే యుద్ధాలు గెలివాడేం?" అని వెటకారంగా ప్రశ్నించాడు మల్లపరాజు.

"ముందుముందు గెలుస్తాడు. నేను పట్టం కట్టుకున్నాక అతగాడే నా సర్వసేనాని అవుతాడు" అన్నాడు విజయాదిత్యుడు. అర్ధ నిమీలిత నేత్రుడైన అతని కళ్లముందు లీలగా భవిష్యత్తు కన్పించింది. అతని తమ్ముళ్లలో ఒక మల్లపరాజు తప్పించి మిగిలిన ఇరువురూ యీ ఉద్దేశ్యాన్ని మెచ్చుకున్నట్టు చిరునవ్వుతో తలలూచారు.

"నువ్వు పట్టం కట్టుకున్నాక కదా! చూద్దాంలే." అన్నాడు మల్లపరాజు.

"అంటే నీ ఉద్దేశ్యం?" గద్దించాడు విజయాదిత్యుడు.

"తాతగారింకా రాజ్యం చేస్తున్నారు కదా నలభై సంవత్సరాల నుండి పాలిస్తున్నారు" అన్నాడు మల్లపరాజు.

"వారింకో నలభై ఏళ్లపాటు పరిపాలించాలనే నా అభిలాష" అన్నాడు విజయాదిత్యుడు.

"లేదులే అన్నేళ్లు పాలించరు. డెబ్బయ్యోపడిలో పడ్డారు" కాబట్టి యింకో పది పదిహేను సంవత్సరాలేలుతారు" అన్నాడు మల్లపరాజు.

"అవునవును. తాతగారు వజ్రశరీరులు" గర్వంగా వాక్రుచ్చాడు విజయాదిత్యుడు.

"వారి తరువాత తండ్రిగారు రాజ్యానికొస్తారు. పాతికేళ్లయినా పాలిస్తారు." అన్నాడు మల్లపరాజు.

"ఆ తరువాతైనా అన్నగారే కదా అధిపతులవుతారు" అన్నాడు విక్రమాదిత్యుడు.

"అవుతారు. అవుతారు." అన్నాడు మల్లపరాజు.

"మహాదేవుని అనుగ్రహంవల్ల తాతగారూ, తండ్రిగారూ చల్లగా ఉండాలి. నేను రాజునయ్యాక మాత్రం నా నెచ్చెలి పండరంగుడే సర్వసైన్యాధిపతి అయితీరుతాడు" అని విజయాదిత్యుడు మరో పర్యాయం తన నిర్ణయాన్ని చెప్పాడు. తమ్ములవంక తిరిగి "ఊరు వెళ్లి పండరంగుణ్ణి వెతకండి" అని ఈసారి ఆజ్ఞాపించాడు. తమ్ముళ్లు ముగ్గురూ తలోవైపు వెళ్లారు. వెళ్లి ఎలుగెత్తి "పండరంగా?" అని పిలవ సాగారు. అయినా ఆ పిలుపులకు బదులులేదు.

(సశేషం)

స్వయం ఉపాధి కల్పన పథకము

కోన సీమలో కొబ్బరి పీచు పరిశ్రమ

శ్రీ ఎస్. వై. హుస్సేన్

ఆంధ్రప్రదేశ్‌లో విద్యావంతులైన నిరుద్యోగుల పాలిట స్వయం ఉపాధి కల్పన పథకములు వరప్రసాదములనదగును. ఉన్నత విద్యార్హతలుండి, పలుమారులు ప్రయత్నించిననూ ప్రభుత్వ యంత్రాంగములో తమకు సరిపడు ఉన్నతోద్యోగము దొరకక నిరుత్సాహపడ్డ అనేక మంది యువకులు ఈ పథకము క్రింద కృషి సల్పుటకు ఉత్సాహముగా ముందుకు వచ్చుట మన విద్యావంతులైన యువకులలో వచ్చిన మార్పుకు నిదర్శనం. అట్టివారిలో తూర్పు గోదావరి జిల్లా, అమలాపురం తాలూకా విలస గ్రామానికి చెందిన శ్రీ కుసుమె కృష్ణమూర్తి ఒకరు.

ప్రభుత్వ యంత్రాంగములో అత్యంతోన్నతమైన ఐ.ఏ.ఎస్ పదవి అందినట్లే అంది, అందకుండా పోయినందున నిరుత్సాహపడ్డ కృష్ణమూర్తి, అటుపిమ్మట ప్రైవేటు సంస్థలలో ఒకటి రెండు ఉద్యోగావకాశాలు వచ్చినప్పటికీ చేపట్టలేదు. తనకుతాను స్వతంత్రముగా జీవనోపాధి కల్పించుకోవాలని కలిగిన సంకల్పమును ఆచరణలో పెట్టుటకు తన ఆర్థికపరిస్థితి అడ్డు నిలచింది. ఒక మధ్య తరగతి హరిజన కుటుంబములో పుట్టి స్వయం కృషివల్ల పోస్టుగ్రాడ్యుయేటు అయిన కృష్ణమూర్తికి తన స్వశక్తి పై అచంచల విశ్వాసముంది. గౌరవప్రదమైన జీవనోపాధికి మార్గమును అన్వేషించుచున్న సమయంలో కృష్ణమూర్తికి వార్తాపత్రికలలో స్వయం ఉపాధి కల్పన పథకాలను ప్రభుత్వము ప్రవేశ పెట్టదలచినట్లు చూడగా, పేదవానికి పెన్నిధి దొరకినట్లయింది. కోనసీమలో సాధారణంగా వంట చెరకుగా వినియోగ పడుచున్న కొబ్బరి డొక్కా, చిప్పా ముడి పదార్థములుగా వినియోగించి స్వయం ఉపాధి కల్పన పథకం పరిధి క్రింద ఒక పరిశ్రమను ప్రారంభించుటకు అవకాశాలను వెదక నారంభించాడు శ్రీ మూర్తి. ఈ ప్రయత్నంలో సాంకేతిక నిపుణులను ఇందుకు సంబంధించిన అనేకమంది ఉన్నతోద్యోగులను ఆయన సంప్రతించాడు. అంతేకాదు. ఈ పరిశ్రమను గురించి ఆయన శ్రమించి ఇతర రాష్ట్రాలలో ఈ పరిశ్రమ ఏవిధంగా అభివృద్ధి చెందుతున్నదీ కూలంకషంగా తెలుసుకొన్నాడు. తన ఆశయానికి అనుగుణంగా అమలాపురం పట్టణ పొలిమేరలలో "డిలైట్ ఇండస్ట్రీ" అను పేరుతో స్వయం ఉపాధి కల్పన కేంద్రమును నెలకొల్పారు. దానిని జూన్ నెల 27వ తేదీన ఆంధ్రప్రదేశ్ గవర్నర్ సలహాదారు శ్రీ హెచ్.సి.సరీన్ ప్రారంభించారు.

1.12 లక్షల రూపాయలతో రూపొందింపబడిన ఈ పథకమునకు ఆర్థిక సహాయమును అనేక సంస్థలనుండి అర్థింపవలసి వచ్చింది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ వారు స్థలము, భవన నిర్మాణము, యంత్రసామగ్రి సమకూర్చుకొనుటకు రూ. 89,600/లు ఋణమును మంజూరు చేశారు. పారిశ్రామిక వేత్తగా తాను పెట్టవలసిన పెట్టుబడి తన వద్ద లేక పోవుటచే శ్రీ మూర్తి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిశ్రమల శాఖ సహాయమును కోరగా విద్యావంతులైన నిరుద్యోగుల స్వయం ఉపాధి కల్పన పథకం క్రింద ప్రభుత్వము రూ. 35,000/-లు మంజూరు చేసింది. పథకము పూర్తియగుటకు ఈ మొత్తము కూడా చాలనందున సిండికేటు బ్యాంకు నుండి రూ. 20,000/లు ఆర్థిక సహాయమును పొంద వలసి వచ్చింది.

ఒకనాటి నిరుద్యోగి......!

ఈ కేంద్రములో ప్రధానముగా ఉత్పత్తి అయ్యేవి, కొబ్బరి నూనె, కొబ్బరి పీచుతో తయారయ్యే వివిధ రకముల ఉత్పత్తులు, కొబ్బరి చిప్పపొడరు, కొబ్బరి మొదలగునవి సాలీనా ఉత్పత్తి రూ 1,19,700/లుగా అంచనా వేయబడుచున్నది. ఈ పరిశ్రమ ప్రారంభించుట వల్ల ఒక నాటి నిరుద్యోగి నేడు దాదాపు 30 మంది నిరుద్యోగులకు ఉద్యోగము యిచ్చే యోగ్యతను సంపాదించుకొన్నాడు.

కేరళ కంటే తక్కువ కాలంలో......

కొబ్బరి పీచు పరిశ్రమను గురించి వివరాలడిగితే మూర్తిగారంటారు: ఈ పరిశ్రమ కేరళ రాష్ట్రములో తప్పమరెక్కడా అభివృద్ధి చెందుటకు అవకాశాలు లేవని సాధారణంగా అందరూ అనుకొంటారు. కాని యిది నిజంకాదు. ఇలా అనుకొనుటకు కారణం ఎర్నాకులంలో ఉన్న ఆల్ ఇండియా కోయర్ బోర్డు తన కార్యకలాపాలను కేరళ రాష్ట్రంలో కేంద్రీకరించుట ఒకటి, రెండవది కేరళలోనే పీచు తయారుచేయుటకు సహాయపడే సహజ వసతులు వున్నవని ఒక భ్రమ. వ్యాపార దృష్టితో పరిశీలిస్తే కేరళలో గల సహజ వసతులతో కొబ్బరి డొక్కను నానబెట్టి పీచు తయారు చేయుటకు 6 నుండి 7 వారములు పట్టును. అదేపని కోనసీమలో కృత్రిమ పద్ధతిలో 6 నుండి

(తరువాయి 52 వ పేజీలో)

చెఱకుకు అనకాపల్లి సేవ

శ్రీ వి. పాండురంగారావ్

1926లో ఆంధ్రప్రదేశ్‌లో హెక్టేరుకు 62.5 టన్నుల చెఱకు పండేది. ఇప్పుడు అది రెట్టింపు అయింది.

డా॥ సి.ఎస్. రాయుడు, శ్రీ వెంకటాచలం, శ్రీరంగారావు శ్రీ వి. శివరామబ్రహ్మం వంటి రైతులు పంటల పోటీలో హెక్టేరుకు 380 టన్నుల చెరకు దిగుబడి సాధించారు.

అనకాపల్లి విపణిలో ఏటా 100 వేల టన్నుల బెల్లం అమ్ముతున్నారు.

ఆంధ్ర ప్రదేశ్‌లో చెరకు, దాన్ని సంబంధమైన పరిశ్రమలు 45000 రైతులను 10,000 మంది కార్మికులను ఇంకా వేలాది వ్యక్తులను పోషిస్తున్నాయి, 10 కోట్ల రూ॥లు యేటా సంపాదిస్తూంది: ప్రభుత్వ బొక్కసానికి రు. 5.5 కోట్ల ఆదాయం ఇస్తూంది.

ఇంతటి సర్వతో ముఖమైన ప్రగతికి దోహదం చేసినది అనకాపల్లి చెఱకు పరిశోధనా సంస్థ. చెఱకు పండించే వారికి ఈ సంస్థ పట్లగల ఆదరాభిమానాలకు ప్రత్యక్ష సాక్ష్యం కావాలి అంటే ఆ సంస్థ ఆవరణలో నేచూడండి. అక్కడ ఒక పొడుగాటి స్తంభంవుంది. 3500 రూ॥ల ఖర్చుతో నెలకొల్పిన ఈ స్తంభం అనకాపల్లి బెల్లం వ్యాపారుల ఆదరాభిమానాలకు చిహ్నం. దీని పేరు "కో_419 స్తంభం"

ఆ పేరు ఎట్లావచ్చింది అని అడిగితే చెఱకు పరిశోధనలో మూడు దశాబ్దాల అనుభవజ్ఞులూ, అనకాపల్లి కేంద్రపు చెఱకు నిపుణులూ అయిన శ్రీ ఎం. లక్ష్మీకాంతం ఇట్లా చెప్పారు. కో_419 చెఱకు రకం ఎప్పుడూ మంచి దిగుబడుల నిస్తుంది. ముంపుకు తట్టుకుంటుంది. కార్శి పైరుగా కూడా బాగా దిగుబడినిస్తుంది. పరిశోధనల వలన ఇంకా ఇంకా మంచి రకాలు కో_997, కో.ఏ 71_1, 70 కో.ఏ_2 వంటివి వెలువడినాయి."

కో_997 గురించి వివరిస్తూ అయన "నీరు వారాల కొలది లేక పోయినా కో_997 మొక్క కొత్త వేళ్ళు తొడగగలదు; గనుక ఇది అనావృష్టి పరిస్థితులకు తట్టుకుంటుంది. కో.ఏ_71_1 రకం సుమారుగా రాలుబడి నిస్తుంది: దీనిలో చక్కెరశాతం ఎక్కువ, గడ మొక్క వాలదు, విరుగదు. కో_997 కన్న ఎక్కువ శాతం చక్కెర గల 70 కో.ఏ_2 రకం రూపొందుతూ వుంది_" అన్నారు.

అనకాపల్లి చెఱకు పరిశోధనాకృషి కేవలం కొంగ్రొత్త రకాలను సృష్టించడమే కాదు, బహు ముఖాలుగా సాగుతూంది.


చెఱకు పైరుకు వేసే నత్రజని ఎరువులను నేలమట్టానికి 5 7.5 సెం. మీ. దిగువ వేయడంతో పైరు దిగుబడి 8 శాతం పెరుగుతుంది_అని సూచించారు శ్రీ లక్ష్మీకాంతం. అధిక దిగుబడికి వారి ఇతర సలహాలు: నత్రజని ఎరువులను రెండు మోతాదులలో, నాటిన 45, 90 రోజులకు వేయాలి. ఎరువులను వెదజల్లడం కన్న మొక్క దిగువ మట్టిలోకి వేయాలి. చెఱకును 100 సెం.మీ ఎడం 40 సెం.మీ. వెడల్పు 20 సెం. మీ లోతుగల గోతులలో నాటాలి. కార్శిపైరుకయితే మొదటి 45 రోజులలోగా హె॥కు 56 కి. నత్రజని అందించాలి.

ముప్పై ఏళ్ళ పరిశోధనా అనుభవ సారాన్ని తమ "చెఱకు" అన్న మానోగ్రాఫ్ రచనలో నియోగించారు శ్రీ లక్ష్మీకాంతం. ఆయన ఆకులపై రసాయనిక ఎరువులను పిచికారీ చేయడం చెఱకు దిగుబడిని పెంచదని అభిప్రాయపడ్డారు. చెఱకు నాటడానికి లోతయిన గోతులు త్రవ్వే "రిడ్జ్‌మార్" పనిముట్టు చెఱకులోని చక్కెరశాతం కనుగొనగల "పౌచ్ పియర్సర్" సాధనం_వీటిని అనకాపల్లి కేంద్రం శ్రీ లక్ష్మీకాంతం ఆధ్వర్యాన రూపొందించింది. 'రిడ్జిమార్' వలన కూలి ఖర్చులు నాల్గవ వంతుకు తగ్గుతాయి. 'పౌచ్ పియర్సర్' వలన ఒకేసారిగా ఎన్నో చెఱకు మొక్కల చక్కెర శాతాన్ని కొలవవచ్చును. చెఱకు మొక్కలు పడిపోకుండా నిలబెట్టే "జడకట్టు" విధానం అనకాపల్లి పెట్టిన భిక్షే! ఈ కేంద్రం వారి పరిశోధనల ఫలితంగా బెల్లం నిల్వచేయడానికి, మంచి మేలురకం గిడ్డంగులు నిర్మించ గల్గుతున్నారు.

ఈ కేంద్రపు శాస్త్రజ్ఞులు, వారి పరిశోధనలు ఆకాశాలలో విహరించడం వుండదు. వారి దృష్టి ఎప్పుడూ భూమిమీదే వుంటుంది. వారు ఏడాది కొక్కసారి "రైతుల దినం" అని ఏర్పాటు చేస్తారు. ఆనాడు వందలాది రైతులు, వ్యాపారులు ఈ కేంద్రానికి వస్తారు. ఏడాది పొడుగునా తాము కనుగొన్న విషయాలను శాస్త్రజ్ఞులు రైతుల ముందర పెడతారు. రైతుల సమస్యలను వింటారు. చర్చలు జరుగుతాయి. ఉభయ పక్షాల వారూ ఈ చర్చల వలన లాభం పొందుతారు.

ఈ సేవా తత్పరత అనకాపల్లి చెఱకు పరిశోధనా కేంద్రానికి ఊపిరి వంటిది. ఆదినుండీ గల ఈ దీక్షయే ఈ కేంద్రానికి కీర్తి తెచ్చి పెట్టింది. ఆరు దశాబ్దాలపాటు అనన్యమైన కృషిచేసిన ఈ సంస్థ, మున్ముందు చెఱకు రైతులకు ఇంకా ఎన్నో ఎన్నో విధాల తోడ్పడగలదని ఆశించడంలో అబ్బురం ఏమున్నది?

గుంటూరు జిల్లా



కొండా వెంకటప్పయ్యగారు గుంటూరు కోనేరుగట్టువద్ద వాలంటీర్లకు వీరకంకణాలు కట్టినప్పటి చిత్రం

ఉప్పు సత్యాగ్రహంలో మహిళల వీరోచితపాత్ర

శ్రీ మాదల వీరభద్రరావు

మహాత్మాగాంధీ నాయకత్వాన జరిగిన భారత జాతీయ స్వాతంత్ర్యోద్యమంలో ఉప్పు సత్యాగ్రహం ఒక ఉజ్జ్వల ఘట్టం. ఈ అహింసాయుత స్వరాజ్యసమరంలో గుంటూరు మండలం ప్రముఖ పాత్రను నిర్వహించింది. ముఖ్యంగా దేశభక్తులైన మహిళా సత్యాగ్రహులుగూడా అసమాన త్యాగాలను ప్రదర్శించారు.

గుంటూరు కోనేరుగట్టువద్ద కొండా వెంకటప్పయ్యగారు వందలాది స్వచ్ఛందసేవకులకు వీరకంకణాలు కడుతుండగా, శారదా నికేతనం విద్యార్థినులు ఒక్కొక్కరి నొసట తిలకందిద్ది దేశభక్తి గీతాలను ఆలాపించారు. ఆ దృశ్యాన్నిగాంచిన వేలాది ప్రజలు హర్షధ్వానాలు చేశారు. యడవల్లివారి సత్రంలోని సత్యాగ్రహ శిబిర నిర్వహణకై సర్వవిధాల సహాయపడినారు. వాలంటీర్లు 'దేశభక్త' గృహంలో ఉప్పును తయారుచేస్తూ శాసన ధిక్కారానికి పూనుకున్నారు.


జిల్లా నలుమూలల వ్యాపించిన సత్యాగ్రహోద్యమానికి స్వర్గీయ కొండా వెంకటప్పయ్య, ఉన్నవ లక్ష్మీనారాయణ, సీతారామశాస్త్రి గార్లు, శ్రీ నడింపల్లి లక్ష్మీనరసింహారావుగారు నాయకత్వం వహించి జయప్రదంగా నిర్వహించారు.

నల్లూరు శిబిరగాథ

నల్లూరు సత్యాగ్రహ శిబిరం విషయంలో మహిళా వాలంటీర్లు అద్వితీయ పాత్రను నిర్వహించారు. 1932 ఏప్రిల్ 3, 4 తేదీలలో అరెస్టు చేయబడిన స్త్రీలుగాక 10వ తేదీన మరల 8 మంది అరెస్టు చేయబడినారు.

8వ తేదీన గడిపాటి పిచ్చమ్మగారి నాయకత్వాన రెండుజట్లుగా మహిళలు రేపల్లె పురవీధులలో జాతీయ పతాకాలను చేబూని నగర సంకీర్తనం చేస్తూ, బహిష్కార కరపత్రములను పంచుతూ ఊరేగింపులు జరిపారు. వారిని పోలీసులు అరెస్టుచేసి స్థానిక సబ్ జైలులో లాకప్‌లోనుంచి, రాత్రి ప్రొద్దుపోయిన తరువాత వదిలారు. మరుసటి దినమే 9వ తేదీ ప్రాతఃకాలముననే విడుదలకాబడిన 8 మంది స్త్రీ వాలంటీర్లు ఒకే జట్టుగా ఏర్పడి రేపల్లె సమీపంలోనున్న నల్లూరు శిబిరమునకు కాలినడకన బయలుదేరి వెళ్ళారు. ఆ గ్రామంలోని శిబిరాన్ని పోలీసులు అప్పటికే 2 సార్లు స్వాధీనం చేసికొన్నారు. మొదటి పర్యాయం 6గురు స్త్రీలు, ఇద్దరు పురుషులు అరెస్టు చేయబడినారు. వారికి శిక్ష విధింపబడినది. రెండవ పర్యాయం అప్పటికే ముగ్గురు స్త్రీలు రిమాండులో ఉంచబడినారు. మూడవసారి 8 మంది జట్టు నల్లూరు శిబిరాన్ని మరల స్వాధీన పరచుకొన్నారు. ఆ సాయంత్రమే గ్రామంలోని మహిళలు నగర సంకీర్తనం చేస్తూ ఉత్సవం బయలుదేరదీశారు. అనంతరం విదేశ వస్త్రములను ప్రోగు చేసి వాటిని దహనం చేశారు.

10వ తేదీ మధ్యాహ్నం కొల్లూరు స్పెషల్ డ్యూటీ సబ్ ఇనస్పెక్టరు రిజ్వీ పోలీసులతో నల్లూరు వెళ్ళి ఆ 8 మంది స్త్రీ వాలంటీర్లను అరెస్టు చేసారు. వారందరిని నడిపించుకుంటూ రేపల్లెకు




శ్రీమతి తుమ్మల చంద్రమ్మ, శ్రీమతి తుమ్మల దుర్గాంబ, శ్రీమతి కలిదిండి సీతాయమ్మ

తెచ్చి సబ్‌జైలులో నిర్బంధించారు. 11వ తేదీ ప్రాతఃకాలము డిప్యూటీ సూపరింటెండెంటు, స్పెషల్ ఎస్. ఐ. పోలీసులతోను తహశీల్దారుతోను కలిసి వచ్చి "1932 అత్యవసర ఆర్డినెన్సు 3వ సెక్షను ప్రకారం నల్లూరు శిబిరం స్థానిక ప్రభుత్వ స్వాధీనంలో ఉంచుకో బడినదని" గ్రామాల్లో దండోరా వేయించాడు. ఈ విధంగా 3, 4, పర్యాయములు వాలంటీర్లను అరెస్టు చేసి శిబిరాన్ని పోలీసులు స్వాధీనపరచుకోడం, మహిళా వాలంటీర్లు ఊరేగింపులు చేసికొంటూ వెళ్ళి మరల దానిని స్వాధీనపరచుకోవడం జరుగుతూ వచ్చింది. రిజర్వు దళాలకు, పోలీసు బలానికి బెదరిపోక గ్రామ స్త్రీ పురుషులు ఉద్యమానికి అండగా వున్నారు. మహిళా వాలంటీర్లు అరెస్టులు, లాఠీచార్జీలు జరుగుతున్నా అసమాన ధైర్య సాహసాలను, నిరుపమాన దేశభక్తిని ప్రదర్శించారు. పాతూరి రాఘవమ్మ, మల్లిపెద్ది శేషమ్మ, కొల్లి నాగభూషణమ్మ, తుమ్మల చంద్రమ్మ, వేమండ్ల దుర్గాంబగార్లకు 17 సి ఎల్.ఎ. క్రింద ఆరునెలలు చొప్పున కఠిన శిక్షలు విధించ బడినవి.

అరెస్టులు - జైలు శిక్షలు

రేపల్లె తాలూకా పెదపులివర్రు గ్రామంలో జనవరి 22వ తేదీ తట్టా నరసమ్మ, దేవినేని రాజ్యలక్ష్మమ్మగార్లు కాంగ్రెస్ కరపత్రాలను పంచుతుండగా అరెస్టుచేసి 1 సంవత్సరం కఠిన శిక్ష విధించారు. బేతపూడి గ్రామంలో దేవభక్తుని రాజ్యలక్ష్మమ్మ, సుంకర లక్ష్మమ్మ గార్లను కాంగ్రెసుప్రచారం చేస్తున్నందుకు జనవరి 24వ తేదీన అరెస్టుచేసి ఒక సంవత్సరం కఠిన శిక్ష విధించారు. మార్చి 9వ తేదీన నాదెండ్ల రంగమ్మ, కొల్లి రత్తమ్మగార్లను అరెస్టుచేసి 17 సి.ఎల్.ఎ. క్రింద ఒక సంవత్సరం శిక్ష విధించారు. రేపల్లె పట్టణంలో మార్చి 9వ తేదీన పాతూరి రాఘవమ్మ, యలవర్తి ప్రసూనాంబ, దుర్గాంబ, తుమ్మల చంద్రమ్మ గార్లు ప్రభాత భేరీలు, నగర సంకీర్తనలు జరుపుతుండగా అరెస్టు చేశారు. అయ్యన్న చెట్టి సత్రంలో ఉంచి వారిని తరువాత వదలిపెట్టారు. 12వ తేదీ "దండి యాత్రాదినం" సందర్భంలో మరిపెద్ది శేషమ్మ, కోనేరు మంగమ్మ, నాదెండ్ల సీతారామమ్మ గార్లను, మరి ముగ్గురు మహిళా వాలంటీర్లను అరెస్టు చేసి అనంతరం విడుదల చేశారు. చేబ్రోలు వాసిరెడ్డి పార్వతమ్మ, హనుమాయమ్మ, గొళ్ళపూడి రత్తమ్మ, ప్రసూనాంబ, తుమ్మల చంద్రమ్మ, కోనేరు మంగమ్మ, రాజ్య లక్ష్మమ్మ గార్లను అరెస్టుచేసి ఒక్కొక్కరికి 6 నెలలు కఠిన శిక్షలు విధించారు.

భట్టిప్రోలులో రేపల్లె కాంగ్రెస్ డిక్టేటర్ యల్లాప్రగడ ఇందుమతమ్మగారిని అరెస్టుచేసి 6 నెలలు కఠిన శిక్ష విధించారు. ఏప్రిల్ 8వ తేదీన రేపల్లెలో జి. పిచ్చమ్మ, సజ్జా రత్తమ్మ, తుమ్మల తులశమ్మ, యనమదల రత్తమ్మ, గరికెపాటి రాధాక్రిష్ణమ్మ యార్లగడ్డ రత్తమ్మ, కొల్లి రాఘవమ్మ, సూర్యదేవర వెంకమ్మ, వడ్లమూడి అన్నపూర్ణమ్మ, సుఖవాసి అచ్చమ్మ, శేషమ్మగార్లు జట్లు జట్లుగా ప్రచారం చేస్తుండగా, పోలీసులు అరెస్టుచేసి తరువాత విడుదలచేశారు.



మహర్షి బులుసు సాంబమూర్తి గారు

తెనాలి తాలూకా గోవాడ గ్రామంలో చిలకమర్తి చిలకమ్మ, రామానుజమ్మ, పర్వతనేని కౌసల్య గార్లను అరెస్టుచేసి 117వ సెక్షను క్రింద కఠిన శిక్షలు విధించారు. చేబ్రోలు గ్రామస్థులు వాసిరెడ్డి హనుమాయమ్మ, సూర్యదేవర రాజ్యలక్ష్మమ్మ, అన్నపూర్ణమ్మగార్లు కరపత్రములు పంచి పికెటింగులు చేస్తుండగా 143, 188, 17 సెక్షనుల క్రింద ఒక సంవత్సరం కఠిన శిక్ష రు. 200లు వంతున ఒక్కొక్కరికి జరిమానా విధించారు.

అమృతలూరుకు చెందిన మహిళా వాలంటీర్లు రేపల్లెలో మార్చి 8వ తేదీన నగర సంకీర్తన జరుపుతుండగా అరెస్టు చేసారు. తెనాలి కె. తాయారమ్మగారికి ఒక సంవత్సరం కఠినశిక్ష, రూ. 500 జరిమానా, అది చెల్లించకుంటే మరి 6వారాలు జైలు శిక్ష విధించారు. తెనాలిలో మార్చి 12వ తేదీన వట్టికొండ హనుమాయమ్మ, అన్నపూర్ణ, వాసిరెడ్డి పార్వతమ్మగార్లు "దండి యాత్రాదినం" జరుపుతుండగా 3 మార్లు అరెస్టు చేయబడ్డారు.

బాపట్ల తాలూకా మంతెనవారి పాలెం గ్రామంలోని మంతెన అబ్బాయమ్మ, దంతులూరి సుబ్బాయమ్మ. సుఖవాసి భ్రమరాంబ గార్లను జనవరి 21వ తేదీన కరపత్రములు పంచుతుండగా అరెస్టు చేసి 6 నెలల శిక్ష విధించారు.

బాపట్లలో తన్నీరు సీతారామమ్మ, బోదుపల్లి రామశేషమ్మ, తుమ్మల తులశమ్మ, వట్టికూటి రాధమ్మగార్లు ఫిబ్రవరి 22న విదేశ వస్త్ర బహిష్కరణ చేస్తూండగా అరెస్టు చేశారు.

రావిపాటి రాజ్యలక్ష్మమ్మ, 7 గురు స్త్రీ వాలంటీర్లు కరపత్రాలు పంచుతున్నారని అరెస్టుచేసి మరల విడుదలచేసారు. భారతీదేవి రంగా, తుమ్మల దుర్గాంబ, పాదర్తి కనకసుందరమ్మగార్లను 17 సి.ఎల్.ఎ. సెక్షనుక్రింద అరెస్టుచేసి ఒక్కొక్కరికి సంవత్సరం విడిఖైదు, రూ. 500 జరిమానా లేదా 6 నెలలు ఖైదుశిక్ష విధించారు.


మైనేని పాలెంవద్ద బసవపున్నమ్మ, యలమంచిలి బసవమ్మాదేవి, సరళకుమారిగార్లను, విదేశ వస్త్రములను బహిష్కరించండని కరపత్రములు పంచుతుండగా అరెస్టుచేసి, 6 నెలలు కఠిన శిక్ష విధించారు.

గుంటూరు తాలూకా మంగళగిరి ముప్పనేని పుష్కరాంబ, గంధి జనార్ధనమ్మ, తెలగార నాగరత్నమ్మ గార్లు ఫిబ్రవరి 12వ తేదీ గుంటూరులో "లా మెంబరు వెళ్ళిపో" అని నినాదాలు చేసినందుకు అరెస్టుచేసి సంకెళ్ళతో సబ్‌జైలులో నిర్బంధించి, తరువాత వదిలారు.

వెలమనేని దుర్గమాంబ, వాసిరెడ్డి పార్వతమ్మ, పాటిబండ్ల అన్నపూర్ణమ్మగార్లను పికెటింగ్ సందర్భంలో అరెస్టుచేసి అనంతరం వదిలిపెట్టారు.

పెనుమాక గ్రామంలో ఎస్. సుభద్రమ్మ (ఆంధ్ర కాంగ్రెస్ నియంత) ఏప్రిల్ 2వ తేదీన అరెస్టుచేసి ఒక సంవత్సరం కఠినశిక్ష విధించారు.

గుంటూరు జిల్లా ఉప్పు సత్యాగ్రహ దళము బులుసు సాంబమూర్తిగారికి స్వాగతం చెప్పేందుకు ఉన్నవ లక్ష్మీనారాయణగారి నాయకత్వంలో గుంటూరు రైలు స్టేషనుకు వెళ్తోన్న ఊరేగింపు





శ్రీమతి వేదాంతం కమలాదేవి

ఈ విధంగా ఎందరో సత్యాగ్రహులు "వీరగంధము తెచ్చినారము వీరులెవ్వరో తెల్పుడీ, పూసి పోతము మెడను వేతము పూలదండను భక్తితో" అని కవిరాజు గీతాన్ని ఆలాపిస్తూ జిల్లాలో జరిగిన సత్యాగ్రహోద్యమములో అత్యంత ప్రముఖ పాత్రను నిర్వహించి చరితార్థులైనారు.

ఉప్పు శాసనోల్లంఘనము


జిల్లాలో ఉప్పుశాసనాన్ని ఉల్లంఘించి కొఠార్లవద్ద ఉప్పు తయారు చేసేందుకు సముద్రతీరంలోనున్న మూడు నాల్గు ప్రధాన కేంద్రాలను కాంగ్రెస్ నాయకులు నిర్ణయించారు. ఒంగోలు తాలూకాలోని కనపర్తి సమీపంలో ఉప్పు ఫ్యాక్టరీవద్ద, చీరాల సమీపంలోని వోడరేవు కేంద్రంవద్ద, బాపట్ల తాలూకా గణపవరం వద్ద, రేపల్లె తాలూకాలోని నిజాం పట్నమువద్ద ఈ కేంద్రములు నిర్ణయించబడినవి. ఆ కేంద్రాలవద్ద కాంగ్రెస్ వాదులు శిబిరాలు నెలకొల్పారు. అచటినుంచి ఉప్పు తయారుచేసి గ్రామాదులకు పంపించేవారు. కనపర్తి సత్యాగ్రహులు దేవరంపాడు గ్రామంలోని శ్రీ ప్రకాశం పంతులుగారి స్వగృహాన్ని శిబిరంగా చేసుకొన్నారు. అక్కడనుంచి ఉప్పు తయారు చేయసాగారు. దీనిని నిరోధించేందుకు డిప్యూటీ సూపరింటెండెంటు పి. శౌరిరాజులు నాయుడు, 30 మంది రిజర్వు పోలీసుదళంతో సిద్ధమయినారు. అమ్మనబ్రోలువద్ద జిల్లా అధికార్లు కొందరు మకాం వేశారు.

కనపర్తి శిబిరం

కనపర్తి సహజ కొఠార్లను పూడ్చివేసేందుకు ప్రభుత్వాధికారులు ప్రయత్నించారు. కాని కూలీలెవ్వరు పనికి రాలేదు. అమ్మనబ్రోలు క్రిష్టియన్ కూలీలు కొందరికి రెట్టింపు కూలీ ఇచ్చి లారీలమీద తెచ్చి దానిని భగ్నం చేయుటకు తలపడినారు. రిజర్వు పోలీసులు ప్రకాశం పంతులుగారింట్లోనున్న శిబిరంపై దాడి చేసి, అక్కడ ప్రోగుచేసిన ఉప్పును చెదరగొట్టారు. శిబిరంలోని కొన్ని పత్రాలను వశపరచుకొని వాలంటీర్లను అరెస్టుచేశారు.



శ్రీమతి కాళంగి శేషమాంబ



స్వాతంత్ర్యదినోత్సవ శుభసమయంలో దేశభక్త, ఉన్నవ లక్ష్మీనారాయణ, లక్ష్మీబాయమ్మ, గడింపల్లి నరసింహారావు, మద్ది వెంకట రంగయ్య, శీలం సుబ్బారావు ప్రభృతి స్వాతంత్ర్యయోధుల సమావేశమైనప్పటి చిత్రం

ఈ సత్యాగ్రహ శిబిర వాలంటీర్లకు సహాయకులుగా ఉన్న చీరాల "యుద్ధమండలి" సభ్యులను, రాచెర్లను నరికి వేసిన నిడుబ్రోలు వాలంటీర్లను, వారికి సహాయంగా ఉండిన గ్రామస్థులను అమ్మనబ్రోలు మకాంలో విచారించి జైలు శిక్షలు విధించారు. పాడవేవు శిబిరం పెద్ద సముద్రపు నీరు తెచ్చి వాలంటీర్లు ఉప్పు తయారుచేసేవారు. చుట్టుప్రక్కల గ్రామాలవారు కూడ వచ్చి యధేచ్ఛగా ఉప్పు తయారు చేసుకొనేవారు. ఒక గ్రామంలో 200 మంది స్త్రీలు 5 మైళ్ళ దూరం నుండి నడిచివచ్చి తమకు కావలసిన ఉప్పును తయారుచేసి కొన్నారు. ప్రభుత్వాధికారులు వాలంటీర్లనేగాక గ్రామస్థులను కూడా నిర్బంధించి వారిని జైలు శిక్షలకు గురి చేశారు. పోలీసులు వారిపైన తీవ్రంగా లాఠీచార్జి చేశారు.


ఉప్పుకొఠార్ల వద్ద తయారుచేసిన ఉప్పును మిగతా ప్రాంతాలకు పంపుతూ జిల్లాలోని వివిధ ప్రదేశాలలో వాలంటీర్లు ఉప్పుశాసనోల్లంఘనం చేసేవారు. ఉప్పు తయారుచేసిన వాలంటీర్లతోపాటు జాతీయాభిమానంతో ఉప్పును కొనుగోలు చేసినవారిని కూడా అరెస్టులుచేసి శిక్షలు విధించడం జరిగింది.

దేవరంపాడు శిబిరం

ఉప్పు సత్యాగ్రహం సందర్భంలో దేవరంపాడు సత్యాగ్రహం ఒక గొప్ప సంఘటన. ఒంగోలు తాలూకాలో ఉన్నవ లక్ష్మీనారాయణ గారి నాయకత్వాన సత్యాగ్రహ శిబిరం స్థాపింపబడినది. ప్రకాశం పంతులుగారి బంగళాలోని శిబిరానికి 300 మంది స్వచ్ఛంద సేవకులు చేరారు. ప్రొద్దున్నే లేచి రాగి గంజి త్రాగి 8 మైళ్ళ దూరంలోగల సముద్ర తీరానికి చేరుకొని ఉప్పు శాసనోల్లంఘనం చేసేవారు. పోలీసులు అరెస్టు చేయకుండా లాఠీలతో మోదేవారు. ఇలా పక్షం రోజులు గడిచినవి. ఇదంతా చూస్తున్న చుట్టుప్రక్కల గ్రామ ప్రజలు ఉద్రిక్తులైనారు. అంతట నాయకులను వాలంటీర్లను పోలీసులు అరెస్టుచేయసాగారు. ఒంగోలు తాలూకా ప్రజ మేల్కొన్నది. బండ్లకొలది ఉప్పు తయారుచేసి గుంటూరు, తెనాలి మొదలగు పట్టణ ప్రాంతములకు తెచ్చేవారు. ఆ రోజుల్లో చిటికెడు ఉప్పు పొట్లం వేలకొలది రూపాయలుఇచ్చి కొన్నవారున్నారు. ఆ విధంగా ఎందరో స్వాతంత్ర్య సమరమునకు గుప్త దానం చేసేవారు. ఆ ద్రవ్యం సత్యాగ్రహ నిర్వహణకు వినియోగపడేది.

కరవది గ్రామ గాథ

కరవది గ్రామస్థులు చాలా శ్రోత్రియులుగా ఉండేవారు. ఒక రాత్రి దేవరంపాడు వెళుతూ వాలంటీర్లు అక్కడ బస చేయవలసి వచ్చినది. గ్రామస్థులు వారిని భోజనాలకు ఆహ్వానించారు. ఇంతలో పోలీసులువచ్చి వాలంటీర్లకు ఎవరైనా భోజనం పెడితే వారినికూడా



పురపాలక సంఘ అధ్యక్షులు శ్రీ యస్ వి ఎల్. నరసింహారావు పంతులు నాయకత్వాన
గుంటూరు జిల్లా ఉప్పు సత్యాగ్రహుల దళం ఊరేగింపు.

శిక్షిస్తామని బెదిరించారు గ్రామవాసులకు రోషం వచ్చింది. 'ఆతిథ్యం ఇవ్వటం హైందవ ధర్మం గదా' యనుకున్నారు ఆ ధర్మాన్ని కూడా నిరోధించే రాక్షస ప్రభుత్వాన్ని నిరోధించటమే పరమ ధర్మమనుకొన్నారు 30 మంది గ్రామస్తులు వాలంటీర్లకు షడ్రసోపేతంగా భోజనం పెట్టారు ఆ విధంగా వారిలో కొందరు ఆ నేరానికై శ్రీకృష్ణ జన్మస్థానమునకు సంతోషంగా బయలుదేరి వెళ్ళి, జైలు శిక్షల ననుభవించారు

1930 లో ప్రారంభమైన ఉప్పు సత్యాగ్రహ సమరంలో గుంటూరు జిల్లా మొత్తం 1300 మంది స్వాతంత్ర్య యోధులను శ్రీకృష్ణ జన్మస్థానానికి అతిథులుగా పంపింది 1932లో రాష్ట్రంలో జరిగిన శాసనోల్లంఘనోద్యమానికి గుంటూరు మండలం కేంద్ర స్థానమైంది 1933లో జరిగిన వ్యక్తిగత సత్యాగ్రహంలో గూడా జిల్లా తన కర్తవ్యాన్ని నిర్వహించి పలువురి దేశనాయకుల ప్రశంసలకు పాత్రమైంది. ★

ప్రముఖ జర్నలిస్టు

శ్రీ కపిల కాశీపతి మరణం


సమాచారశాఖ మాజీ డైరెక్టరు శ్రీ కపిల కాశీపతి అక్టోబరు 5వ తేదీ మధ్యాహ్నం హైదరాబాదులో గుండె పోటుతో మరణించారు వారి వయస్సు 65 సంవత్సరాలు.

శ్రీ కాశీపతి కాశీ విశ్వవిద్యాలయంలో ప్రథమ శ్రేణి న్యాయశాస్త్ర పట్టభద్రులు మొదట్లో ప్రకాశం పంతులు గారి "స్వరాజ్య" పత్రికలోనూ, తరువాత 'మద్రాస్ మెయిల్' పత్రికలోనూ జర్నలిజం రంగంలో పని చేశారు. 1930–46 మధ్య కాలంలో నైజాం సంస్థానంలో 'మెయిల్' పత్రిక విలేఖరిగా కూడా పని చేశారు. ఆంధ్ర మహాసభ, తెలంగాణా మహాసభ, హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెస్ సంస్థలతో ఆయనకు సంబంధం వుంది.

భారత ప్రభుత్వంలో డిప్యూటీ ప్రిన్సిపల్ ఇన్‌ఫర్మేషన్ ఆఫీసర్‌గా పని చేశారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత ఆయన రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ తొలి డైరెక్టరుగా అంటే ఆంధ్రప్రదేశ్ పత్రిక ప్రథమ ప్రధాన సంపాదకులుగా పని చేశారు అంతకుముందు న్యూఢిల్లీలో ఆకాశవాణిలో ఛీఫ్ న్యూస్ ఎడిటర్‌గా పని చేశారు పూర్వ హైదరాబాదు రాష్ట్రంలో మాస్ కమ్యూనికేషన్స్ ఆఫీసర్‌గా పని చేశారు. మద్రాసులో ఫిలిం సెన్సార్ బోర్డు ప్రాంతీయాధికారిగా ఆయన రిటైరయ్యారు.


శ్రీ కాశీపతి చేయి తిరిగిన రచయిత. ఆంధ్రాంగ్ల భాషలలో అనేక రచనలు చేశారు. హైదరాబాదులో వుంటున్న చివరి దశలో కొలదికాలం 'ఆంధ్రజనత' సంపాదకులుగా కూడా పని చేశారు.

నగరంలో వార్తా చిత్రాలు



రాష్ట్రపతి సెప్టెంబర్ 2వ తేదీన సరోజినీదేవి ఆసుపత్రిలో బాలల వార్డుకు ప్రారంభోత్సవం చేశారు.

రాష్ట్రపతి ఇటీవల హైద్రాబాదులో ఒక రేషను దుకాణాన్ని అకస్మాత్తుగా సందర్శించినప్పటి దృశ్యం



నగరంలో

వార్తా చిత్రాలు



రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నరు శ్రీ ఎస్. జగన్నాథం సెప్టెంబరు 11వ తేదీన స్టేట్ బ్యాంక్ స్టాఫ్ కాలేజీలో వ్యవసాయ బ్యాంకింగ్ అనే అంశంమీద గోష్ఠికి ప్రారంభోత్సవం చేశారు.

రాష్ట్ర గవర్నరు సెప్టెంబర్ 15 న సికింద్రాబాదులో కస్తూర్బాగాంధీ మహిళా కళాశాలకు ప్రారంభోత్సవం చేశారు.



వందేమాతరం

ముదిగొండ వీరభద్రమూర్తి

[ఆనాడు సైన్యంలో ఉద్యోగిగా వున్న ఫాడ్కే రాజీనామా చేసి మాతృదేశ దాస్య శృంఖలా విముక్తికి దీక్ష గైకొన్న కథా ఘట్టము]

" నీరు త్రాగక ఎవ్వడేని యలిగినను
పారుచునె యుండు నది "

—శెలవు నిరాకరిస్తూ సైనికాధికారి.

" ఆగిపోవును నది, బ్రద్దలగును కొండ
ప్రజ తలంపగ !"

—రాజీనామా చేసిన ఫాడ్కే జవాబు.

తనదు జాతీయ ధోరణి తనదె కాని
పరభృతము మన స్వరమ్మున బలుక దయ్యె
ననుచు గాకులు వాగికొన్నవి తదీయ
కాల చిహ్న చిహ్నిత విశ్వలీల జూచి

మల్లియలు గులాబులు కో
కొల్లలుగా బూచె సంపంగులు మున్నగు పూ
లెల్లర హృదయమ్ములు సం
ఫుల్లము లై నిజసుగంధముల వెదజల్లన్

మోజు పడంగ నేమగును పుట్టద యెట్టని జాతి యాత్మనొ
రోజుగ జేయు మల్లియలలోన గులాబులలోన స్వచ్ఛమున్
రాజిలె లోకమాన్య మది ఘ్రాణము నన్నియు నేకరీతి సం
యోజన చేసినన్ మతులహో ! విధమ్ములు మ్రొగ్గ కొన్నిటన్

వీక నుపన్యసించు నొక విజ్ఞవరేణ్యుని వైభవమ్ము పుం
స్కోకిల కూజితాన్వితము చూరగొనెన్ సహకార వృక్షమా
వాకున కుల్లసిల్లిన విభాతి దనర్చెను బూల తోటలో
మొకలు తీవెలన్ మహిజముల్ మలయానిల చాలితమ్ములై

శౌర్య ఖండము

రెమ్మ నుండి వెడలు తుమ్మెద పిండు పి
ట్టలున వెడలు గూండ్ల బలె నెసంగె
నిలచి పోరు యోధునిన్ దలపించె ర
సాల తరవు నాటి సమయమందు.

పూనాస్థానీయం బది
పానీయం బచటి ప్రజకు భ్రాంతి చనుబా
లేనాడును సాహసమున
నా నాడే ఘనము సాంఘికాభ్యుదయమునన్.

ప్రజలు వివిధోత్సవమ్ముల బఱగి రపుడు
వానిలో సర్కసొక్కటి వ్యాఘ్ర సింహ
ముల పయిని స్వారిసేయు క్రోతులును సందు
వింతవేస మాపదమత్త దంతురముగ.

ఇరువురు ప్రేక్షకు లందొక
మఱువున గూర్చుండి రొకడు మాటాడె నిటుల్
నరు లీ మృగముల కన్నన్
మెఱుగా మన యస్వతంత్ర మేదిని పై నిన్

కొరడ ఝళిపించు నధికారి గొఱవి చూపు
జూచి గుఱుకొట్టియును బోను చొరక తప్ప
దయ్యె బింబాస్యమున కెవ్వరైన జెఱకు
దార్చబడిరొ ఫడకే విడుదలయ లేదు.

అన్న తన హితునితో నిటు
లన్నా డా యద్వితీయు డైన ద్వితీయుం
డన్నా పొరపడితివి విన
కున్నావొ శివాజి బగర గుండె నరాజిన్.

ఆయన పరిపంథి కటక
టా! యన దన బందెకటకటాల్ విడి రాడే!
ఓయి సఖ పులికి నఖమే
యాయుధ మధికమ్ము బుద్ధి యది మానిసికిన్

అని మరల వెడదకన్నులు
ఘననాసము పెన్నురమ్ముగల ఫాడ్కే యి
ట్లనియె మెలమెల్ల మిత్రమ!
మన జంటయె చాలు భరత మాతను దేర్పన్.

అంటన్ సర్కారు నేల యాంగ్లు దొరె దాయా
జంటు శిక్షాస్మృతుల్
సాంరాజ్యాస్త్రములైన దిట్ట యిరువాయల్ జోడు పిస్తోళ్లనా
క్రాంతమ్ముల్ దుగిజేబు లూని ప్రజ నాజ్ఞాపించి నిశ్శబ్దమా
చంతస్సార నిదర్శ నాపయవ విన్యాసమ్ముతో నిట్లనెన్

ఇది యాఫ్రికాఖండ నది తీరమున మాకు
మచ్చిక చింపాంజి మర్కటంబు
ఇది సింగపూర రణ్య దవానలము నుండి
రక్షింప బడిన తీరక్షకంబు
ఇది సింహళద్వీప హృదయ ఘోరారణ్య
పరిలబ్ధ విస్రబ్ధ భల్లుకంబు
ఇది బ్రహ్మదేశ సంపద యింత బూర్తిగా
మాకు రోగని గజ మండనంబు

ఇదియ కెనవామృగాదిప మెంత యగ్ని
మండినన్ వలయమ్మున నుండి యెపుడొ
మెఱపు మెఱసిన చందాన నురవడించి
యవలకు దాటె జనులారా! యరయుడోయి!

అదిగొ లంఘించె భరిత ఖండాంతరాత్త
వంగదేశ మహారాష్ట్ర వైభవము
లెక్క పులు లొక్క యెత్తు నీ ద్వయ మొకెత్తు
నెపుడు క్రొత్తయ వీరి కే మిదెడి శిక్ష

ఇటుల జన్మమున కెటిగించి హేయ్య టంచు
రెండు చేతుల మ్రోగించె రెండు కళల
వానిపై బడె నిరుపురుల్ వాడు లేదు
పలదు ప్రేవుల ప్రోపు రక్తమ్ము మడువు.

హాహాకార నినాద మేదురముగా నా సర్కస న్లైన్ జన
వ్యూహమ్ముల్ గృహమేగుచున్నయపుడందున్నార లే కొందరో
ఓహోహో! యనినట్టి వారలును సైన్యోద్యోగి ఫాడ్కే దళ
న్నీహారాంశు మరీచిరోసి నిదురించెన్ యోజనామగ్నుడై

అది తెల్లవారుజామున
గడిసిన కల, కంట నీరు గ్రక్కుచు జూచెన్
దుడిచూపు లనకొలకు రుజ
ముదిరిన జనయిత్రి మేని ముడుతలు ప్రేలన్

రనకెంత యున్న నద్దాని నెవ్వడొ నాచి
కొని వేసినది యింత కూడు గాగ
దర కాలికిన్ జేతికిని సంకెలలు వైచి
చెఱబట్టి నట్టి దుస్థితియు గాగ
తన గొంతు నెవ్వడో తనయా యనుచు బిల్వ
గేకిన యపుడు నొక్కినది గాగ
దిన సహాయుని జంపి తన మేన రద్రక్త
మును బూసి యెవడొ నవ్వినది గాగ

గింజుకొనుచుండె మూర యీక్షించినాడు
అఱచినాడు "అమ్మా!" యని యేడుగఱచి
నాడు వేచి ఫాడ్కే నిజ నయనములను
తుడుచుకొన్నాడు నీరము లొలుకుచుండ

కనులన్ గట్టినయట్టు లైన జననీకష్టాతికష్ట స్థితిన్
గనుపింపన్ దొరిసంధ్యవేళ మలిసంధ్యావేళగా, గొందులె
ల్ల నొకే గంతున దాటి చేరె నత డాంగ్లావాస ముద్యాన ఖే
లనరంగస్థలచిత్రశాద్వల సుశాలావీధి విన్యాసమున్.

చేరి యొక భవనరాజ
ద్వారముకడ వేచె ఫాడ్కె పంజరమున పై
నా 'రూడ్' 'రూడ్' గెపెవేయగ
భైరవముగ జాగిలమ్ము 'భౌభౌ' మనగా

వెలి కరుదెంచి సభ్రుకుటి వీక్షణుడై యధికారి నన్ను మే
ల్కొలుపగ నే పిశాచి యిటకున్ గొని తెచ్చెను నిన్ను నేడనన్
దెలిపి స్వకీయ దుస్థితిని నే జనుదెంతును వేగ రెండు రో
జులు సెలవిందు చాలు ననుమన్ ఫడకే వచియించె వానితో

అరండు వచించె నిదే
నా తెచ్చితి వేదొ వేగు వని తలచితి సం
స్పీతంబు కార్యభారం
బీ ఫటి సెలవీయ జాల నెవ్వరికేనిన్.

విని ఫాడ్కే బిగలాగి వాగె సహసాప్రేంఖత్తురంగమ్ము నా
గిన భంగిన్ మది నిగ్రహించి కను లగ్నిన్ రాల్ప బోబట్టి యా
పిస రెప్పల్ తగ ముష్టినుండి బలిమిన్ విప్పించు ప్రేళ్లాది యా
రనికిన్ బత్రము వ్రాసి యిచ్చె గొలువున్ దా ద్రెంచికొన్నట్లుగా

నీరు త్రాగక యెవ్వడేని యలిగినను
బారుచునెయుండు నది, యని పలికె యధిపు
దాగిపోవును నది బ్రద్దలగును కొండ
ప్రజ తలంపగ నని మాఱుపలుకు వినియె

సందు గలవేళ్ల పై నిక వందనమ్ము
వాని మీసపు మెలి ప్రేత పరిగణింప
దగిన, నతడు హుటాహుటి దరలినాడు
మాతృసేవాపరాయణమానసుండు.

పూనాలో నలడింట మాతృచరణమ్ముల్ మ్రొక్క శైత్యానుసం
ధానాచంచల తత్కళేబర మొకింతన్ వేడిమిం బొందె గ
నో నల్ జూచి జనిత్రి పుత్రకుని మేనున్ దువ్వి నా తండ్రి ఫా
డ్కే నన్ మించిన భారతాంబ కల దోయీ నీ కనెన్ మెల్లగా

పరశురామజ్వలితవహ్ని భవము నాన్న
వంశముల మిన్నయీ చితాపావనాఖ్య
మిందు బీష్వాలు జనియించి రీవు నంచు
గొడుకు భుజము దడవి తుది విడిచె నామె

సరియాగగలనా జిజాబాయితో నంచు
నెవ్వరు నను హెచ్చరించువారు
గుటి చెప్పరాదు వాక్కును దప్పరా దంచు
నెవ్వరు నన్ను శిక్షించువారు
తెలిగుట్టు తెలియ నై కొలువు సేవ యటంచు
నెవ్వరు నను మందలించువారు
క్షాత్రమ్ము బ్రాహ్మ్యమ్ము సంస్కృతి కను లంచు
నెవ్వరు నాకు బోధించువారు

అమ్మ నీవు వేయి నందనమ్ములు వేయి
మాతృబలమె బలము మానవునకు
పూజ్యభావములకు బురుదువోసిన నీవు
లేని నాకు జగము లేని దయ్యె

తల్లీ ! తల్లీ ! యను దుఃఖ
పల్లగి విబుధుండు సుతుడు పిల్లడు వాలెన్
దల్లడనాజనరెంపు
తల్లికి మాయబడె గన్నుపమ్ముల విధిచే.

పదియును వెడు సహాస్రుల
పడిపడి సర్దాంగి పరికె ఫాద్కేతో "స్వా
మి ! దినముదిన మాయువుపారి
కొదువబడెడి జిల్లిగుండలో బోసిన నై.

ఆయువుతో భవాద్భుతుల కర్ధనిమేషము వ్యర్థ మౌనొ యాం
గ్లేయుల కోటిటాపల గ్రంతుదు పెచ్చుగ నంత జాగగున్


ధ్యేయముసిద్ధి యీ భరతదేశజన్మమ్మున, కాయుదమ్ములం
దీయగ నాజ్ఞ యిమ్ము భవదీయభుజాభరణమ్ములం బ్రభూ !

అంధరమసమ్ము దాప సహస్కరుండు
వాలు నొందె శ్రేయస్కరుల్ చాలమంది
త్వాదృశులు కావలయు నేడు భారతమున
సరము బహుశపక్షం బైన బ్రతుకు బ్రోవ

ఆయుధహీనసమ్మున బరాక్రమహీనుల జేసినారు దే
శీయుల నంచు భారతవిజేత్వరు లీలలు వేయ నేమి? పం
జాయె మృగేంద్రశత్రు మరి చాటుడు, దేశము గొడ్డువోదు సిం
కై యిరికించుకొన్నయది కైదువులన్ దొలిజమ్ము పోరికన్.

బోధించి ప్రజకు సంశోధించి యోధుల
సమకూర్చుకొని దాడసాగు నదను
రాజ్యాలపై బడి దాణాల పలె, దుసా
కుల లాగికొని పంచికొనెడి యదను
ఆంగ్లేయశత్రుస లగ్నభగ్నము లైన
భుజబంధములతోడ ముదియు నదను
ప్రాణమ్ము లెంపుమాగాణమ్ము పెద్దగా
విసరి మార్తుని బడవేయు నదను.

మాతలుడిపుల్కునకు వ్యాఖ్యవ్రాయదను
భరతమాతముసిముసినవ్వు లెలుపు నదను
కింకణమ్ము మీ కియి కేను దట్టు నదను
స్వామి ! వచ్చి పేదినది ప్రాగ్ద్వారమందు."



ఆగస్టు 4వ తేదీన గవర్నరు సలహాదారు శ్రీ హెచ్. సి. సరీన్ హైదరాబాదులోని ఆంధ్ర మహిళా సభ కార్యాలయం సందర్శించారు

వెనుకబడిన తనానికి స్వస్తివాక్యం చెబుతున్న వేల్పూరు పంచాయతీ

— శ్రీ సిద్దాని నాగభూషణం —


గ్రామసీమలలో ఏర్పడ్డ అస్తవ్యస్తపరిస్థితి తొలగించి గ్రామ సీమలను పునరుజ్జీవంచేయటానికి సమాజ వికాసపథకాలను ప్రారంభించడం జరిగింది. సమాజ వికాసకార్యక్రమాలకు ప్రజాసహకారం సమీకరణకు పంచాయతీరాజ్యాన్ని 1959వ సంవత్సరంలో ప్రారంభించడం జరిగింది. పంచాయతీరాజ్యం ఏర్పాటు కావటంతో సమాజ వికాసకార్యక్రమాలను నిర్వహించే బృహత్తరబాధ్యత పంచాయతీలకు పంచాయతీసమితులకు, జిల్లాపరిషత్తులకు సంక్రమించింది. ఈ కార్యక్రమాలను పంచాయతీలు కొన్నిచోట్ల సమధికోత్సాహంతో నిర్వహించాయి. కాని కొన్నిచోట్ల గ్రామపంచాయతీలు చొరవ తీసుకొనకపోవటంవల్ల అభివృద్ధిని సాధించలేకపోయాయి. దాని కారణము పంచాయతీ రాజ్యవ్యవస్థలోపం కాదు వాటికి నాయకత్వం వహించినవారి లోపమనే చెప్పాలి.

నాయకత్వం సరియయినదైతే వైశ్వర్యము ఏ విధంగా వెల్లివిరుస్తోందో తెలుసుకొనటానికి వేల్పూరు గ్రామపంచాయతీ చక్కని నిదర్శనంగా నిలుస్తుంది.

వేల్పూరు గ్రామపంచాయతీ పెదపాలెం సమితియందు పెదపాలెం పంచాయతీ కేంద్రగ్రామమైన పెదపాలెంకి 7½ మైళ్ళ దూరంలో వుంది. గ్రామంపెద్దది. జనాభా 16,711 మంది. వేల్పూరు గ్రామ ఆయకట్టు 2063 ఎకరాలు 28 సెంట్లుభూమి. ఆ గ్రామపంచాయతీ 1919సం॥లో ఏర్పడింది. మొన్నమొన్నటి వరకు ఈ గ్రామపంచాయతీ పౌరసౌకర్యాలు ఏర్పాటుచేయటంలో ఏ విధమైన శ్రద్ధతీసుకొనలేదు. అయితే 1970 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో శ్రీ అయిమిల్లి వెంకటరత్నంగారు సర్పంచిగా ఏకగ్రీవముగా ఎన్నికవ్వటంతో ఈ గ్రామానికి శుభోదయమయిందనే చెప్పాలి.

సర్పంచిగా ఎన్నికైన వెంటనే వేల్పూరు గ్రామపంచాయతీకి పెదపాలెం సమితిలో ఒక ప్రత్యేక స్థానాన్ని కల్పించాలని సంకల్పించుకున్నారు శ్రీ వెంకటరత్నంగారు, వేల్పూరు గ్రామపంచాయతీకి శాశ్వత భవనములేదు. ఈ భవననిర్మాణమునకు పంచాయతీ నిశ్చయించింది. వెంటనే గ్రామపంచాయతీ కార్యాలయ శాశ్వతభవన నిర్మాణానికి పూనుకొన్నారు. సర్పంచి మరియు సభ్యులు 1970వ సంవత్సరములో అప్పట్లో ఆంధ్రప్రదేశ్ అంతరంగికశాఖా మాత్యులు శ్రీ జలగం వెంగళరావుగారు శాశ్వత భవనమునకు శంకుస్థాపన చేసినారు. రూ. 25,000/-లు అంచనా ఖర్చుతో భవన నిర్మాణము ప్రారంభించబడింది. కాని భవన నిర్మాణము పూర్తి అయ్యేటప్పటికి 30,000 రూపాయలు ఖర్చు అయింది. పంచాయతీ తన నిధుల నుంచి 17,000 రూపాయలు ఖర్చుచేసింది. జిల్లా కలెక్టరు శ్రీ యస్. ఆర్. గోవిందరాజన్ సంక్షేమనిధి నుండి 6,000 రూపాయలు ఆర్థికసహాయంచేస్తే వేల్పూరు గ్రామరైతులు 7,000 రూపాయలు విరాళమిచ్చారు. సుందరమైన భవంతిని వేల్పూరు పంచాయతీ నిర్మించింది. ప్రజాసహకారంద్వారా పంచాయతీ కార్యాలయభవనము ఏర్పాటు చేసుకొనటం ఈ కార్యక్రమం ప్రాముఖ్యత. జిల్లాకలెక్టరు ఎస్. ఆర్. గోవిందరాజన్‌గారు ఈ పంచాయతీ కార్యాలయభవనానికి ప్రారంభోత్సవం చేశారు.

రైతుపంట తర్వాత ప్రధానమైనది పాడి. ఈ పాడి పరిశ్రమ పెంపొందాలంటే గ్రామములో నున్న పశువులు ఆరోగ్యవంతమైనవిగా, పుష్టిగా వుండాలి. పశుపోషణ విషయములో సలహాలు పశువుల రోగాలకు చికిత్సచేయటానికి గ్రామంలో పశు వైద్యశాల ఆవశ్యకత ఎంతైనా వుందని పంచాయతీ గ్రహించింది. మీ పశువుల ఆసుపత్రి మీరే నిర్మించుకోండి అన్న వుద్యమంలో రైతులు అత్యంత వుత్సాహంగా పాల్గొనేటట్టు చైతన్యవంతులను చేసినారు శ్రీ అయిమిల్లి వెంకటరత్నంగారు. రైతులు ఈ కార్యక్రమ ప్రాముఖ్యాన్ని గుర్తించి ముందుకు వచ్చి భారీగా విరాళాలిచ్చారు.



ప్రజల విరాళంతో నిర్మింపబడిన మాతా శిశు సంరక్షణ భవనం

25,000 రూపాయలు ఖర్చుతో ఆసుపత్రి భవనం నిర్మించబడింది. యింకా యీ కార్యక్రమాన్ని విస్తృతపరచటానికి పంచాయతీ యోచిస్తున్నది. అందుకు జిల్లాకలెక్టరు 5,000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేస్తే రైతులు 6,000 రూపాయలు యిస్తున్నారు.


మహిళా మండలి

వేల్పూరుగ్రామంలో వున్న కనకదుర్గా మహిళా మండలి 1971 సంవత్సరములో సర్పంచి శ్రీ వెంకటరత్నముగారి ప్రోత్సాహము ఫలితముగా ప్రారంభించబడి అనతికాలంలోనే మహిళల అభ్యుదయానికి ఆదర్శంగా కృషిచేసే సంస్థగా రూపొందుతోంది ఈ మండలికి శ్రీమతి పుట్టా రామలక్ష్మిగారు అధ్యక్షురాలు, శ్రీమతి లంకే రమణమ్మగారు కార్యదర్శిని. ఈ మహిళామండలి ఆధ్వర్యంలో అల్లికలు, చేతిపను కేంద్రము ప్రారంభించబడినది. ఈ కేంద్రములో 20 మంది వృత్తి పనులునేర్చుకొని పుత్తీర్ణులైనారు. శిక్షణ పొందినవారు విరామసమయంలో పనులు చేసుకొని రూపాయి, రూపాయిన్నర సంపాదించుకొని వారి వారి కుటుంబాలను ఆర్థికంగా పటిష్ఠం చేసుకొంటున్నారు. రెండవ బట్టుకూడ యిప్పుడు తర్ఫీదు పొందుతున్నది. పెరవలి సమితి అందజేసిన ఆర్థిక సహాయంతో ఈ మహిళామండలి రెండు కుట్టు మిషన్లు కొనుక్కున్నది. స్వయంగా ఒక కుట్టుమిషను కూడా కొనుక్కొని కుట్టుమిషను శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నది. ఈ కేంద్రములో 15 మంది కుట్టు నేర్చుకుంటున్నారు. మహిళా మండలి భవన నిర్మాణానికి 1,000 రూ॥లు విరాళము ప్రోగుచేసి యివ్వటం యీ మహిళల ప్రత్యేకత. మహిళామండలి భవన నిర్మాణమునకు 12,000 రూపాయల ఖర్చు అయినది. కలెక్టరు 3,000 రూపాయలు, పంచాయతీ సమితి 3,000 రూ॥లు, గ్రామపంచాయతీ 3,000 రూ॥లు గ్రామరైతులు 2,000 రూపాయలు యివ్వటం జరిగింది. మహిళామండలి భవననిర్మాణానికి కలెక్టరు సతీమణి శ్రీమతి శకుంతలా గోవిందరాజన్ శంకుస్థాపన చేశారు, యీ భవన ప్రారంభోత్సవము జిల్లా కలెక్టరు శ్రీ యస్. ఆర్. గోవిందరాజన్‌గారు చేశారు. శిశుసంక్షేమ మహిళా కార్యక్రమాల అమలుకై శ్రద్ధ తీసుకొని సర్పంచి శ్రీ వెంకటరత్నం గారు ఉత్తమకృషి జరపాలనడానికి వేల్పూరు గ్రామములోవున్న మాతా శిశుసంరక్షణ వైద్యకేంద్రము (Maternity centre) శాశ్వత భవననిర్మాణ కార్యక్రమము ప్రత్యక్ష నిదర్శనము, యీ భవన నిర్మాణానికి వేల్పూరు గ్రామరైతులు 3,000 రూపాయలు విరాళమిచ్చారు. పెరవలి సమితి 3,000 రూ॥లు యిస్తే పంచాయతీ 3,000 రూ॥లు యివ్వగా జిల్లాకలెక్టరు శ్రీ ఎస్. ఆర్. గోవిందరాజన్‌గారు 3,000 రూ॥లు జిల్లాసంక్షేమ నిధినుండి ఆర్థిక సహాయం అందజేసినారు. మాతా శిశుసంరక్షణ శాశ్వత భవననిర్మాణానికి శంకుస్థాపన కలెక్టరు సతీమణి శ్రీమతి శకుంతలా గోవిందరాజన్ చేశారు. ఈ భవనానికి పెరవలి సమితి అధ్యక్షులు శ్రీ నిడదవోలు మృత్యుంజయరావుగారు ప్రారంభోత్సవము చేశారు.

వేల్పూరుగ్రామ యువజనసంఘం గ్రామాభ్యుదయ మహాయజ్ఞములో ఎంతో ఉత్సాహంగా కృషిచేస్తున్నది. 1971 సంవత్సరములో యువజనసంఘము శ్రీ బండా భాస్కరరావుగారి అధ్యక్షతన యేర్పాటు చేయబడింది.

యీ నాడు వేల్పూరుగ్రామంలో అందంగా అలరారుతున్న ఉన్నత పాఠశాల భవననిర్మాణ ప్రధాన కారణం శ్రీ ఆరుమిల్లి వెంకటరత్నంగారి నాయకత్వంలో వున్న భవననిర్మాణ సంఘం ఆదర్శకృషి. 1963 వ సంవత్సరములో వేల్పూరు ప్రాథమికోన్నత పాఠశాల మాధ్యమిక పాఠశాలగా ప్రారంభించబడినది. 1969 సంవత్సరములో ఉన్నత పాఠశాల అయింది. ఈ పాఠశాలకు భవన నిర్మాణము చేయాలని నిశ్చయించబడింది. అప్పుడే వేల్పూరు ఉన్నత పాఠశాల భవననిర్మాణ సంఘం ఏర్పాటు చేయబడింది. యీ సంఘానికి ప్రస్తుత గ్రామపంచాయతీ సర్పంచి శ్రీ వెంకటరత్నంగారే అధ్యక్షులుగా ఎన్నిక అయ్యారు. శ్రీ యుతులు బండా పట్టాభిచౌదరి, శ్రీ పువ్వాడ బులి వీరాస్వామి, శ్రీ పెనుమర్తి వెంకట్రామన్న రెడ్డి, రామస్వామి, పెనుమర్తి శాంబయ్య, అనే బసవన్న, గుత్తుల వెంకటేశ్వరరావు భవననిర్మాణ సంఘసభ్యులు ఈ సంఘం చేసినకృషి ఫలితంగా వదాన్యులు, విద్యాభిమానులు శ్రీ రెడ్డి రామస్వామి గారు అర ఎకరం పొలాన్ని, శ్రీ ఎల్లూరి అమ్మన్నగారు అర ఎకరం పొలాన్ని, ఉచితంగా ఉన్నత పాఠశాలకు విరాళంగాయిచ్చారు.

ఈ కమిటీ ప్రజావిరాళంగా పాఠశాల ప్రారంభించడానికి 8,000 రూపాయలు జిల్లా పరిషత్తుకు డిపాజిట్టు చేసింది. రైతులు, ప్రజలు భవననిర్మాణానికి 22,000 రూపాయలు, స్థలసేకరణకు 19,000 రూపాయలు, లేబరేటరీ ఎక్విప్పుమెంటుకీ 12,000 రూపాయలు మరియు అదనపు వసతుల కల్పించుటకు 60,00 రూపాయలు



ప్రజల సహకారంతో నిర్మింపబడిన ఉన్నత పాఠశాల

యిచ్చి విద్యపట్ల తమ అభిమానాన్ని నిరూపించుకొన్నారు. భవన నిర్మాణానికి పరిషత్తు 36,000 రూపాయలు మాత్రమే ఖర్చు చేసింది, నిర్మాణము జరిగిన 4 గదులు సరిపోవటంలేదను విషయాన్ని గ్రహించి యీ భవనముపై రెండవ అంతస్తు వెయ్యటానికి దాతలు ముందుకువచ్చి వారు విద్యపట్ల ఆసక్తి నిరూపించుకున్నారు

పెరవలి సమితి అధ్యక్షులు సుప్రసిద్ధ పారిశ్రామికవేత్త శ్రీ నిడదవోలు మృత్యుంజయరావుగారు వారి తండ్రి శ్రీ నిడదవోలు వెంకట్రామయ్యగారి జ్ఞాపకార్థము ఒకగదిని నిర్మింపజేయుటానికి 7,000 రూ॥లు విరాళమిచ్చారు ఆ విధంగా శ్రీ బంగా వీరాస్వామి కుమారుడు శ్రీ బంగా పట్టాభిచౌదరిగారు 7,000 రూపాయలు విలువగల ఒక గదిని నిర్మింపజేసినారు. శ్రీ పెనుమర్తి రాతబ్బాయి అనే బసవయ్యగారు 7000 రూపాయలు విరాళమిచ్చి ఒకగది నిర్మింపజేసినారు. శ్రీ మద్దు రామన్నగారు కూడా ఒక గది నిర్మాణానికి 7,000 రూపాయలు విరాళం యిచ్చారు మొదట్లో 160 మంది ఆ ఉన్నత పాఠశాలకుపోయి చదువుకునే వారు కాని యీనాడు ఉన్నత పాఠశాలలో 400 మంది విద్యార్థినీ విద్యార్థులు విద్య నభ్యసించుచున్నారు భవన నిర్మాణ సంఘాధ్యక్షులు శ్రీ ఆరుమిల్లి వెంకటరత్నంగారి ధృఢతరమైన దీక్ష ఈ కార్యక్రమ విజయానికి దోహదం చేసింది.

వేల్పూరు గ్రామరైతులు రహదారి నిర్మాణంలో వహించిన ఉత్తేజకరమైన పాత్రవల్ల ఈనాడు యీ గ్రామంలో సక్రమమైన రహదారు లున్నాయి. ఈ గ్రామ రైతులు ఎవరిపొలము దగ్గర వారు రహదారులు యేర్పాటు చేసుకున్నారు. ఈ గ్రామరైతులు తమకు పంచదార కర్మాగారానికి చెరకు అందజేస్తుంటారు. మొదట్లో రైతులు చెరకుతోలటానికి నానా యాతనలు పడేవారు, రహదారుల ఆవశ్యకత రైతుల గుర్తించారు. రహదారి నిర్మాణానికి వారు నిర్ణయించుకున్నారు. పొలంలో మధ్యగా వేసే రహదారికి పొలంరైతుల నుండి కొనవలసి వచ్చింది రైతులు ఏకమ్మడిగా జేరి 2,5000 రూపాయలు ఖర్చుచేసి రహదారి యేర్పాటు చేసుకొనుటకు కావలసిన పొలాన్ని కొన్నారు. ఈపొలంలో మట్టి రోడుపోయుటకు కావలసిన సొమ్ము 8,000 రూపాయలు శ్రీఆంధ్ర షుగర్‌కేన్ డెవలప్‌మెంటు కౌన్సిలు వారు విరాళం యిచ్చారు. ముమ్మర (Cash) కార్యక్రమము క్రింద 6,000 రూపాయలు ఖర్చులో 1 మైలు 3 ఫర్లాంగుల రహదారిని నిర్మించడమైనది. 25000 రూపాయల ఖర్చుతో పొలాలకు వెళ్ళే రహదారిపై చిన్న చిన్న వంతెనలు 4 చోట్ల నిర్మించబడ్డాయి ఈ కార్యక్రమానికి రైతులు భరిస్తే షుగర్‌కేన్ కౌన్సిలు సగం ఖర్చు భరించింది ఈ కార్యక్రమాన్ని కూడా రైతులే స్వయంగా చేసుకున్నారు.

వెనుకబడినవర్గాల అభ్యున్నతికూడా వేల్పూరు పంచాయతీ కృషిచేస్తుంది. వేల్పూరు గ్రామం శివారు వీరభద్రపురంలో 69 నివాసగృహాల నిర్మాణం జరుగుతుంది. ఈ కాలనీ నిర్మాణంలో తణుకు రోటరీక్లబ్‌వారి పాత్ర ప్రశంసనీయమైనది. అదిగాక యీ గ్రామ హరిజనవాడలో 27 నివాస గృహాల నిర్మాణం కూడా జరిగింది ఈ కార్యక్రమము పంచాయితీ ఆధ్వర్యములో నిర్వహించబడటం ఒక విశేషము హరిజనవాడలో హరిజనులకు ప్రత్యేకంగా ఒక మరుగు దొడ్డి 4,000 రూపాయల ఖర్చుతో నిర్మించ బడింది. 2000 రూపాయల ఖర్చులో శ్రీ చుండ్రు రామన్న గారు ప్రయాణీకుల సౌకర్యంకోసం ఒక ప్రయాణీకుల విశ్రాంతి భవనానికి 1971 సంవత్సరంలో నిర్మించారు

పూర్తిగా పన్నుల వసూలు

పన్నుల వసూళ్ళలో కూడా ఈ గ్రామ పంచాయతీ ఇతర పంచాయతీలకు ఏవిధంగా తీసిపోని విధంగా కృషిచేస్తున్నది. 1971-72 సంవత్సరంలో 5,000 ఇళ్ళపై పన్నువిధించి 1972 సంవత్సరం ఫిబ్రవరి 23 వ తేదీన ఆ సంవత్సరానికి కావలసిన పన్నులు పూర్తిగా వసూలు చేయటం జరిగింది.


ఈ గ్రామ పంచాయతీ మొత్తం 92,500 రూపాయలు అయితే డిపాజిట్లతో కలిసి 1,03,163 రూపాయలు పంచాయతీ సిబ్బంది జీత భత్యాలకు, విద్యుద్దీపాల నిర్వహణకు 66,000 రూపాయలు ఖర్చుచేసి మిగిలిన సొమ్ములో 30,000 రూపాయలను అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చుచేయటం జరుగుతుంది.

శిశువిహార్ కూడ ఏర్పాటుచేస్తే బాగుంటుందని తలంచబడింది. 12,000 రూపాయలు ఖర్చుచేసి ఈ శిశువిహార్ భవనాన్ని నిర్మించాలని తల్చుకున్నప్పుడు ఆ గ్రామ కాపురస్థులు కీర్తిశేషులు యడవల్లి పాపన్నగారి జ్ఞాపకార్థం వారి సతీమణి శ్రీమతి యడవల్లి సూర్యకాంతమ్మగారు 6,000 రూపాయలు విరాళం ప్రకటించారు. జిల్లా కలెక్టర్ శ్రీ ఎస్. ఆర్. గోవిందరాజన్ మూడు వేల రూపాయలు విరాళం ఇస్తుంటే పెరవలి పంచాయతీసమితి మూడు వేల రూపాయలు అందజేస్తున్నది.

పరిశ్రమ

* ఏ సంస్కరణ అయినా విజయవంతం కావాలంటే దానిని గురించి క్షుణ్ణంగా తెలుసుకోవడానికి పరిశ్రమ చెయ్యడం అవసరం.

—గాంధీజీ



1

కేశవ మేడ మీద గదిలో కిటికీ దగ్గర వున్న ఈజీ ఛైర్‌లో పడుకొని కిటికీలోంచి బయట ఆకాశం వైపు చూస్తున్నాడు. నిర్మలంగా లేని హృదయం లాగా ఆకాశం ఊదా జేగురు రంగులతో అలముకొని వుంది. అతని హృదయం యేదో ఆలోచిస్తోంది అనేక ఆలోచనలతో ఘర్షణ పడుతున్న మనస్సు చిరాకుతో నిండింది.

ఎదురుగా టేబుల్ మీద ట్రాన్సిస్టర్ పాడుతోంది. లతా మంగేష్కర్ హిందీ గీతాలు వస్తున్నాయి. బయట ఎవరింట్లో నుంచో సుశీల రికార్డు వినబడుతోంది. మధుర సంగీతంలో వాతావరణం మత్తెక్కి వుంది, అతని హృదయం ఏది విని ఆనందించాలో తోచని రెండిటి మధ్య పడి, గిజగిజ లాడుతోంది. రెండూ వినాలనే వుంది. నిజం చెప్తే ఇద్దరి గానాలు గొప్పవే. విమర్శించాలంటే యే భాషలో వారివే యెక్కువయినవని చెప్పాలి. ఒకరి గానం సెలయేటి గలగల. మరొకరిది గంగా తరంగాల జలజల. అసలు అరని సమస్య పేరు. భరత నాట్యంలో పరిణతి చెందిన కన్యలు ఒకరి మీద ఒకరు పోటీపడి జతిస్వరం చేస్తుంటే, ఇద్దరిలో ఎవరు నీకు నచ్చారు? అని ప్రశ్నిస్తున్నట్లనిపించింది. చిరాకులో 'అబ్బబ్బా' ! అని చీదరించు కుంటూ వాలుకుర్చీ లోంచి లేచి ఎదురుగా వున్న ట్రాన్సిస్టర్ నోరు మూసి వాస్తవిక జగత్తులో పడ్డాడు. 'అమ్మయ్య' ! అనుకుని మళ్ళా ఈజీ ఛైర్‌లో వాలాడు. హెవీ హార్టుతో, అతని మనస్సు ఆలోచనా ప్రపంచంలో పడింది.

నాన్నగారు ఆఫీసుకి వెళ్ళగానే అమ్మ తనని పిలుస్తుంది. అన్నం పెడుతుంది, అక్కడ నుండి, ప్రశ్నించడం ప్రారంభిస్తుంది. ఆవిడ అడిగే ప్రశ్నలేమిటో తనకి బాగా తెలుసు.

అసలు అప్పుడే తను ఈ బి. ఎ. ఎందుకు పాసవ్వాలి! అదే పెద్దపొరపాటయింది. ఇంకో నాలుగు సార్లు బి. ఎ. తప్పి వుంటే ఇంకా కొంత కాలం తనకు ఈ పెళ్ళి సమస్య ఎదురయేది గాదు.

బి. ఎ. చదువుతున్న రోజుల్లో ఏవైనా పెండ్లి సంబంధాలు వస్తే, మా వాడికి ఇంకా చదువు పూర్తి కాలేదు. అయినా తొందరేముందనీ, వాడికి ఇంకా ఇరవై నిండలేదు అనీ నాలుగు సంవత్సరాలు వెనకేసి చెప్పి పంపేవారు. ఇప్పుడు ఆ అడ్డుసాకు చెప్పి తప్పించుకుందుకు వీలు లేక పోతోంది.

అయినా అమ్మకి, నాన్నకి కూడా తనకు వివాహం చేసెయ్యాలని, ఆతురతగానే వుంది. నిన్న తనుచూసి వచ్చిన అమ్మాయి బాగున్నట్లే అనిపించింది. అమ్మా, నాన్నా అడుగుతే ఎటూ తేల్చి చెప్పలేక పోయాడు. ఆలోచించి చెపుతా నన్నాడు. ఈ రోజు ఎటో అటు తేల్చి చెప్పాలి. నాన్నగారు 'నీ అభిప్రాయం అమ్మతో చెప్పు ఈ రోజు సాయంకాలం వాళ్ళు వస్తారు. ఏ మాటా చెప్పాలి! పెద్ద మనుష్యులతో వ్యవహారం. ఏదో ఆ బి. ఎ. పూర్తి చేసావనిపించావు. ఈ మూడు ముళ్ళూ వేసి ఒక ఇంటి వాడవవ్వాలి' అని ఘాటుగా చెప్పారు.

కేశవకి చిన్నప్పటి నుండి, నాటకాలు వేయడం అంటే చాలా సరదా, అభిరుచి. తాను వేయడమే కాకుండా తన క్లాస్ పిల్లల చేత రిహార్సల్లు చేయించి యాక్షన్ కూడా నేర్పేవాడు. క్రమంగా తానే చిన్న చిన్న నాటకాలు వ్రాసి అందరికీ అభినయించడం నేర్పేవాడు. స్కూల్ యానివర్సరీ డే రోజున వేయించి, మాస్టర్ల చేత హెడ్ మాస్టర్ గారి చేతా, పిల్లల చేతా మన్ననలను పొందేవాడు. క్రమంగా అదే అలవాటుగా అయిపోయింది. ఈ నాటకాల పిచ్చిలో పడి చదువుకు అంత ప్రాముఖ్యత చూపక పోవడం వల్ల మంచి తెలివైన విద్యార్థి అనిపించుకున్నా గాని పరీక్షలో మార్కులు కనపడేవి కావు. క్లాసులో మాస్టర్లు అతని నాటక కళకు అభిమానించి మార్కులు వేసి పై క్లాసుకు ఈడ్చుకు వచ్చారు. తొట్టి పడవను లాగుకొని వచ్చినట్లు ఎలాగో మెట్రిక్ ఒకసారి తప్పినా రెండవసారి పాసయ్యాడు. పి. యు. సి., బి. ఎ లలో కూడా టీచర్సు, స్టూడెంట్సు ఈ నాటకాల రాయుడుని వదలి పెట్టేవారు కాదు. క్రమంగా కాలేజీ స్టూడెంటు అయ్యాక లేడీ స్టూడెంట్సు

తో కలిసి ఈ నాటక కళను, పెద్ద పెద్ద నాటక పోటీ సభలలో, పెద్దల సమక్షంలో అభినయించి మంచి పేరు సంపాదించాడు. వందలు, వేలు జనం అతనిని అభినందించారు, ప్రోత్సహించారు. అమ్మా, నాన్నా చదువుకోమని చెవులో ఇల్లు గట్టుకొని పోరినా అతనికి ఒంట పట్టలేదు. తన క్లాస్ మేట్, నీలని మంచి హీరోయిన్‌గా తన ప్రతిభతోనే తయారు చేశాడు. తాను హీరోగా నటించాడు, నాటకాల పోటీలలో ఎప్పుడూ తమ ఇద్దరికీ ఫస్టు, సెకండు ప్రైజస్ లభించేవి.

ఊహల ఊయలలో, నాటకరంగం నుంచి ఇంట్లోకి దిగవలసి వచ్చింది. ఎందుచేతంటే ఇంతలో 'కేశవా' అన్న తల్లి పిలుపు క్రింద వంటింట్లో నుండి దూసుకొని మేడ మీదికి వచ్చింది. కేశవ నిద్రలోంచి త్రుళ్ళి పడినట్లు వాలు కుర్చీలోంచి లేచాడు. కిటికీ ఊచల్లోంచి క్రిందకు చూసి 'వస్తున్నా నమ్మా' అన్నాడు.

'త్వరగా రారా! ......అన్నం చల్లగా అయిపోతోంది', అంది.

అసలు అన్నం చల్లారిపోతోందని కాదు, నీకు ఆ పిల్ల నచ్చిందా? అని అడగడానికి, అనుకున్నాడు మనస్సులో.

గది తలుపులు దగ్గరగా పెట్టి క్రిందకు వెళ్ళాడు, కేశవ. అప్పటికే కంచంలో అన్నం వడ్డించి వుంది. త్వర త్వరగా వెళ్ళి కంచం ముందు పీట మీద కూర్చున్నాడు.

తల్లి సావిత్రి నెయ్యి తెచ్చి వేసింది. నేతి గిన్నె యిద్దరకు మధ్యన పెట్టి ఆమె కూడా అక్కడే వడ్డించిన కంచం ముందు కూర్చుంది. అన్నం కలుపుకుంటూ, 'యేమిట్రా! ఆ ఆలోచనా! సరిగ్గా అన్నంతిను, అదిగో పచ్చడి, నీకిష్టమని చేసాను,' అంది.

'ఏం పచ్చడి!' అన్నాడు కేశవ.

'వంకాయ పెరుగు పచ్చడి!' అంది.

'యేం! మళ్ళా ఈ మధ్య యేదైనా......నాటకం వుందా ఏమిటి ఆలోచిస్తున్నావు, ? "అబ్బేయేం లేదమ్మా...... మావోల్డు బోయస్ అసోసియేషన్‌కి నన్ను వచ్చి డ్రామా వేయమని చంపుతున్నారు......... "

"వాళ్ళు అలాగే చంపుతారు, నీ మెత్తదనం కనిపెట్టి. నీతో చదివిన పిల్లలంతా పెద్ద చదువుల్లోకి వెళ్ళిపోయారు, నీవు మాత్రం ఈ వెధవ నాటకాల వెర్రిలో పడి, చదువు నాశనం చేసుకున్నావు. ఈ ఓల్డు బోయిస్‌డే ఇలా ప్రతీ సంవత్సరం తగలడుతూనే వుంటుంది, పైగా సరిగ్గా పరీక్షలముందు వెలుస్తుందేంరా...... చూడు ఆ నీల కూడ చక్కగా బి.ఎ. అయిపోయి ఎమ్. ఎ. లో చేరిందిట."

'అది సరేనమ్మా'! అతని హృదయంలో నీల తళుక్కున మెరిసింది. 'ఇది గొప్ప కళ' ఎంత చదివితే మాత్రం కళాకారుల సాటి వస్తుందా? చూడు, ఏందరో స్టూడెంట్సు చదివి వెళ్ళిపోయారు. కాని, నేను, అందరి దృష్టిలో అలా నిల్చి పోయాను. నన్ను అందరు ఎంతో మెచ్చుకుంటారు. ఒకుతో సమంగా మర్యాద చేస్తారు. మా ప్రిన్సిపాల్‌గారు చూడు. ఇప్పటికీ నన్ను పిల్చి మరీ మాట్లాడుతారు, అంతే కాదు, ఏం ఫంక్షన్ వచ్చినా నా సలహా అడుగుతారు........."

'అది సరే, కాని, నిన్న చూచిన పిల్ల ఎలా వుంది? అని ప్రశ్నించింది సావిత్రి.

'ఇప్పుడు నాకు పెళ్ళెందుకమ్మా! ఇంకా ఎమ్. ఎ. చదవాలను కుంటున్నాను, ఉద్యోగం దొరికాక'......... అన్నాడు.

'అవన్నీ నిజమేరా, మళ్ళా పాత పాటే పాడుతావు...... పెళ్ళయ్యాక ఇవన్నీ వాటంతట అవే వస్తాయి, నెత్తి మీద బరువు, బాధ్యత పడితే అవే నేర్పుతాయిలేగానీ, ఆ పిల్ల చాలా బాగుందిరా తెల్లని తెలుపు, నల్లని వుంగరాల పెద్ద జడ, సరియైన పొడుపొడుగు. మళ్ళా ఇలాంటి పిల్ల ఎప్పుడు దొరకుతుందా యేమిటి? నువ్వు ఈ సంబంధం కాదనకురా కేశవా......... మీ నాన్నగారు యేమంటున్నారో తెలుసా'...............

'యేమంటున్నారు?'

'వీడికి ఎన్ని సంబంధాలు వచ్చినా పిల్ల నచ్చకపోవడం ఏమిటి, వుట్టివంక, అయినా ఈ గజనీ దండయాత్రలగాడికి అసలు ఎవరు పిల్లనియిస్తారు?...... పైగా మనవాడా నాటకాలరాయుడు, ఎప్పుడు చూసినా, ఆ నీలని వెంటేసుకుని నాటకాలువేస్తే...... ఎవరు పిల్లనిస్తానంటారు, పాపం! పిల్ల బంగారంలా వుంది, తీరా పెళ్ళి చేస్తే వీడు.........ఎలా తయారవుతాడో' అంటున్నారు.

'అందుకే నమ్మా! నేను పెళ్ళి అప్పుడే వద్దంటున్నాను' అన్నాడు.

'బాగుందిరా! నీమాట. యేమైనా సరే ఈ సంబంధం వొప్పుకు తీరవలసిందే' అంది.

మౌనం వహించాడు కేశవ! యేమీ మాట్లాడలేదు. భోజనం ముగిసింది, చేయి కడుక్కొని రివరివా మేడ మీదికి వెళ్ళిపోయాడు.

"ఏరా కేశవా! అలా వెళ్ళిపోతావు, అడిగిన మాటకు జవాబు చెప్పకుండా. మొదటి నుండి ఒక్కగాని ఒక్క బిడ్డవని గారాబంగా పెంచితే ఇప్పుడు ఇలా తయారయ్యావు"............

"ఎలా తయారయానమ్మా.......... నాతో మీ కోరికలు యేమి నెరవేరటంలేదు......అంతే కదూ! మీ కోరిక తీరడానికేగా చెల్లాయికి పదహారేళ్ళు నిండకుండా పి. యు. సి. అయినా పూర్తి కాకుండా మేనరికం పెళ్ళిచేసావు" అన్నాడు దెప్పుతున్నట్లుగా.

'అయితే దానికేం లోటు వచ్చిందిరా'?

'అవును దాని అదృష్టం బాగుంది' అన్నాడు.

'అందుకేగా మేము చేసింది. బోలెడు ఆస్తి, అందచందాలు, చదువు, పిల్లవాడికి అన్ని వున్నాయి...... అది సరేలే, నీ మాట

చెప్పు. మీ నాన్నగారు రాగానే, 'నీ కొడుకు ఏమన్నాడు' అని ప్రశ్నిస్తారు. పైగా ఈరోజు వాళ్ళుకూడా వస్తారు. యేదో మాట చెప్పాలి'! అంది సావిత్రమ్మ.

'చెప్తానమ్మా! ఇంకొంచెం సేపున్నాక చెప్తాను'!

'ఇంకా ఆలోచించాలా, రాత్రంతా ఆలోచించడానికి చాల్లేదా' అంది ఆమె. కేశవ మేడమీదకు వెళ్ళి మళ్ళా ఈజీఛైర్‌లో వాలాడు. ఆలోచనలో పడ్డాడు. నీల...... తనకంటే పెద్ద చదువు చదువుతున్నా తనని చిన్నచూపు చూడదు. ఎప్పుడూ తనని ఎంతో గౌరవం మంచిస్థానం ఇచ్చి మాట్లాడుతుంది. నెలక్రిందట అయిన డ్రామాలో కూడా తనలో అభినయించింది. ఎప్పుడూ తనతో హీరోగా వుండి, యాక్టు చెయ్యాలంటుంది. ఇంకొకరు హీరో అయితే తాను యాక్టు చెయ్యనంటుంది. ఆమె హృదయ గత అభిప్రాయం తను ఇంతవరకు అడిగి తెలుసుకోలేదు. తెలుసుకున్నా ప్రయోజనంలేదు. నాన్న ఇలాంటి ప్రేమ పెళ్ళిళ్ళకి ఇష్టపడరు. అయినా తను అంత వ్యక్తిత్వం లేని వాడిని కాననుకున్నాడు. పోనీ నీలనే వివాహ మాడదామంటే ఆమె ఒప్పుకుంటుందో లేదో. ఆమె తన తండ్రి యెవరో తల్లి యెవరో తెలియదని దాపరికం లేకుండా చెప్పింది. దగాకోరు పిల్ల కాదు. ఆమె అందానికి ఎందరో ముగ్ధులయి వివాహ మాడడానికి సిద్ధపడ్డారు. కాని నీల ఒప్పుకోలేదు.

వాసు 'మామయ్యా'......అంటూ పిలిచాడు. వాసు కేశవకి పినతండ్రి కుమారుడు. వూళ్ళోనే వుంటారు వాళ్ళుకూడా, అప్పుడప్పుడు వాసుతల్లి శ్యామల వాసుని తీసుకొని పెదతండ్రిగారింటికి వచ్చి వెడుతుంటుంది. ఆ రోజు కేశవకి పెళ్ళివారు వస్తారని, రమ్మని శ్యామలకి సావిత్రమ్మ కబురుచేసింది.

వాసు వస్తూనే 'మామయ్యా! ఇదిగో వుత్తరం' అంటూ అందిచ్చాడు. కేశవ ఉత్తరాన్ని రెండు ప్రక్కలా త్రిప్పి చూచాడు. రెండవప్రక్క 'భేజనేవాలా' దగ్గర యేమి రాసిలేదు. కాని పైన వ్రాసిన ఎడ్రస్ దస్తూరి మాత్రం తప్పక 'నీల'దే నని నిశ్చయంగా తెలుసుకొని, కవరు చింపి చదువుకోనారంభించాడు.

శ్రీ.............కేశవరావుగారికి నీల నమస్కారములు. ఇలా నమస్కారాలతో ప్రారంభించినందుకు నా మీద మీకు తుఫాను లాంటి కోపం వస్తుందని తెలుసు. అయినా, లాంఛనప్రాయంగా, ఉత్తరం వ్రాయవలసిన ఫక్కీలో వ్రాసాను. అంతే!

ఇక ముఖ్య విషయంలోకి వద్దాము. మీరు వ్రాసిన లెటర్ అందింది. మనం డ్రామా కాంపిటీషన్‌కి వెళ్ళడానికి సెలక్షన్ వచ్చినందుకు చాలా సంతోషించాను. సెలక్షన్‌కమిటీలో పెద్దలు చాలా మంది వున్నారని వ్రాసారు. సినిమా డైరెక్టర్లు, ప్రొడ్యూసర్లు కూడా వస్తారని 'నీవు తప్పక సెలక్టవుతావు సినిమా తారగా' అని వ్రాసారు. మీ ఆశీస్సులు వుంటే అలాగే కావచ్చు. కాని ఒక్క విషయం. ఈసారి నేను హీరోగా వేయను, మన మూర్తి వేస్తాడని వ్రాసారు. అంతేగాక, నాకు ఇదివరకు కంటే వొళ్ళు వచ్చింది, లావయ్యాను. అందుచేత అన్‌ఫిట్ హీరోకి అని వ్రాసారు. కాని నేను మీతో యాక్టు చేసినంత బాగా ఇంకెవరితోను చేసి మెప్పు పొందలేనేమో అని భయంగా వుంది. అయినా గురువులాంటివారి ఆజ్ఞ శిరసావహించక తప్పుతుందా! నేను నాల్గురోజులలో వస్తాను.

సెలవు
మీ నీల

ఉత్తరం చదువుతూండగానే శ్యామల వచ్చి గది గుమ్మంలో నిలబడింది కూడా అతను గమనించలేదు. లెటరు మడచి పరుపు క్రింద పెట్టి అటు చూసాడు.

'యేరా తమ్ముడూ! అంత దీక్షంగా చదువుతున్నావు, ఉత్తరం, నేను వచ్చిందికూడా గమనించలేదు. ఎవరు వ్రాసారేమిటి?

'ఎవరో నీకెందుకులే'?

'చెప్పరాదురా......... బహుశా నీ హీరోయిన్ నీలవేరి గారయి వుంటారు, అవునా'?

'అయితే యేం... మీ అందరికి ఆ అమ్మాయంటే ఎందుకే అక్కా అంత ద్వేషం? ఆ అమ్మాయి ఎంత మంచిదో తెలుసా! తెలిస్తే మీరు ఇలా అపార్థం చేసుకోరు పోదురు'.

'తెలుసు కనకే ఆ పిల్లతో ఇన్ని నాటకాలు ప్రదర్శించినా వూరుకున్నాము, అయినా ఆ పిల్ల మంచి మాకెందుకు, నీవుచాలా మంచివాడవని మాకూ తెలుసూ...... అందుకే పెదనానకూడా ఇంత కాలం ఉపేక్ష చేసారు' అంది.

'దేనికి ఉపేక్ష చేస్త.........?'

'అదే నీ పెళ్ళికి......... సరే కాని పెళ్ళివారు వచ్చే వేళ అవుతోంది, ఈ రోజే చాలా మంచి రోజట. తాంబూలాలు కూడ పుచ్చుకుందికి తయారుగా వస్తున్నామని కబురు చేసారు. నీవు కాస్త తయారవు త్వరగా' అంది.

'అయితే అక్కా! పిల్ల ఎవరికి నచ్చినట్లు?'

'ఎవరికేమిటిరా, అందరికీను. ఆ పిల్లని ఎంచడానికి మన్మథుడుకి కూడా హక్కు లేదనుకో' అంది శ్యామల, ఎవరో కింద నుంచి పిలిస్తే వెళ్ళిపోయింది,

నీలని తాను ఎందుకు పెళ్ళిచేసుకోగూడదు? అనుకున్నాడు.

హృదయ పూర్వకముగా నిన్నే ప్రేమిస్తున్నాను. నా కనుపాపలో ఎప్పుడూ నువ్వే పసిపాపలా ఆడుతూ ఉంటావు? అనే నీల డైలాగ్సు నిజాలే యేమో అనిపిస్తోంది! ఆమె తనని అందరి కన్నా మిన్నగా ప్రేమించి మాట్లాడుతుంది! ఆదరిస్తుంది. తనని చూచి ఆనందిస్తుంది, మురిసిపోతుంది; అవే ఆలోచనలు అతన్ని చాపచుట్టలా చుట్టి వేస్తున్నాయి. ఆమె పెదవులమీద చిరునవ్వు, చిలిపి చూపులు అతని హృదయాన్ని పాశంవేసి లాగసాగాయి.

ఇంతలో వీధిలో, రెండు టాక్సీలు ఆగిన చప్పుడు! 'అమ్మమ్మా! వచ్చేశారే'...అంటూ వాసు మోసుకువస్తున్న వార్త వినబడింది. బిగ్గరగా 'కేశవా'...అన్న ఆజ్ఞా పూర్వకమైనతల్లి ఆహ్వానం విని సభ్యతకు లోపం రాకుండా కేశవ తయారయి క్రిందికి దిగి వచ్చాడు.

'అమ్మయ్య! ఎక్కిన గుమ్మం దిగి వచ్చాడురా బాబు! మా తమ్ముడు మంచివాడు ఎలాగైనా' అంది శ్యామల.

'నన్ను పొగుడుతేయేం ప్రయోజనం అక్కా! అదిగో ఆ వచ్చే పెళ్ళి వారిని కాస్త కాకాపట్టితే ఆడపడచు లాంఛనాలు బాగా సంపాదించవచ్చు' అన్నాడు.

శ్యామల కట్టుకున్న పట్టుచీర జరీ అంచు సవరించుకుంటూ పసుపుకొంగు కుడి ప్రక్క చేతిక్రింద నుండి లాగి ఎడం ప్రక్కకు బిగించి దోపుతూ 'దొడ్డమ్మా! నీవు చీర కట్టుకున్నావా, లేదా! అప్పుడే వాళ్ళు వచ్చేసారు.'

...అంటూ చేతిలో మల్లెల మాలని సావిత్రమ్మ సిగచుట్టూ అమర్చి కట్టింది. రాళ్ళ చామంతి బిళ్ళ సిగ మధ్య మలిచింది. 'త్వరగా వడ్డాణం పెట్టుకోమ్మా! వియ్యపురాలి కళ వచ్చేసింది సుమా...' అంది వేళాకోళంగా... 'నీకూ వచ్చిందే ఆడపడుచు హడావిడి! పదపద...వస్తున్నా! మీ పెద్దనాన్నగారు కేక లేస్తారు. అక్కడ ఎవ్వరూ లేకపోతే'అంది మొల వడ్డాణం సవరించుకుంటూ.

పెద్దహాలు, సోఫాలతో, కుర్చీలతో, బల్లలతో అమర్చి నీటుగా ఉంది. హాలులో ఒకమూల చిన్నబల్ల మీద ఒక స్టీల్ వాజ్‌లో మస్తాన్ అగరువత్తులు నిండా పెట్టి వున్నాయి. ఇంకో ప్రక్క ఫ్లవర్స్‌తో నిండిన వాజ్‌లు రకరకాలైన అలంకరణలతో. పెళ్ళికళ ఉట్టిపడుతోంది.

వంట ఇంట్లో వచ్చే పెళ్ళివారికొరకు, ఫలహారాలు కాఫీలు తయారవుతున్నాయి. శ్యామల మరొకసారి అద్దం ముందు నిలబడి సిగపువ్వులు సవరించుకొని వచ్చింది.

వీధిలో గేటుముందు ఆగిన టాక్సీలోంచి ఒకరొకరే దిగాముకి మొదట శ్యామల భర్త రామకృష్ణ దిగాడు. అసలు ఈ పెళ్ళి-సారథ్యం పూనిన మధ్యవర్తి పెళ్ళికూతురు మేనమామ కొడుకు ఒకరొకరే దిగి లోపలికి నడుస్తున్నారు. వీధి వరండామెట్ల దగ్గర నిలబడ్డారు. శ్యామల, కేశవ తండ్రి సత్యనారాయణగారు వారికి ఎదురు సన్నాహం పలుకుతున్నారు. కేశవ లోపల గదిలో మంచం మీద కూర్చొని ఉన్నాడు. వాసు హడావిడిగా అటు ఇటు పరుగులు తీస్తున్నాడు.

వచ్చిన వారందరూ హాల్లో ఉచితాసనాలమీద కూర్చున్నారు. వారి మధ్య మాటలు లయతప్పని సంగీతంలా సాగి పోతున్నాయి. రామకృష్ణ 'బావా! అసలు పెండ్లికొడుకుని పిలవకుండా పెండ్లిమాటలేమిటి' అంటూ ఒక్క కేక పెట్టాడు చనువుగా.

కేశవ వచ్చి అక్కడ వున్న కుర్చీలో కూర్చోబోయాడు అడ పెండ్లివారి వంక ఆయన 'ఇలాకూర్చోండి'అనితను జరిగి సోఫా ఇవ్వబోయాడు. 'పర్వాలేదు. లెండి' అని అక్కడే కూర్చున్నాడు. మర్యాదకు లోపం రాకుండా అందరికీ వందనం చేసాడు

అప్పుడు కట్నాల కబుర్లు సాగుతున్నాయి. అవతల పార్టీలోంచి ఒకాయన లాంఛనాలని గురించి అడుగుతున్నాడు. 'మీకు తెలియనిదేముంది! మా కంటె ఎక్కువ కార్యాలు చేసిన వారికి మేము చెప్పవలసినదేముంది, అయినా అన్నిటికి, మధ్యవర్తిలా మా అల్లుడు ఉండనే ఉన్నాడు' అన్నారు బాధ్యత అంతా అలుడి మీద పెడుతూ సత్యనారాయణగారు.

'వాడికేం తెలుసు కుర్రాడు' అన్నాడు పెళ్ళి కూతురు తండ్రి మేనల్లుడి మీద అభిమానం ఒలకబోస్తూ, తన పెద్దరికం వుంచుకొని.

'తెలియకేమండీ! తన పెళ్ళికి లడుగడుక్కా అలకలు తీర్పించుకున్నావాడేగా, అలాగే రానూ చేయిస్తాడు'...అన్నాడు హాస్యంగా కేశవ బావని ఎత్తిపొడుస్తూ.

'సరేలేవోయి, నా సంగతి వేరు...నీవు పెద్ద సంఘ సంస్కర్తవి; గొప్ప ఆదర్శ వంతుడవు కదామరి. నాకు నీకు తేడా లేదూ...మరి నీలా నేను వందమంది అమ్మాయిలనుచూసి స్వయంవరాలు చేయలేదు. అసలు మీ అక్కకు నేను, మంగళసూత్రం కట్టినప్పుడుగాని చూడలేదు ' అన్నాడు రామకృష్ణ.

'నీవు చూడడం ఎందుకు, అక్కే నిన్ను చూసింది......' అన్నాడు హాస్యంగా.

అందరూ గొల్లున నవ్వుకున్నారు.

ఇంతలో శ్యామల టిఫిన్సు ట్రేలో అమర్చి తెచ్చి అందరి ముందు చిన్న చిన్న బల్లలమీద ఉంచింది.

'ఇప్పుడు ఇవన్నీ ఎందుకమ్మా'...! అన్నారొకాయన

'ఎందు కంటావేమిటి మామయ్యా! పెళ్ళివారిల్లు' తీసుకో! మొహమాట పడక; లాంఛనాలన్నీ ఆడపడుచులకు...అల్లుడికీను... ఫలహారాలు మాత్రమే మధ్యవర్తులకు దక్కేవి' అంటూ ఓరగా శ్యామల కేసి చూసాడు, రామకృష్ణ.

'అదే!...అల్లుళ్ళకోవలోకి మీరు వచ్చారుగా, ఇటూ అల్లుడే, అటూ అల్లుడే, రెండు ప్రక్కలా అందుకోవచ్చు మీకు టూఛాన్సెస్ వున్నాయి' అంది హాస్యంగా తిరిగి.

ఆ రోజు ఇలాగే ఏవో కబుర్లలో సరదాగా నిశ్చిత తాంబూలాలు అందుకున్నారు. వచ్చిన పెళ్ళివారు వెళ్ళిపోయారు. అక్కడకు ఒక ఘట్టం అయిపోయిందనుకున్నారు.

ఇల్లు సద్దుమణిగింది. శ్యామల, వాసు, ఇంటికి వెళ్ళిపోయారు.

ఈ విశేషమంతా సావిత్రమ్మ, కూతురు వసంతకి వ్రాసింది. త్వరలోనే ముహూర్తం కూడా కుదిరిందనీ, అల్లుడిని సెలవలకి ప్రయత్నించమనీ, ముందుగానే ఇద్దరినీ బయలుదేరి రమ్మనీ వ్రాసింది.

సత్యనారాయణగారు కూడా కొడుకు పెళ్ళి కుదిరినట్లు తన తమ్మునకు వ్రాసాడు. వారం రోజులైనా ముందుగా నీవు మరదలు రావాలని, తమ్ముని కొడుకు రామూని ముందే ఇక్కడకు పంపమనీ వ్రాసాడు.

(సశేషం)

స్త్రీల పాటలు

శ్రీ పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు

ఆంధ్రసాహిత్య నందనోద్యానమున విరబూసిన తొలికారు దేశిసారస్వతము, ఈ సారస్వతశాఖకు మణిమకుటమువంటి స్త్రీల పాటలు. నన్నయగారి మార్గకవితా ప్రవంతి తెనుగు మాగాణమున జగన్నాధుని రథచక్రములవలె ముందుకు సాగిపోవుచున్న సమయమున ఈ ప్రాచీన సాహిత్య ప్రక్రియ ఆ వోరిపిడికి తట్టుకొనజాలక నివురుగప్పిన మాణిక్యమై పోయినది. దేశి వాఙ్మయ కవితాచక్రవర్తియైన పాల్కురికి సోమనాథుని రచనాప్రతిభతో ఈ శాఖా సాహిత్యమునకు మరల ప్రాణప్రతిష్ఠ జరిగినది. పదిహేను, పదహారు శతాబ్దములలో అనేకమంది రచయితలు ఈ వాఙ్మయశాఖకు సంఘములో సముచితస్థానమును గల్పించుటకు ప్రయత్నములు సలిపిరి. వారి అమూల్య కృషిఫలితముగా నేటికి ఈ శాఖ దినదినాభివృద్ధినందుచు, పండిత, పామరులకు ఆదరపాత్రమై తెలుగు వీధులయందు విశిష్టస్థానమున వర్థిల్లుచున్నది.

ఈ స్త్రీల పాటలయందలి సుందర, సుకుమారభావములు గుండెలకు హత్తుకొని పోవునట్టి అనుభవపూరితములైన లలిత పదములు, వీనికి అనుకూలములై లయబద్ధములైన సరస సంగీతము, ఈ శాఖ వాఙ్మయ క్రమవికాసమునకు, బహుజనాదరణకు మూలభూతములైనవి. నేడు ఈ పాటలసంఖ్యను గణియించి చెప్పుట అసాధ్యము.

రాజకీయ, మత, సాంఘిక పరిస్థితుల ప్రభావమున కొంతకాలము ఈ స్త్రీలపాటలకు బాహ్యప్రపంచమున తగిన ప్రాచుర్యము లభించకపోయినను అవి గృహములయందు దినదినాభివృద్ధి నందినవి, గృహశ్రీ కళాసంపదకు స్త్రీలపాటలు ఆణిముత్తియములవంటివి. ఆ పాటలు వారి అంతరంగిక సర్వజీవనమునకు ప్రతిబింబములు.

పురుషకవుల ప్రపంచము వేరు, వారి భావనాపరిధి, ఊహాసంపద అనంతము, అతి విచిత్రము. ఇక రచయిత్రుల లీలావిహారమంతయు గృహాంగణములకే పరిమితమైయుండి వాని వికాసమునకు అవి తోడ్పడుచుండును. వారి ఆశయములు, ఆశలు, అభిరుచులు, ఆభరణములు, ఆలోచనలు అన్నియు గృహసంపదను అభివృద్ధిచేసి తీర్చిదిద్దినవై యుండును. గనుక వారికల్పనాపటిమ, భావనాసంపద రచనాసంవిధానము ఆ హద్దులకు ఆ పరిమితికి లోబడియున్నంత మాత్రముచేత అది సంకుచితమైనదని, అందు సరియైన విజ్ఞానముండదని భావించరాదు. పురుషకవులు తమకు గల భావనాపటిమతో, వర్ణనా నైపుణ్యముతో చేసిన మహత్తర కల్పనలంతటిని రచయిత్రులు తమకు గల స్వల్పపరిధితోనే, గృహసంబంధమైన తమ విజ్ఞానముతో, అనుభవముతో, అనుభూతితో ఈ పాటలను మధురాతి మధురముగా తీర్చిదిద్ది అనంతమైన కాలమున సంభవించు పొడుదుడుకులను ఎదురొడ్డి నిలుచునట్టి విజ్ఞాన శిలాఖండములుగా వానిని తీర్చిదిద్దిరి. గనుకనే అవి ఎన్ని ఆటుపోటులు సంభవించినను, విప్లవములు చెలరేగినను నశియించక నిత్యనూతనములై ప్రకాశించుచున్నవి.

నిత్యము స్త్రీలు నిర్వహించు గృహచర్యలను మనము మూడు విధములుగా విభజించవచ్చును. 1. గృహసంబంధమైన పనులు 2. వినోద కార్యక్రమములు 3. తీరుబాటు సమయము.

1. గృహసంబంధమైన పని:— ప్రతిగృహిణి తనభర్తకొరకు, తన సంతానము కొరకు తన ఇంటిని తీర్చి దిద్ది సర్వాంగ సుందరముగా నొనర్చుటకు యత్నించును.

2. వినోద కార్యక్రమములు:— తన ఇంటియందు పొరిగింటియందు కలిగిన సంతానము, వానికి సంబంధించిన కార్యక్రమముల నిర్వహణకు అవసరమగు విషయములు, అట్టివానితో సంభవించు సుఖదుఃఖములు, తత్సంబంధమైన వివిధ కార్యక్రమములే ఈ వినోదములు.

3. తీరుబాటు సమయము:— స్త్రీలు పై వివరించిన కార్యక్రమముల నన్నిటిని సక్రమముగా నిర్వహించిన అనంతరము లభించిన మిగిలిన సమయమే వారి తీరుబాటుకు సంబంధించినది. ఇది స్త్రీల కష్టార్జితము. అది వారి స్వంతము.

స్త్రీ తన జీవితములో నిత్యకృత్యము తాను చేయవలసిన పనిని మిక్కిలి సంతోషముగ, ఐచ్ఛికముగను, నేర్పుతోను, ఓర్పుతోను నిర్వహించుచుండును. తనకు ఆ పనులలో కలిగిన అనుభూతులను, అనుభవములను, తాను గనిన దివ్యస్వప్నములను ఈ రచనలలో సొంపుగా తీర్చిదిద్దుటకు సంకల్పించును. గనుక వారి రచనలన్నియు ఈ త్రివిధ వ్యాపారములచుట్టు పరిభ్రమించుచు గృహసీమలను, స్వర్గసీమలు చేయుటకు ప్రయత్నించుచుండును. ఈ స్త్రీల పాటలను పై వ్యాపారము ననుసరించి మనము ఈ క్రింది విధములుగా విభజించవచ్చును.

1. గృహశ్రీకవనము:— జీవితములో స్త్రీకి అధికభాగము గృహసంబంధమైన పని పాటలతోనే సరిపోవును. ఆమెకు తాను చేయు పనిలో ఆనందము, ఉత్సాహము, ఉల్లాసము, ప్రేమ అనుబంధము మిక్కుటముగా నుండును. ప్రతి పని ఐచ్ఛికముగా నిర్వర్తించుచుండును. గనుక తనకు కలిగిన ఆనందములో తాను తన్మయురాలై పోయి, తాను పనిలో నిత్యము చూచి తనచుట్టు ఆవరించియున్న సుందరదృశ్యములకు చక్కని రూపకల్పనచేసి, తన జీవితానుభవములను అందులో రంగరించి, మధురమైన రచనలుచేసి, తనచుట్టు ఆవరించియున్న వాతావరణమును, దానినుండి తాను పొందిన అపూర్వలోకానుభవమును, తన రచనలకు ఆమె ఉపయోగించుకొనును, ఆ ఉత్కృష్ట సంస్కారబలమే, ఆమెరచనకు మేలు

బంతియై భాసించును, స్త్రీ నిత్యము జీవితములో తాను వినుచున్నట్టి లోకోక్తులను నుడికారపు సొంపులను జాతీయములను, సామెతలను తనకు అందుబాటులోనున్న సర్వస్వమును తన రచనలలో ప్రతిబింబింపజేసి, సహజ సుందరమైన తన రచనకు అధికమైన అందమును ఆనందమును, మార్దవమును కలుగజేయునట్లు తీర్చిదిద్దుచుండును. గనుక స్త్రీల పాటలు సహజ శోభాసంపత్తితో వెలుగొందుచుండును. దీనిని బట్టి ఈ స్త్రీల పాటలకు గృహజీవనము, గృహసంబంధమైన వాతావరణము ముఖ్యవస్తువని, వానిని తీర్చిదిద్దుటకు వారు మిక్కిలి అప్రమత్తులై మెలుగుచుండ గలరని తెలియును.

ప్రబంధకవులు ఊహించు ఊహలకన్న ఈ స్త్రీల పాటలలో యెంతయో లాలిత్యము, మాధుర్యము, సౌందర్యము, యథార్థత గోచరించుచుండును. నిత్యజీవితమునకివి యెంతయో సన్నిహితముగా నుండి సహజసౌందర్యముతో, వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించుచుండును. తన కన్నబిడ్డలను తలచుకొని మాతృదేవి పొందు సహజ ఆనందమును, అనుభూతిని ఈ పాటలో తిలకించుడు—

"గోరంత దీపమ్మ కొండల్ల వెలుంగు
గోపాల కృష్ణమ్మ గోవులకు వెలుంగు
మాడంత దీపమ్మ మేడల్ల వెలుంగు
మాచిన్న అబ్బాయి మా కళ్ల వెలుంగు॥

ఆ చిన్న అబ్బాయి అవయవములలో వచ్చు ప్రతి కదలికలోని మార్పు, అతని భవిష్యత్తును గురించిన ప్రతి ఆలోచన, యెన్నో విధములుగా ఆ తల్లి ఊహించుకొని ఆనందముతో పరవళ్లు తొక్కుతుంది. తనకన్న కుమారుడు భవిష్యత్తులో చేయబోవు ఉద్యోగము గురించి, అతడు సంఘములో పొందనున్న గౌరవ మర్యాదలను గురించి ఆమె చేసే ప్రతి ఆలోచనా, ఊహాతీతముగా వుండగలదు. అదే యథార్థమైన మాతృ ప్రేమలోని ఉత్కృష్టత. ఒక్క అబ్బాయిని గురించి మాత్రమేనా ఆమె ఆలోచనలు. ఊహలు! తనకు కలిగిన స్త్రీ సంతానమును గురించి ఆమె పొందే అనుభూతులను, ఆలోచనలను తిలకించండి—తెలుస్తుంది.

"పూసపాటి వారి లోగిళ్లలోను
పురివిప్పి ఆడింది పుణ్యంపు నెమిలి
భాగ్యపాటి వారి లోగిళ్లలోను
పాల్తాగి ఆడింది పట్టి అమ్మన్న—"

సంతానవతియైన తల్లి తనకుమార్తెలను కుమారుల గురించి, వారి ఉజ్వల భవిష్యత్తులను గురించి వారు భావి జీవితములో అనుభవించబోవు సిరిసంపదలను గురించి, భోగభాగ్యములను గురించి ఆమె కనునట్టి కలలన్నియు, ఈ పాటలలో ప్రతిబింబించుచుండును. అదే ఈ పాటలకుగల ప్రత్యేక విశిష్టత.

తల్లి తనబిడ్డ అత్తవారింటికి వెళ్లునప్పుడు. ఆమె కనబడుతూ వున్నంత వరకు చూస్తూ—

ఏరెంత వెళుపమ్మ ఇసుక సున్నమ్మ
ఏరుదాటి వెళ్లింది ఎవరాడపడుచు
మూట నున్నది ప ౹పు పొట్లాన కుంకుం
ఒడి నింద పోకలు ౹ ండుటా లు
భమిడి శ్రీ పిల్లమ్మ సాౖరెవెళ్లి ది — అని.

గృహిణికి తన ఇంటోవుండే గోసంపదను గురించి వుండే అభిమానము, ఆప్యాయత వర్ణనాతీతము.

కాటుక కన్నుల్ది కట్టావు పడ్డ
చెరువు నీళ్లూ తాగి చెంగలి మేసె
గుంట నీళ్లూ తాగి గుజ్జెన్న మేసె
వచ్చెనే మన వీధి వాడవాడలకు
కట్టరా అన్నయ్య గాజు కంబాల
ముడివేయరా తమ్మయ్య ముత్యాల కొలకి
పితుకరా అన్నయ్య బిందెల్లలోను
అందుకోవే చెలి ఆ పాల చెంబు
కాగబొయ్యే వదిన కాగుల్లలోను

ఈ పాటలో విషయము కేవలము తమ ఆవును గురించి చెప్పినప్పటికీ, ఆనాటి అవిభక్త కుటుంబపు శోభ, మాధుర్యము ప్రతి వ్యక్తి గృహాభివృద్ధి కొరకు కలసి కట్టుగా చేయునట్టి పనులు ఇందులో గోచరించుచున్నవి.

స్త్రీకి పుట్టినిల్లు అంటే ఉండే ఆదరణము, అభిమానము 'అంతాఇంతా' కాదు. తన పుట్టినింటి నుండి వచ్చిన వ్యక్తులను చూచి ఆమె పొందు ఆనందమునకు అవధులుండవు. కనుక పెద్దలు "జననీజన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసీ—" అన్నారు. ఈ క్రింది పాటను తిలకిస్తే ఈ నానుడి యందలి యథార్థత మనకు వ్యక్తమౌతుంది. పుట్టింటిని గురించి తలచుకుంటే ఆమె పొందే అవ్యక్త మధురమైన ఆనందం, అనుభూతి ఎటువంటిదో, ఎంతటి ఉత్కృష్టమైనదో మనకే తెలుస్తుంది—

కాశీ కెళదామంటే కదలవే కాళ్లు
ఢిల్లీ వెళదామంటె తిరగదే మనసు
మారాచ పుట్టింటి కెళదాము అంటె
నాకాళ్లు పన్నిన్న రథములై నడచు
నా చేతులుయ్యాల చేరులై ఊగు — అంటుంది.

ఈ స్త్రీల పాటలలో తరచుగా అతిశయోక్తి కనుపించినను ఉపమాన, ఉపమేయములు, శబ్ద ప్రయోగములు అతివిచిత్రముగా భాసిస్తూ వుండగలవు. అవి మనస్సును హృదయాన్ని కదలించి వేయగలవు. మన మనస్సుకు హృదయానికి అందని ఏవోమధురానుభూతులను, దివ్యానుభూతులను కలిగిస్తూ వుంటాయి. ఆ పాటలలోని గొప్పతనము, ఉత్కృష్టత, మార్దవము అటువంటివి.

తన బిడ్డపైన, అతని ప్రతికదలికపైన, చేష్టపైన తల్లికుండే ఆదరణము, అభిమానము, ఎటువంటిదో, ఆమె అతనివి

చూచి తన్మయత్వముతో, ఎటుల పొంగిపోవునో ఒక్కసారి చూడండి మీకే తెలుస్తుంది—

"వాకిట్లో అబ్బాయి ఆడంగ జూచి
వజ్ర మాణిక్యమని వాలెచిలకల్లు—"

ఇది మాతృ ప్రేమలోని వర్ణనాతీతమైన దివ్యానుభూతి. అవధులు దాటిన ఆనందము—

స్త్రీల పాటలలో తరుచుగా కనుపించే హాస్యము పల్లెటూళ్ల లోని ప్రతి గృహములోను మనకు వినిపిస్తూ వుంటుంది. అయితే అది మానవ నైజగుణాన్ని మాత్రము అంతగా ప్రతిబింబింపజేయ దని పెద్దల భావన—

అన్నల్లు వచ్చేరు కూరేమి లేదు
అరటి కాకర కాయ అలచందపప్పు
మరుదుల్లు వచ్చేరు కూరేమి లేదు
మంచాన నల్లులు గోడ బల్లులు!
అత్తవారింటికి కొత్తల్లుడొస్తేను
కొత్త సున్నముదెచ్చి మెత్తరమ్మ!

ఈ పాటలన్నీ వాడుక భాషలో ఉంటవి. ప్రతి వ్యక్తీ సులభముగా చదువుకొని ఆనందించవచ్చు. ఇతరులను ఆనందింప జేయవచ్చును. ఈ పాటల రచనాకాలముగాని, రచయితల పేర్లుగాని, వారి నివాస స్థలముగాని వీటివల్ల మనకు తెలియరావడములేదు. కొన్ని పాటలలోని ఇతివృత్తాన్నిబట్టి, చారిత్రికాంశములనుబట్టి వీటి కాలమును ఉజ్జాయింపుగా గుర్తించవచ్చును. ఉదాహరణకు ఈ క్రింది పాటను చూడండి.

పూసపాటివారి లోగిళ్లలోను

పురివిప్పి ఆడింది పుణ్యంపు నెమలి—

అన్న ఈ పాట 1740-1757 సంవత్సరములమధ్య విజయనగర సామ్రాజ్యమును పాలించిన పూసపాటి పెద విజయ రామరాజు కాలమును ప్రతిబింబింపజేయును.

కొన్ని పాటలలో తెలుగుదేశపు పురాతన నగరముల పేర్లు గోచరిస్తవి. చూడండి.

"ఎంత చక్కనిదమ్మ ఏలూరు తోట—"

"సింహపురి, సింహపురి అందురేగాని—"

అటులనే మన దేవతలనుగురించి, చేయు స్తుతులు, మతముల ప్రశస్తిని గురించి తెలిపే పాటలును ఎంతో మధురముగా ఉంటవి—

"మమ్మేలు దేవగిరి శ్రీ నరసింహా—"

"తిరుపతీ వెంకయ్య తిట్టబోకయ్యా—"

"తిరుమంత్రమే వీరి తిరుమేనులై యుండు"

"పరంజ్యోతి ప్రణవమే పట్టెమంచమ్మ—" మొదలైనవి.

...క యాత్రలకు సంబంధించిన గానములు, వివిధమండలములలో వివిధ విధాలుగా వుంటవి. ఒకే పాట వేరు వేరు ప్రాంతములలో వేరు వేరు విధములుగా గోచరించును. అయినను వానిలో అనేక పోలికలు, సన్నిహిత సంబంధములు, మనకు దృగ్గోచర మౌతవి. ఈ పాటలన్నియు తెలుగుజాతి జీవిత విధానమును, మత సంస్కృతులను, ఆచార వ్యవహారములను, నాగరికతా వైభవములను ప్రతిబింబింపజేయుచున్నవి అవన్నీ ఏకసూత్ర గ్రథితములై ఒప్పారుచుండును.

స్త్రీల పాటలు చాల వరకు ద్విపదచ్ఛందస్సులో వుంటవి. పిల్లలను నిద్రపుచ్చుటకు, ఈ పాటలను పాడుతూ వుంటారు. గనుక వీటికి, జోలపాటలని శ్రీ చేకుమళ్ల కామేశ్వరరావు గారు చక్కని నామకరణము చేసియుండిరి.

మంగళ గీతములు

గృహిణికి అత్యంత ప్రేమాభిమానములైన తన ఇల్లూ, తన బిడలూ, తన వాకిలీ, తన సంపదా, తన చుట్టూ ఇమిడి ఉన్న వాతావరణము కథా వస్తువులై గృహశ్రీ కవనములో ప్రముఖ స్థానము నాక్రమించి వర్ధిల్లుతూ ఉండగలవు. ఒక్కమాటలో చెప్పవలెనన్నచో, ఇది అంతయు స్త్రీల ఆత్మగతమైనది. గనుక వారి జీవితములకు ఇవి అత్యంత సన్నిహితములైనవి. వారు ఈ పాటలను జీవిత యాత్రలో వినోదోత్సవ సమయములందు పాడుచు కాలక్షేపము చేయుచుందురు. గనుక వీటికి మంగళ గీతములని పేరువచ్చినది. ఈ గీతములలో సార్వజనీనత, సార్వకాలీనత పోషింపబడుచుండును. అవి హృదయమును, ఆత్మను స్పందింప జేయుచుండును.

పురుషుడు తనకు గల విశాల భావనాపటిమతో, ఆలోచనా సంవిధానముతో ఈ లోకముతో పాటు, వేరొక లోకమును గూడ సందర్శించుటకు ప్రయత్నించ గలడు. ఇక స్త్రీ తనకు గల గృహ సంబంధమైన విజ్ఞానముతో, ఈ విశాల విశ్వమును దానిని సృష్టించిన సృష్టికర్తను, తన ఇంటిలో తన ముందు ప్రతిష్ఠించుకొని, తనకు గల అభిమాన బలముతో, స్వశక్తితో, స్వబుద్ధితో స్వర్లోక వాతావరణమును సృష్టించుకొని, మధురాతి మధురమైన రచనలు చేస్తుంది. అపూర్వము, అనన్య సామాన్యము అయిన వారి ఆ ప్రయత్నమే ఈ మంగళ గీతములు. ఈ పేరు గూడ ఆ గీతములకు తగినట్లుగా ఉన్నది.

ప్రేమ, భక్తి, అభిమానము అను నీ త్రిగుణములు త్రివేణీ సంగమము వలె ఒకదానితో, మరొకటి పెనవేసుకొని ఈ మంగళ గీతములలో మేళవించివున్నవి. కనుక ఇవి ఏ ఇంటిలో పాడినను, ఏ ఊరిలో పాడినను, అక్కడికక్కడే అచ్చు గ్రుద్దినట్లు అమరి పోతవి. వీటిలో విశ్వజనీనత, విశ్వమానవ ప్రేమ, విశ్వమానవ కల్యాణము బహుముఖములుగను, ప్రస్ఫుటముగను గోచరించు చుండగలవు.

"తొలుత బ్రహ్మాండంబు తొట్టె గావించి
నాలుగు వేదములు గొలుసులమరించి—"

అను ఈ పాటలో ఈ విషయమంత ఇమిడివున్నది.

మాతృ మూర్తియైన తల్లికి ఆ బిడ్డ అచ్యుతానందుడు. బ్రహ్మాండ మంతయు ఆ తొట్టియందు నిండివుంటుంది. ఆ మెకు— నాలుగు వేదములు—ఫణిరాజు దానికి పానుపు—ఓహో! ఇది ఎంత చక్కని ఊహ! ఎంత చక్కనిపాట.

అవధులు దాటిన ఆ నిండు ప్రేమతో ఆ తల్లి పాడుతూ వుంటే, నిజంగా ఆ ముల్లోకములు ఆమె ముందు నాట్యమాడటములో ఆశ్చర్యమేముంటుంది? ఈ పాటలో ఎంత భావము, ఎంత ఔచిత్యము, ఎంత హుందాతనము ఇమిడి ఉన్నదో! తనతోటి ఇల్లాండ్రతో, పిల్లవాడు జన్మించిన ఇరువది ఒకటవ రోజు తనకు జన్మించిన బుజ్జిబాబును తొట్టిలో వేసి, స్త్రీ లంతా కలసి ముక్తకంఠముతో ఆ పాటను గానంచేస్తూ వుంటే తెలుస్తుంది, అందులోని అందము, వాస్తవికత, గొప్పతనము అన్నీను కనుకనే ఈ పాటలకు అంత ప్రాముఖ్యత, గొప్పతనము సంఘంలో వున్నది.

ఈ లాలి పాటలు, జోల పాటలు రెండును పరమేశ్వరాంకితములు. పరమేశ్వరుని విభూతిని గురించి స్తుతించు ప్రణవమంత్రముల యందలి యథార్థతను, గొప్పతనమును మనము గ్రహించగలిగినా లేకపోయినా, ఈ పాటలను ముక్తకంఠముతో గానము చేయు ముత్తైదువుల మృదు మధురస్వరములో పరమేశ్వరుని లీలలు మనకు ప్రత్యక్షము కాకమానవు. శ్రీకృష్ణుని జననమూ, మార్కండేయ జననమూ, మేనకా దేవి నొప్పులు, సీత పుట్టుక మొదలైన పాటలన్నీ జననోత్సవములకు సంబంధించిన మధురాతి మధురమైన పాటలే.

బిడ్డలు భూమి మీదపడినప్పటినుండి వివాహము జరిగే వరకు వివిధ దశలలో, వివిధ సందర్భములలో పాడే పాటలున్నవి.

బిడలకు సంక్రాంతి పండుగ సందర్భములో భోగినాడు పండ్లు పోసి, ముత్తైదువు లందరునూ వినోదముగా కాలక్షేపము చేయు ఆచారము ఆంధ్ర దేశము నందలి ప్రతిగృహములోను వున్నది. భోగిపండ్లకు సంబంధించిన ఈ పాటల మాధుర్యాన్ని తిలకించండి - అంతా మీకేతెలుస్తుంది.

"శశి ముఖులారా రారే! మా పసిబాలలకు భోగిపండ్లు పోయుదాము—మంగళా కారులు మదన సుందరులు రంగు పీటపై రాణింపుచున్నారు—" అనునవి ఆ పాటలకు పల్లవులు, అనుపల్లవులు.

పురుషులు వ్రాసే పాటలకు చివరన పేరు వుంటుంది. కాని స్త్రీల రచనలకు అట్లా పేరు వుండదు.

"కాళింగ మడుగు దగ్గరకు పోకుమా! కృష్ణా!
కాళింగి మడుగులోన ఘనమైన పామున్నాది!
బాలుని కరచేనట? పాముదాగున్నాదట!"— ఇది యశోద శ్రీకృష్ణుణ్ణి దుడుకు పనులు చేయవద్దని వారిస్తూ పాడిన పాట.

ఇక పెండ్లిండ్ల సమయములో స్త్రీలు పాడే పాటలకు అంతు పొంతు వుండదు. ఈ పాటలు పిల్ల పెండ్లి కూతుర్ని చెయ్యటము దగ్గరనుండి ప్రారంభమై ఆమెను అత్తవారికి అప్పగించటముతో పూర్తి అవుతవి. ఈమధ్య వివిధ సమయములలో వివిధ రకములైన పాటలను ముత్తైదువులు పాడుతూ వుంటారు. ఈ సమయములలో వినిపించే మంగళ హారతులకు అంతు వుండదు. ఉదా—"అనసూయ దేవికి మంగళం, జయ మంగళం మంగళం—" మొదలైనవి.

ఈ శుభసమయములలో శ్రీకృష్ణుని మీద, శ్రీరాముడి మీద పాడేపాటలు కోకొల్లలు—వాటి మాధుర్యము విని తీరవలసినదే-ఎంత వ్రాసినను తక్కువే.

వివాహనిశ్చయమూ, ప్రయత్నమూ, తర్లి రావడమూ, పెండ్లి మండప వర్ణనమూ, పెండ్లితంతూ అన్నీ ఈ పాటలలో వివరముగా వర్ణించబడుతూ వుంటవి.

ముఖ్యంగా వివాహ సందర్భములలో మంగళసూత్ర ధారణ చేయునప్పుడూ, వధూవరులను పీటలమీద నుంచి లేవదీయునప్పుడూ, సీతా కల్యాణమునకు, పార్వతీ కల్యాణమునకు సంబంధించిన పాటలు పాడుతూ వుంటారు.

"వినవే శ్రీరాముల కళ్యాణ చరితము కమలాక్షి

వివరించెద—" అను పాట తరచుగా వినబడుతూవుంటుంది ప్రతి గృహములోను.

పెండ్లి ముగిసిన మరునాడు ఉదయమునుండి సాయంత్రము వరకు ఈ పాటల తంతు ఆగకుండా జరుగుతునే వుంటుంది. ఇదంతయు ఒక వరుసక్రమములో జరిగిపోతుంది.


పళ్లు తోమించుపాట, నలుగుల పాట, బంతులాటల పాట, బువ్వము బంతిపాట, వదినలను, మరదులను, బావలను, బావమరదులను ఎగతాళి చేయుపాటలు, వియ్యాల వారి విందు వింతలను, లోటుపాట్లను వర్ణించుచూ, రకరకములైనపాటలు పాడబడతాయి అయిదు రోజుల పెండ్లిలో వివిధ సందర్భాలలో పాడే పాటలకు విసుగు విరామం వుండనే వుండదు. ఆయా సమయములలో జరుగు దానిని ఇతివృత్తంగా గ్రహించి ఔచిత్య భంగము జరుగకుండా వుండేరీతిలో పాటలు వ్రాయటం జరుగుతుంది. కొన్ని సందర్భములలో ఔచిత్య భంగము జరిగినా ఆ ఉత్సాహ సంతోషములలో అన్నీ ఇమిడిపోయి ఆనంద ప్రవాహం జాలువారుతుంది. శ్రీ తూము నరసింహదాసు, శ్రీ ఘాలి సుబ్బారావు, శ్రీ గొల్లపల్లి వెంకటప్పయ్య దాసు మొదలైన వారు ఈలాంటి పాటల నెన్నింటినో వ్రాసి ఈ భాషా సాహిత్యమునకు యెంతయో పుష్టిని సమకూర్చిరి.

(సశేషం)


నగరంలో వార్తా చిత్రాలు



ఆగస్టు 15న గవర్నరు సలహాదారు శ్రీ హెచ్. సి. సరీన్, రెవిన్యూ బోర్డు కార్యాలయం వద్దనుంచి జనరల్ పోస్టాఫీసు వరకు సాగిన జాతీయ పొదుపు ఉద్యమం ఊరేగింపుకు నాయకత్వం వహించారు.



కండ్ల బ్యాంకుకు సంబంధించిన వార్షికోత్సవంలో గవర్నరు సలహాదారు శ్రీ వి. కె. రావు ఆగస్టు 19న ప్రసంగించారు. దీనికి శ్రీ బి.ఆర్.కె. శాస్త్రి, ఐ.ఎ.ఎస్. అధ్యక్షత వహించారు.



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎన్. భగవాన్‌దాస్ (కుడివైపు నుంచి రెండవవారు) ఆగస్టు 1 న హైదరాబాదు పబ్లిక్ స్కూలు వార్షికోత్సవ బహుమతి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. శ్రీమతి భగవాన్‌దాస్ బహుమతులను పంపిణీ చేశారు.

నగరంలో వార్తా చిత్రాలు



శ్రీ ఎన్. భగవాన్‌దాస్ ఆగస్టు 6వ తేదీన ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి ఇనస్పెక్టర్ల సంఘం సర్వసభ్య సమావేశానికి ప్రారంభోత్సవం జరిపారు.

ఉత్తర కాకతీయ యుగచరిత్రము

—శ్రీఆదిరాజు వీరభద్రరావు

(గత సంచిక తరువాయి)

మహమ్మద్ బిన్ తుగ్లక్ కపిలి రాజ్యమును జయించిన సందర్భమున ఆరుగురిని ఖైదీలుగ తీసికొనిపోయెను. వీరు బలవంతముగ ఇస్లాం మతావలంబకులైరి. అయితే తరువాత దక్షిణా పథమున చెలరేగిన రాజ విద్రోహమును గమనించి, తన వద్ద ఉన్న, ఇస్లాం మత ప్రవిష్టులయిన హరిహరరాయలను, బుక్కరాయలను తన ప్రతినిధులుగా నియమించి ఆనెగొందికి పంపించెను. హరిహర రాయలు. బుక్కరాయలు అను ఇద్దరు సోదరులు కాకతీయ ప్రతాప రుద్రుని కాలములో ఓరుగల్లులో ప్రముఖ పదవులను వహించిన వారై ఉండిరి. ప్రతాపరుద్రుని మరణానంతరము ఈ సోదరులిద్దరు కంపిలి వెళ్ళుటయు, అచ్చట బందీలుగా పట్టుకొనబడుటయు తిరిగి ఆ ప్రాంతమును ఏలుటకు పంపబడుటయు సంభవించినది. వీరిద్దరు శ్రీ విద్యారణ్య స్వాములవారి శిష్యులయి ఆయన అనుగ్రహమును సంపాదించుకొని, ప్రాయశ్చిత్తము చేసుకొని తిరిగి హిందువులైరి. విద్యారణ్య స్వాములవారి యుపదేశానుసారము విజయ నగర సామ్రాజ్యమునకు పునాదులు వేసినవారు వీరే. వీరును ఢిల్లీ చక్రవర్తిని ధిక్కరించి స్వతంత్రముగ నేలసాగిరి. చక్రవర్తి సైన్యముల నోడించిరి.

తెలంగాణ మంతయు రాజ విద్రోహముతో మండుచుండెను. ఇట్టి పరిస్థితులలో తెలంగాణమువంటి విశాల ప్రాంతమును అదుపులో ఉంచుట సుల్తానుకు దుష్కరమయ్యెను. కావున దానిని వరంగల్ ప్రాంతము, బందరు ప్రాంతము అను రెండు విభాగములుచేసి, పరిపాలకుల నియమించెను.

ఈ కల్లోల పరిస్థితులన్నిటిని గమనించుచు కాపయ నాయకుడు హిందూ రాజుల, సరదారుల సహకారముతో ప్రచండ సన్నాహము గావించి ఓరుగల్లుపై దాడిచేసెను. ఓరుగల్లులోని ముస్లిం సైన్యము ఈ దాడి యెదుట నిలువజాలక పోయెను. ఓరుగల్లు పాలకుడగు మాలిక్ మగ్బూల్ వరంగల్లు నుండి తప్పించుకొని పారిపోయెను. కాపయ నాయకుడు ఓరుగల్లు కోట శిఖరాగ్రమందు హిందూ ధ్వజము ఎగురవేసెను. ఈ విజయానంతరము కాపయ నాయకుడు ఆంధ్ర సురత్రాణ, ఆంధ్ర దేశాధీశ్వర అను బిరుదులను వహించెను. కాపయ నాయకుడు వరంగల్లు జయించుట, హరిహర బుక్కరాయలు తిరుగుబాటు కొంచెము హెచ్చు తక్కువగా సమకాలికములు. విజయ నగర నిర్మాణము 1336లో జరిగినది.

ఆంధ్ర సురత్రాణ, ఆంధ్ర దేశాధీశ్వర బిరుదాంచితుడై కాపయ నాయకుడు ఓరుగల్లు సింహాసనము నధిష్ఠించి తెలంగాణమును, కోస్తా ప్రాంతమును ఏలసాగెను. తనకీ యుద్ధ సంరంభమున సహకరించిన వీర నాయకులకు సామంత రాజ్యాధిపత్యము లొసంగి గౌరవించెను. వీరితో స్నేహ బంధము దృఢమగుటకు వివాహ బాంధవ్యములను కలిగించుకొనెను.

కాపయ నాయకుడు తన పితృవ్య పుత్రుడైన అనవోత నాయకుని కోస్తా ప్రాంతమునకు గవర్నరుగా నియమించెను. అనవోతనాయకుడు మొట్టమొదట తొయ్యేరును (చోడవరము తాలూకా, తూర్పుగోదావరి జిల్లా) తరువాత రాజమహేంద్రవరమును రాజధానిగా చేసికొనెను. గురిజాల వంశీయుడైన ముప్ప భూపాలుడు గుబ్బినాటి రాజ్యాధిపతి అయ్యెను. గుబ్బినాడు కరీంనగరుజిల్లా గోదావరీనది దక్షిణతీర ప్రాంతము. ఇతని రాజధాని రామగిరి. (ఆదిలాబాదు జిల్లా) మంచికొండ కూనయ నాయకుడు కోరుకొండలో కోటను నిర్మించి ఆంధ్ర దేశమునకు రక్షణ దుర్గముగా చేసెను. ఈ కూనయ నాయకుని పేరనే భద్రాచలం తాలూకాలో గోదావరి, శబరి సంగమ స్థానమున కూనవరం గ్రామము నిర్మిత

మైనది. కాపయ నాయకుడు తన మేనకోడలిని కూనయ నాయకుని కుమారుడు ముమ్మడి నాయకునకిచ్చి వివాహముచేసి బాంధవ్యము కలుపుకొనెను. కాపయ నాయకుని మరియొక సామంతుడగు కోమటి వేమారెడ్డి అద్దంకి రాజధానిగా ఆ ప్రాంతము నేలసాగెను. రాజ్యములో శాంతి భద్రతలు నెలకొనుటకు అవసరమైన ఏర్పాట్లన్నియు చేసెను. తెలంగాణములోని కోటలన్నిటిని దృఢపరచి ముసల్మానుల ప్రతిచర్య ఎట్లుండునోయని ఎదురుచూచుచుండెను.

ఇట్టి సందర్భములలో రేచర్ల వంశీయులయిన రాజుల విరుద్ధ భావము కాపయ నాయకునకు తలనొప్పి కలిగించెను. రేచర్ల వంశీయులయిన వెలమ దొరలు కాకతీయ గణపతిదేవుని కాలం నుండి ఆమనగల్లు, పిల్లలమర్రి పరిసర ప్రాంతములకు అధిపతులుగా నుండిరి. ఈ రాజన్యులలో మొదట సింగమ నాయకుడు దేశ విముక్తి కొరకు కాపయ నాయకునితో సహకరించినను, ఆంధ్రదేశాధీశ్వరుడగుటకు అభిజాత్యము లేని ఈ కాపయ నాయకుడెవడను ఈర్ష్యాభావము కలిగినవాడయ్యెను. అందుచే ఇతర రాజులవలె సింగమ నాయకుడు కాపయ నాయకుని ఆధిపత్యమునకు సమ్మతి తెలిపినవాడు కాడు. సింగమ నాయకుడు రాచకొండలో బలిష్ఠమగు దుర్గమును నిర్మించి తన రాజధానిగా చేసికొనెను.

కాపయ నాయకుడు దేశరక్షణ ప్రయత్నములు చేయుచుండగా సింగమ నాయకుడు స్వాతంత్ర్యము ప్రకటించి రాజికొండకు ఉత్తర, దక్షిణ ప్రాంతములందు రాజ్య విస్తరణ గావించుటకు ప్రయత్నించుచుండెను. ఈ విధముగా బలవంతుడయిన సింగమ నాయకుడు కాపయ నాయకుని సాధింపబూనిన వాడై కాపయ నాయకునిపై దాడి సలిపెను. ఈ యుద్ధములో కాపయ నాయకుడు ఓడిపోయెను.

ఈ అపజయము వలన కాపయ నాయకునకు అంతనష్టము వాటిల్లినట్లు కనబడదు. కాపయ నాయకుడు కాలు నిలుపుకొని, రేచెర్ల వీరుల జన్మభూమి అయిన పిల్లలమర్రిని జయించి, రేచర్ల వంశీయులకుగల "ఆమనగంటి పురవరాధీశ్వర" అను బిరుదును ధరించెను. 1346 తరువాత కాపయ నాయకుడు శాంతముగా నేలసాగెను.

పొరుగువారితో స్నేహము

ఈ సమయమున దక్కనులోను, గుజరాతులోను వుండు ముసల్మాను పాలకులు చక్రవర్తిని ధిక్కరించి ప్రవర్తింపసాగిరి. వీరి నణచుటకు సుల్తాను మహమ్మద్ బిన్ తుగ్లకు అటు ఇటు సైన్యములను నడిపించుచు యుద్ధము చేయవలసివచ్చెను. చక్రవర్తి దాడులను తప్పించుకొనుటకు ఈ పొరుగుననున్న తిరుగుబాటు నవాబులతో మైత్రి కలిగియుండుట క్షేమకరమని తలచి, కాపయ నాయకుడు గుల్బర్గాలోని అలావుద్దీన్ హసన్ అను పాలకునికి సైన్య సహాయము చేసెను. అలావుద్దీన్ హసన్ తుగ్లకు చక్రవర్తి సైన్యముల నోడించెను. అలావుద్దీన్ హసన్—"అలావుద్దీన్ హసన్ షాహబహమని" అను పేరుతో సింహాసనము ఎక్కెను. ఇతడే బహమనీ రాజ్య సంస్థాపకుడు (1347).

ఈ బహమనీ రాజవంశమే ఓరుగల్లు హిందూరాజ్యమునకు పక్కలో బల్లెముగా పరిణమించెను. అలావుద్దీన్ హసన్ బహమనీ ఇదివరలో ఢిల్లీ చక్రవర్తుల ఆధీనములోవున్న ప్రాంతముల నన్నింటికి తన యధికారమును విస్తరించుటకు నిశ్చయించుకొనెను. ఈ నిశ్చయానుసారము తెలంగాణమును వశపరచుకొనుటకు సైన్యములను పంపెను. కాపయ నాయకుడు చేసిన సహాయము-క్లిష్ట సమయములో తనకు జయము లభించునట్లు చేసిన సహాయమంతయు-అలావుద్దీన్ విస్మరించెను.

కాపయ నాయకునికీ దండయాత్ర విషయము తెలియకుండెను. ఢిల్లీ సుల్తాను దండయాత్రలు మాత్రమే తలంచుచుండెను. కాని మైత్రీ స్థానము నుండి దండయాత్ర సాగునని తలంచలేదు. అజాగ్రత్తగా నుండెను.

మిత్రద్రోహము

చెప్పవలసినదేమున్నది? కాపయ నాయకుడు అపజయము నొంది సంధి గావించుకొన వలసి వచ్చెను. కాపయ నాయకుడు సుల్తానుకు కొన్ని గజములను, విలువగల బహుమానములను పంపినవాడయ్యెను. ఈ సంఘటనము 1347, 1351 మధ్య కాలములో జరిగి యుండును. ఈ సంఘటనము తరువాత గూడ కాపయనాయకుడు స్వతంత్రుడుగానే వ్యవహరించసాగెను. బహమనీ సుల్తానుతో చేసికొనిన సంధి సూత్రములతో కాపయనాయకుడు బహమనీ సుల్తానుకు కప్పముగట్టవలయునను నిబంధనము లేకుండెను.

మహమ్మద్ బిన్ తుగ్లకు మరణానంతరము బహమనీ సుల్తాను పట్టపగ్గములు లేకుండ చరించసాగెను. కొన్ని సంవత్సరముల తరువాత తెలంగాణమును జయించి కాపయనాయకుని శాశ్వతముగా లోబరచుకొన ప్రయత్నించెను.

1355లో బహమనీ సైన్యములు తెలంగాణముపై దాడి వెడలెను. సుల్తాన్ స్వయముగా బయలుదేరెను. మార్గమధ్యమున దేశమును సర్వనాశము గావింపసాగిరి. ఒక సంవత్సరము ప్రయాణముచేసి భోనగిరి మండలమును స్వాధీనము చేసికొనెను. దేవాలయములను పడగొట్టి దేవతావిగ్రహాలను పగలగొట్టి ఆ స్థానమున మసీదులు, మదరసాలు నిర్మించెను. తెలంగాణము బహమనీ రాజులకు పూర్తిగా వశమయ్యెను.

బహమనీరాజుయొక్క ఈ యుద్ధ ప్రస్థానము కోస్తా జిల్లాల వరకు వ్యాపించినట్లు కనబడుచున్నది. పిల్లలమర్రి దేవాలయము వలె ధాన్యకటకములో అమరేశ్వర దేవాలయముకూడ అపవిత్రం గావింపబడెను. అనపోతనాయని మంత్రియైన కేతయ వేముడు యవనులను జయించినట్లు కనబడుచున్నది. కొండవీడు పాలకుడయిన ప్రోలయ వేమారెడ్డి సోదరుడగు మల్లారెడ్డి కూడ యవనులనోడించి తరుమ గొట్టెను.

కాపయనాయకునకు కలిగిన అపజయమువల్ల కోస్తా ప్రాంతములో అతని అధికారము సన్నగిల్లెను. అతని అధికారము నామమాత్రావశేషమయ్యెను. కాపయనాయకుడు తన రాజ్య విషయములను

చక్కబరుచుటకు ఓరుగల్లు విడుపుటకు ఉంచేకుండ బహమనీ సుల్తాను కబళించుటకు పొంచియుండెను

అలావుద్దీన్ హసన్‌షాహ 1359 లో మరణించెను. అతని కుమారుడు మహమ్మదు షాహ్ I రాజ్యాధిపతి అయ్యెను. అనంతరము బహమనీ రాజుల పీచమణచుటకు కాపయనాయకుడు విజయనగర రాజుతో సంధానము సాగించెను. ఈ ప్రక్కలో దిన దిన ప్రవర్ధమానమగుచున్న ముస్లిం రాజ్యము యొక్క యుద్ధ పిపాసా రాజ్యములకును, హిందువుల రాజకీయాధికారములకు ముప్పు తెచ్చెదే యని యిద్దరును గ్రహించిరి. కాపయనాయకుని వలెనే విజయనగర హరిహరరాయలును, తుంగభద్రా, కృష్ణానదులకు దక్షిణ భాగమందలి కొంత దేశభాగమును గోల్పోయియుండెను. వీరిద్దరును బహమనీ రాజ్యమును కూలద్రోయుటకు సంకల్పించిరి. ఈ సమయమున మహమ్మదుషాహ్ బహమనీ సుల్తానుగా గుల్బర్గా సింహాసన మెక్కియుండెను. ఈ మహమ్మదు షాహ్ తండ్రిని మించిన ప్రతాపశాలి.

కథను పొడిగించనేల? కాపయనాయకుడు తన కుమారుడగు వినాయక దేవు ఆధిపత్యమున ప్రచండ సేనను సమకూర్చి బహమనీ రాజ్యముపైకి పంపించెను. విజయనగర బుక్కరాజు కూడ 20,000 అశ్విక సైన్యమును సహాయముగా పంపెను. మహమ్మదుషాహ్ వినాయక దేవు నెదుర్కొనుటకు గొప్ప సేనను పంపించి, తాను కొంత సైన్యముతో విజయనగర సైన్యము నెదుర్కొనుటకు బయలుదేరెను. ఈ పోరాటములో చివరకు ముస్లిం సైన్యములే జయమును పొందెను మహమ్మదుషాహ్ విజయనగరమును దోచుకొని అరబ్ అశ్వములతో, గజములతో, దోపిడిధనంతో గుల్బర్గాకు మరలిపోయెను. వినాయక దేవు మొదట జయప్రదుడయినట్లుగనే యున్నది. కాని చివరకు అపజయము పాలయి వేలంపుట్టన్ అను స్వగ్రామమునకు పారిపోయెను. బహమనీ సేనాపతి వరంగల్లు కోట ద్వారముల వరకును యుద్ధయాత్ర సాగించెను. కాపయనాయకుడు బహుళ ధనమును, 25 గజములను, రత్నరాసులను సమర్పించి సంధిచేసికొనవలసి వచ్చెను.

అరబ్ వర్తకుల కథ

తరువాత కూడ కాపయనాయకుడు శాంతముగా నుండుటకు వీలులేకపోయెను. కొందరు అరబు వర్తకులు మహమ్మదుషాహ్ కొరకు అశ్వములను తీసికొని పోవుచుండిరి. వినాయక దేవు వారిని అడగించి కొన్ని ఉత్తమాశ్వములను వారినుండి లాగికొనెను. ఈ అశ్వములు మహమ్మదుషాహ్ కొరకు ఉద్దేశింపబడినవని వర్తకులు చెప్పినను వినాయకదేవు లక్ష్యము చేయలేదు. వర్తకులు వినాయకదేవు చర్యలను సుల్తానుకు తెలిపిరి. అశ్వ వర్తకుల కథనము విని మహమ్మదుషాహ్ తన గౌరవమునకు భంగము కలిగినదని కోపగించినవాడయి వినాయకదేవు దాగియున్న వేలంపుట్టన్ గ్రామంపైకి సైన్యముతో హుటాహుటి ప్రయాణం చేసెను. పట్టణంలోని జనులకు ఈ విషయం తెలియకుండెను. మహమ్మదు షాహ్ తటాలున పట్టణంలో ప్రవేశించి హిందువులను కత్తి కెరగా చేసెను. ఈ కల్లోలమును గ్రహించగనే వినాయకదేవు ఓరుగల్లు కోటకు ఎరుగెత్తి పోవుటకు ప్రయత్నించెను. ఈ ముట్టడి సందర్భంలో వినాయకదేవు తప్పించుకొని పోవుటకు వీలులేకపోయెను వినాయకదేవును బందీగా పట్టుకొనిరి. అరబు వర్తకులతో జరిపిన దుర్వ్యాపారమునకు సమాధానమేమిత్తువని సుల్తానడిగెను. వినాయకదేవుడు నిర్లక్ష్యంగా, పరుషముగా జవాబిచ్చెను. సుల్తాను అత్యధిక క్రోధచిత్తుడయి, రాక్షసగుణావేశుడయి, అతని నాలుకను కోసి వేయుటకును, కోటశిఖరాగ్రం నుండి క్రిందనున్న మంటలోనికి త్రోసివేయుటకును ఆజ్ఞాపించెను.

సుల్తానుపై ప్రజల పగ

సుల్తానుచేసిన యీ ఘోరకార్యమును ప్రజలు సహించలేక పోయిరి ఉద్రేకులయిరి. తెనుగువారు సుల్తానుపయి పగతీర్చుకొనుటకు సిద్ధపడిరి. వీరు పగటిపూట ఎచ్చటనో దాగియుండి రాత్రివేళ సుల్తాన్‌ను ప్రయాణం పొడుగునను దాడించసాగిరి. తిరుగు ప్రయాణంలో ప్రజలు పెట్టిన బాధలవలన అతని సైన్యంలో రెండువంతులు చనిపోయిరి. ఒక్కవంతు మాత్రమే మిగిలిరి. సుల్తానుకు గాయము తగిలెను.

కుమారుడయిన వినాయకదేవు మరణవార్త వినగానే కాపయనాయకుడు దుఃఖసాగరమగ్నుడయ్యెను. ఎట్లా యీ తురక రాజ్యమును పడగొట్టుటా యని కాపయనాయకుడు తలపోయసాగెను. ఈ బలిష్ఠ తురుష్క రాజ్యం వరంగల్లుకు తోకచుక్కగా నుండెను. ఈ నిరాశా పరిస్థితుల్లో తనకు సహాయము చేయుమని ఢిల్లీ చక్రవర్తికి విన్నపం పంపెను. కాని ఢిల్లీ చక్రవర్తి దానికి ప్రాధాన్యమివ్వక ఎట్టి ప్రత్యుత్తరమును వ్రాయలేదు.

ఈ వార్తను తెలిసికొని బహమనీ సుల్తాను మహమ్మదు షాహ్ ఓరుగల్లుకు నలువైపులనుండి సైన్యముల నడిపించెను. ఒక సైన్య పటాలము దౌలతాబాదునుండి బయలుదేరెను. కొంత సేనా నివహము గోలకొండవైపునకు నడిచెను. ఒక ప్రచండ సైన్యమును వరంగల్లునకు పంపెను. దీనివెనుక తాను బయలుదేరెను.

ఈ సమయమున కాపయనాయకునకు సహాయము చేయువారు లేరయిరి. అంతయు నిరాశా బద్ధముగా నుండెను. ముస్లిం సైన్యము నెదిరించజాలక అడవి మార్గము పట్టినాడట?

తన దేశం యింకను వినాశం కాకుండా రక్షించుకొనుటకై కాపయనాయకుడు సంధి చేసికొనుటకు సిద్ధపడెను. సుల్తాను కాపయనాయకుని ప్రార్థనను మొదట నిరాకరించెను. కాని చివరకు సుల్తాన్‌మధ్య, కాపయనాయకునిమధ్య సంధి కుదిరెను. ఈ సంధి ప్రకారం 300 గజములను, 250 అశ్వములను, 33 లక్షల రూపాయలు యుద్ధ ఖర్చుల క్రిందను కాపయనాయకుడు ఇచ్చుకొనవలసి వచ్చెను. అంతేకాదు, గోలకొండ పర్వతదుర్గమును శాశ్వతముగా సుల్తాను కిచ్చివేసెను. సుల్తాను సంతుష్టుడయినాడు కాబోలు, తన రాజ్యమునకు ఓరుగల్లు రాజ్యమునకు గోలకొండయే సరిహద్దుగా నుండుటకు నిర్ణయించెను. ఓరుగల్లు రాజుల అవిశ్వాసము ప్రక

టించనంత వరకు తన తరువాతి రాజులు వారికి ఎట్టి హాని తలపెట్టకూడదని ఆదేశించెను. ఈ సంధి కార్యం చక్కగా ముగిసిన తరువాత వైడూర్య రత్నస్థగితమయిన సింహాసనమును కాపయ నాయకుడు సుల్తాను మహమ్మదు షాహాకు బహూకరించెను. ఈ సంధి తరువాత మహమ్మదుషా తన మాట నిలుపుకొనెను. తరువాత ఎప్పుడును వరంగల్లుపై దండయాత్రలు చేయలేదు. బహమనీ సుల్తానుల మధ్యను, కాపయనాయకుని మధ్యను ఆర్థికమైన సంబంధము లేర్పడెను.

కాపయ నాయకుడు బహమనీ సుల్తానుతో పెనుగులాడుచుండగా, రేచెర్ల రాజన్యులు కాపయ నాయకు నెదురించుటకు తగిన జవసత్వములను పెంపొందించుకొనుచుండిరి. రేచెర్ల సింగమ నాయకుడు వివిధ ప్రాంతములను జయించుచు బలీయుడగుచుండెను.

క్షత్రియులైన చాళుక్య రాజుల జల్లిపల్లి కోటను సింగమ నాయకుడు ముట్టడించెను. చాళుక్యులకు తాము గెలిచెదమన్న ఆశ లేకుండెను. తాము కోటను నిలుపుకోలేమని స్పష్టమయినపుడు మోసమునకు వ్యూహము పన్ని సింగమనాయకుని వధించిరి. ఇందు వల్ల పరిస్థితి విషమించెను.

సోమ కుల పరశురాములు

సింగమ నాయకుని మరణవార్త తెలియగానే అతని కుమారులు అనవోతా నాయుడు, మదానాయుడు జల్లిపల్లిపై కురికి, ముట్టడించి గెలిచిరి. తమ తండ్రి మరణమునకు ప్రతీకారముగా అచ్చటి చంద్రవంశ క్షత్రియుల నందరను నిలువున నరికి నెత్తురు వరదలు ప్రవహింప జేసిరి. (1361). సోమకుల పరశురాములను బిరుదులను వహించిరి.

అనవోతా నాయకుని వీరవిహారమును కాపయ నాయకుడు భయవిహ్వాల చిత్తముతో పరికించుచుండెను. కాపయ నాయకుడు అనవోతా నాయకుని తన అదుపు ఆజ్ఞలలో నుంచుకొనుటకు ప్రయత్నించి యుండెను. ఇట్టి ప్రయత్నము వలన సంబంధములు మరింత బెడిసిపోయెను. అనవోతా నాయకుడు యుద్ధము ప్రకటించి. తన బలముతో వరంగల్లును సమీపించెను. కాపయనాయకునకు గల అనుకూల పరిస్థితులన్నియు ముసల్మానులతో చేసిన యుద్ధములందు సర్వనాశనములయ్యెను. ఇట్టి విపరీత పరిస్థితిని ఎదుర్కొవలసి వచ్చునని అతడు భావించి యుండలేదు. అయితే, తన అధికారమునకు భంగము వాటిల్లుట అతడు సహించలేదు. యుద్ధమునకు సిద్ధమయ్యెను. వరంగల్లు జిల్లా, వరంగల్లు తాలుకా లోని భీమవరము వద్ద యుద్ధము జరిగెను. కాపయ నాయకుడు ఓడిపోయెను. యుద్ధరంగమునందే కాపయ నాయకుడు వీరశయనము నొందెను. (1367–1368).

అనవోతా నాయకుడు క్రమముగా భోనగిరి, ఓరుగల్లు, సింగవరము మొదలగు కోటలను జయించెను. అనవోతానాయకుడు తెలంగాణ ప్రాంతమునకు అడ్డులేని రాజయ్యెను. ఈ విజయ పరంపర వలన అనవోతా నాయకుడు ఆంధ్రదేశాధీశ్వర, ప్రతిగండ భైరవ, త్రిభువని రాయరావు అనవోత, మొదలగు బిరుదావళులు వహించెను. ఓరుగల్లు నగర గౌరవ ప్రాధాన్యము తగ్గెను.

కాపయ నాయకుని మరణముతో ముసునూరి రాజన్యుల తెలంగాణ పాలనా ప్రకరణము ముగిసినది.

అనైక్యత వలన ఆపద

కాపయ నాయకుడు ఆంధ్రదేశము నందు జనించిన సేనాగ్రగణ్యులలో నొకడు. ప్రతిభావంతుడయిన పరిపాలనాదక్షుడు, మహాశూరుడు, గాఢ దేశాభిమాని, ఆంధ్రదేశమును విదేశీయుల దాస్య బంధమునుండి తప్పించుటకు ఎట్టి కష్టమునకైనను జంకినవాడు గాడు. ఉదారాశయుడు, సాహసోపేతుడు, ధర్మాభిమాని, స్వాతంత్ర్య ప్రియుడు—ఈ గుణవిశేషములన్నియు కాపయ నాయకుని యందు ప్రకాశమానములయ్యెను. ఢిల్లీ చక్రవర్తి నెదిరించలేక అందరు నిర్వీర్యులయి వున్న సమయమున కాపయ నాయకుడొక్కడే చక్రవర్తి నెదురొడ్డి నిలువగలిగెను. తన పరిపాలనా కాలము నందలి చివరి సంవత్సరముల వరకు తెలంగాణము యొక్క సుస్థిరత్వమునకును, హిందువుల స్వాతంత్ర్యము కొరకును పరిశ్రమించెను. కాపయ నాయకుని స్వార్థత్యాగము అనుపమానము. కాపయ నాయకుడు, అనవోతా నాయకుడు, మాదా నాయకుడు చేతులు కలుపుకొని, హృదయ పూర్వకముగా పరిశ్రమించియుండినచో తెలంగాణములోని, హిందువుల లాభక్షేమాలు ఆశించి, నిస్వార్థ బుద్ధితో పరిశ్రమించియుండినచో చరిత్రాంశములు మరియొక విధముగా మారియుండెడివి. అట్లు జరుగుట విధిచెయిదము కాకుండెను. రేచెర్ల రాజన్యులు మహాశూరాగ్రేసరులు. హిందూ సోదరుని అధికారమునకు లోబడి యుండుటగాని, ఆఖరికి సహకారిగా నుండుటకుగాని వారు ఎంతమాత్రము ఒల్లకుండిరి. వారి అవివేక ప్రవర్తన పాతకము కాలక్రమమున వారిని కట్టికుడిపెను. రేచెర్ల వారు తాము త్రవ్విన గోతిలో తామే పడిరి.

1369 సంవత్సరము మొదలుకొని బహమనీ రాజ్యములో భాగమగువరకు తెలంగాణ చరిత్రమంతయు రేచెర్ల రాజన్యుల యొక్కయు, తమ ప్రాభవముల కొరకును, తరువాత తమ అస్తిత్వము కాపాడుకొనుటకును గుల్బర్గా బహమనీ సుల్తానులతో వారు చేసిన యుద్ధముల యొక్కయు చరిత్రయే అయియున్నది. రేచెర్ల వారు 53 సంవత్సరాలు మాత్రమే వరంగల్లు నేలగలిగిరి. రేచెర్ల వారిని జయించి 1422 లో బహమనీ సుల్తాను వరంగల్లును స్వాధీనము చేసికొనెను. (సమాప్తం)

అరణ్య పర్వము :

మహాభారతము

తెనుపుగంటుల లక్ష్మణశాస్త్రి

(69)

ఆ ముని తనను నిందించినవారిని, స్తుతించినవారిని సువర్ణమును మంటిగడ్డను సమానముగాచూచుచు, పరిశుద్ధమైన జ్ఞానయోగముతో సర్వదా ధ్యాననిమగ్నుడై యుండెను. ధ్యానయోగముచేత శక్తిని, అత్యుత్తమ బుద్ధిని సంపాదించి చివరకు శాశ్వతమై నిత్యమై దోషరహితమైన మోక్ష సామ్రాజ్య సుఖమును పొందెను."

వ్యాసుని నిర్గమనము

కాబట్టి ధర్మరాజా ! నీవుకూడ ఇప్పుడు దుఃఖపడకూడదు. ప్రాజ్యమగు రాజ్యమునుండి భ్రష్టుడవైన నీవు తపస్సు చేసి తిరిగి దానిని సంపాదించగలవు. సుఖానంతరము దుఃఖము, దుఃఖానంతరము సుఖము ఒకటివెంట మరియొకటి పర్యాయముగా బండి చక్రపు ఇనుప కమ్మని చక్రపు ఆకులవలె చుట్టు తిరుగుచు పురుషుని అనుసరించుచుండును. అజ్ఞాతవాసము పదమూడవయేడు గడచిన తరువాత నీవు నీ పితృపైతామహమైన రాజ్యమును తిరిగి పొందగలవు" అని చెప్పి వ్యాసభగవానుడు తిరిగి తన ఆశ్రమమునకు పోయెను.

ఈ విధముగా కామ్యక వనమందు పాండవులు మునులతో ఇష్టకథలు చెప్పికొనుచుండిరి. ద్రౌపది అన్నము పెట్టులోపల వచ్చిన అతిథులకు ధర్మరాజు తనకు సూర్యుడిచ్చిన అక్షయపాత్ర నుండి అన్నము తీసిపెట్టుచుండెను.

ఇట్లు సుఖముగానున్న పాండవులకు దుర్యోధనుడు ద్రోహము చేయుటకు తలపెట్టెను. దానికిగాను అనేక కుతంత్రములను యోచించుచున్న దుర్యోధనాదుల వద్దకు ఒకనాడు మహాతపశ్శాలియైన దుర్వాసుడు వచ్చెను. ఆయనతో అనేక వేల సంఖ్యలో శిష్యులు గూడ వచ్చిరి. మహాకోపిష్ఠుడైన ఆ మహామునిని దుర్యోధనుడు అతివినయముతో నెదుర్కొని స్వాగతము చెప్పి పూజించెను. దుర్వాసుడు కొన్నినాళ్ళు అక్కడ ఉండెను. అతనిని దుర్యోధనుడు శ్రద్ధగా రాత్రింబవళ్లు, అతని కోపమునకు భయపడి సేవించెను.

ఆ మహాముని దుర్యోధనునితో 'నాకు చాల ఆకలిగానున్నది త్వరగా భోజనము పెట్టుము' అని చెప్పి స్నానమునకు పోయి చాలసేపటివరకు రాడు. వచ్చికూడ, 'నా కిప్పుడు ఆకలిలేదు' అని అంతర్ధానము చెందును. ఒకప్పుడా ముని అకస్మాత్తుగా వచ్చి 'మా కిప్పుడు త్వరగా భోజనము పెట్టుము' అని అడుగును. ఒక్కొకప్పు డాతడు అర్ధరాత్రము నందు 'మాకు భోజనము పెట్టుము' అని దుర్యోధనుని కోరును. అతడు భోజనము సిద్ధము చేయించిన వెంటనే దానిని గర్హించుచు తినకపోవును. దుర్వాసుడు ఇంతగా బాధించుచున్నను దుర్యోధనుడు ఏ మాత్రము వికారము గాని, విసుగు గాని, కోపము గాని చెందక ఆ మహాముని పరీక్షకు నిలబడి సేవించెను. దుర్వాసుడు దుర్యోధనుని యెడల అతి సంతుష్టుడై "నీకు కావలసిన వరమును కోరుకొనుము. ఇచ్చెదను. నేను ప్రీతిచెందినప్పుడు నీకు అలభ్యమగునది యేదియు లోకమున నుండదు" అని చెప్పెను.

ఆ మాటలు వినిన దుర్యోధనుడు తనకు తిరిగి క్రొత్తగా జన్మ వచ్చినట్లు సంతోషించి, ఇదివరకే కర్ణదుశ్శాసనాది దుష్టులతో యోచించి యున్న వరమును యిట్లు కోరెను:— "మహాత్మా! నా యెడల నీవుచూపిన అనుగ్రహమునే మాకు జ్యేష్ఠభ్రాతయగు యుధిష్ఠిరుని పట్ల గూడ చూపుము. అతడు పరమధర్మపరుడు. తమ్ములతో కామ్యక వనమునందు ఉన్నాడు. నీవు శిష్యగణముతో అక్కడికి పోయి యీ వేలాది శిష్యులకు నీకు భోజనము పెట్టుమనుము. అందరికి భోజనముపెట్టి ద్రౌపది విశ్రాంతి తీసికొనియున్న సమయమునందు పోయి అడుగుము. ఇదియే మీరు నాకు ఇచ్చు వరము" అని దురుద్దేశముతో ప్రార్థించెను. దానికి అంగీకరించి దుర్వాసుడు వెడలిపోయెను. "ఇపుడు మన తంత్రము నెగ్గినది. ధన్యులమయితిమి" అని సంతసించి దుర్యోధనుడు కర్ణాదులతో కరస్పర్శము చేసెను. అప్పుడు కర్ణుడు ఇట్లనెను :— 'రాజా! అదృష్టవశాత్తు నీకు మేలుకలిగినది. నీ శత్రువులు ఈ దెబ్బతో తప్పక నశించెదరు. దుర్వాసుని క్రోధాగ్నికి శలభములయ్యెదరు. పాండవులు తమ పాపముచేతనే దుస్తరమైన అంధకారములో పడి

ప్రమ్రగిపోగలరు." ఈ విధముగా ఆ దుష్టచతుష్టయము తమకు తోచినట్లు మాట్లాడుకొని తమతమ యిండ్లకు పోయిరి.

తరువాత దుర్వాసుడొకనాడు, అందరు భోజనముచేసి ద్రౌపది విశ్రాంతి తీసికొనుచున్న సమయమునందు అనేక వేల శిష్యగణముతో పాండవుల ఆశ్రమమునకు పోయెను. అట్లు వచ్చిన దుర్వాసునికి శిష్యులతోపాటు స్వాగత సత్కారములు ధర్మరాజు చేసి 'భగవాన్! ఆహ్నికమును ముగించుకొని త్వరగా దయచేయుడు, ఆతిథ్యము స్వీకరింతురుగాక' అని చెప్పెను. 'ఇంతమందికి ఇప్పుడితడు ఎలాగు భోజనముపెట్టునో చూచెదముగాక' అనుకొని దూర్వాసుడు శిష్యులతో స్నానార్థము పోయెను.

ఇంతలో ద్రౌపది 'ఇంతమందికి ఇప్పుడు భోజనము సిద్ధము చేయుట యెట్లు సాధ్యమగును' అని మనస్సులోనే అతి చింత చెందుచు భగవంతుడగు శ్రీకృష్ణుని ధ్యానించెను. 'భగవాన్! పురాణపురుషా! పురుషుల మనోబుద్ధులను కనిపెట్టి, సహాయము చేయు మహాత్ముడవు నీవు. సర్వాంతర్యామి! సర్వశక్తి సంపన్నా! పూర్వము సభలో దుశ్శాసనుని బారినుంచి నన్ను రక్షించినట్లే యిప్పుడు గూడ ఈ సంకటమునుండి కాపాడి, నా పరువు నా భర్తల గౌరవమును కాపాడుము' అని ప్రార్థించెను. ఈ మొర చెవిని బడగనే శ్రీకృష్ణుడు శయనము నుండి లేచి, ప్రక్కనున్న రుక్మిణీదేవిని వీడి త్వరగా ద్రౌపది కడకువచ్చెను. ఆయనకు ద్రౌపది, తనకు కలిగిన సంకటమును తెలిపి యిట్లనెను. 'ముని గణమునకు భోజనము సిద్ధము చేయు విధానమును నాకు బోధించి, యుద్ధరించుము' అని వేడెను. అప్పుడు భగవంతుడు 'ద్రౌపదీ! నాకిప్పుడు చాల ఆకలిగాయున్నది. వెంటనే భోజనము పెట్టుము. తరువాత అన్ని సంగతులు మాట్లాడి నీ కోర్కె నెరవేర్చెదను!' అని చెప్పగనే ద్రౌపది 'సూర్యుడిచ్చిన అక్షయ పాత్రములో నాకు మాత్రము మిగిలియున్న అన్నమును తినినాను. ఇప్పుడు అన్నము లేదు' అని చెప్పెను. అదివిని కృష్ణుడు 'ద్రౌపదీ! ఇది పరిహాస వచనములకు సమయము కాదు. అన్నపాత్రను తెచ్చి నాకు చూపుము. నేను చాల ఆకలిగొనినాను' అని చెప్పగనే ద్రౌపది అన్న పాత్రను తెచ్చెను. దానిలో మూతకు అంటుకొన్న కొద్ది శాక భాగము ఉండుట చూపించి కృష్ణుడు దానిని తీసికొని భుజించి ఆమెతో 'ఈ శాకముతో విశ్వభోక్తయైన భగవంతుడు తృప్తి చెందుగాక' అని చెప్పి, సహదేవుని పిలిచి 'వెంటనే మునులను భోజనమునకు పిలువుము' అని ఆజ్ఞ యిచ్చెను. సహదేవుడు వారిని పిలుచుటకు పోయెను. అప్పుడు ఆ మునులు గంగలో స్నానార్థమై మునిగి లేచువరకు తృప్తిగా కడుపు నిండి నట్లై ఆకలిబాధ బాసిరి. తీరమునకు వచ్చి దుర్వాసునితో 'మనము ధర్మరాజునకు అన్నము సిద్ధము చేయమని చెప్పితిమి. ఇప్పుడు ఆకలి లేదు. తృప్తిగా నున్నది. ఏమి చేయుదము!' అని యనిరి. అప్పుడు దుర్వాసుడు ఇట్లనెను :— 'వ్యర్థముగా మనము రాజర్షియైన ధర్మరాజునకు ద్రోహము తలపెట్టి వంటచేయించితిమి. మనకుఆకలి లేదు. ధర్మరాజునకు కోపమువచ్చి మనను దహించునేమో. ఇదివరకే నేను పూర్వము విష్ణుభక్తుడైన అంబరీషునకు అపకారము చేసి చాల అగచాట్లు పడినాను. పాండవులు హరిభక్తులు. వారికి అసాధ్యమేదియు లేదు. కనుక మనమిప్పుడు ధర్మరాజునకు తెలుప కుండగనే పోవలెను". అది విని వారందరు భీతులై దిక్కులకు పరుగెత్తిరి.

సహదేవుడు గంగా తీరమునందు వారిని వెదకి యెక్కడను గానక, వారు పరుగెత్తి పోయినట్లు అక్కడి వారివలనవిని, తిరిగి వచ్చి ధర్మరాజునకు ఆ వృత్తాంతమును తెలిపెను. అప్పుడు ధర్మరాజు 'అయ్యో! వారు వెడలిపోయిరే. అర్ధ రాత్రమునందు తిరిగి వచ్చి అడిగినచో నేనేమి చేయుదును' అని చింతించుచుండగా శ్రీకృష్ణుడు ప్రత్యక్షమై యిట్లనెను :— "రాజా! దుర్వాసుని వలన మీకు గలిగిన సంకటమునుండి విడివడుటకు ద్రౌపది నన్ను ధ్యానించెను. నేను సత్వరముగా వచ్చి ఆ సంకటమును నివారించితిని. ఇప్పుడు దుర్వాసుడు శిష్యులతోపాటు మీకు భయపడి పారిపోయెను. ఇంకరాడు. ధర్మనిష్ఠగల మీవంటివారు ఎప్పుడుగూడ నశించరు. నేను సెలవు తీసికొనెదను. మీకు మంగళము కలుగుగాక" అని చెప్పిన మాటలు విని, ధర్మరాజాదులు శాంతచిత్తులై కృష్ణునితో "దేవా! నీవు మాకు అండగానున్నావు. దుస్తరమైన ఆపత్సముద్రములందు మునుగుచున్న మేము ఓడగా నిన్ను ఆశ్రయించి తరించుచున్నాము. నీకు శుభముగాక. పోయిరమ్ము!' అని శ్రీకృష్ణుని వీడ్కొలిపిరి.

పాండవులు ఆ వనమునందు నిశ్చింతముగా అచ్చటచ్చట విహరించుచు సుఖముగా నివసించుచుండిరి.

'జనమేజయ మహారాజా! నీవడిగిన ప్రశ్నములకు సమాధానము చెప్పితిని. ఈ విధముగా దుర్యోధనాదులు చేయుచున్న ఎన్నో కుత్రల నుండి, సంకటములనుండి పాండవులు తప్పించుకొనిరి. వారు చేయు దుష్టచేష్టలన్నియు వీరియెడల వమ్మయ్యెను!' అని వైశంపాయన మహాముని చెప్పి తర్వాతి వృత్తాంతమిట్లు చెప్పదొడగెను :— (సశేషము)

సంస్కరణల వైఫల్యం

* మంచి సంస్కరణలు కూడా విఫలమైపోతూ వుండడానికి కారణం అజ్ఞానమే. సంస్కరణ పేర చెలామణీ అయ్యే ప్రతీదీ సంస్కరణ కానేరదు.

—గాంధీజీ

వంశధార ఆనకట్టు

శ్రీకాకుళం జిల్లాలో తరచు అనావృష్టికి గురి అవుతుండే పాత పట్నం, నరసన్నపేట, టెక్కలి తాలూకాలలోనూ, పలాస సబ్ తాలూకాలోనూ వ్యవసాయానికి నీరు లభింపజేసేందుకు వంశధార ఆనకట్ట ఉద్దేశించబడింది. ఇది నీటి పారుదల ఆనకట్ట. దీని నిర్మాణానికి రూ. 877.64 లక్షలు ఖర్చవుతుందని అంచనా. దీని వల్ల 1,48,300 ఎకరాల ఆయకట్టుకు సేద్యపు నీరు లభిస్తుంది.

వంశధార నది రాష్ట్రంలోని పెద్ద నదులలో నాల్గవది. ఒరిస్సా రాష్ట్రంలోని కోరాపుట్టిజిల్లాలో తూర్పు కనుమల్లో యిది పుట్టి కోరాపుట్టి, శ్రీకాకుళం జిల్లాల ద్వారా 160 మైళ్ల ప్రయాణం చేసి కళింగపట్నంవద్ద బంగాళాఖాతంలో కలుస్తున్నది.

తొలి దశ

ఈ ప్రాజెక్టును రెండు దశల్లో నిర్మిస్తారు. రూ. 318.46 లక్షల ఖర్చుతో గొట్టా గ్రామంవద్ద బేరేజిని నిర్మించడం, 1,48,300 ఎకరాలకు సేద్యపునీరు అందజేసేందుకు వీలుగా రూ. 559.18 లక్షల ఖర్చుతో గొట్టా గ్రామం నుంచి 59 మైళ్ళ వరకు నదికి ఎడమ వైపున కాలువను ఒకదానిని త్రవ్వడం—ఇవి తొలి దశలో చేపట్టుతారు. మొదటి 22 మైళ్ళ పొడవు కాలువనూ, దాని ఉప కాలువల్నీ 1976—77 నాటికి పూర్తిచేస్తారు. దానితో 58,000 ఎకరాలకు సేద్యపు నీరు లభిస్తుంది. ఎక్కువగా నరసన్నపేట దీనివల్ల లాభిస్తుంది. 1970—71లో బారేజి నిర్మాణం ప్రారంభించబడింది. ఇది పూర్తయితే దాదాపు 98,500 ఎకరాలకు సాగు నీరు లభించి నీటి ఎద్దడి తీరిపోతుంది. స్థిరంగా సాగునీరు పొలాలకు అందుతుంది.

రోడ్డు, వరద కట్టలు

బేరేజిమీద 24 అడుగుల వెడల్పుగల రోడ్డు వుంటుంది. నదికి రెండు వైపులావున్న గ్రామాలమధ్య రహదారి, రవాణా సౌకర్యాలకు యిందువల్ల వీలు ఏర్పడుతుంది. బేరేజినుంచి నదికి ఎగువ దిశలో రెండు వైపులా 4 మైళ్ళ 4 ఫర్లాంగుల వరకు వరద కట్టలు నిర్మిస్తారు. నదికి యిరువైపులావున్న సారవంతమైన పంట భూములు, గ్రామాలు నీటిలో మునిగిపోయే ప్రమాదం లేకుండా రక్షణ కల్పించేందుకు యీ వరద కట్టలు తోడ్పడతాయి. ఈ వరద కట్టలు 1976—77 నాటికి పూర్తవుతాయి.

ఖర్చు

1973 మార్చి మాసాంతానికి యీ ఆనకట్టమీద రూ. 192 లక్షలు ఖర్చయ్యాయి. 1973—74 సంవత్సరానికి రూ. 80 లక్షలు కేటాయించారు. 1973 జూన్ మాసాంతంలోగా కరువు సహాయక నిధులనుంచి రూ. 15 లక్షలు కర్చు పెట్టాలని కూడా ఉద్దేశించారు.

కార్మికులు

ప్రస్తుతం బేరేజి పనుల్లో 4 వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరికి రోజుకు సగటున రూ. 3 లు చెల్లిస్తున్నారు. కాలువ నిర్మాణం పని కూడా త్వరితంచేస్తే దాదాపు 5 వేల మంది కార్మికులు అవసరమౌతారు.

సివిల్ పనులు

సివిల్ పనులకు సంబంధించి 8 తావుల్లో దాదాపు 70 శాతం పని పూర్తయ్యింది. ప్రస్తుతం పనంతా 16వ స్తంభం దగ్గర జరుగుతోంది. ఇక్కడ నది లోతు ఎక్కువ. నదికి వరదలు వచ్చే లోపునే కాంక్రీటు పని పూర్తి చేసెయ్యాలని ఉద్దేశిస్తున్నారు.


ప్రత్యేకత

పునాదుల్లో నిర్మాణం పనులు ప్రారంభించేముందు అక్కడి నీటిని తోడితీయవలసివచ్చింది. ఇందుకు అవసరమయ్యే పంపింగ్ యంత్రాలు ప్రత్యేకంగా సేకరించి తెచ్చారు. రాత్రింబగళ్ళు యిక్కడ పని జరగడానికి వీలుగా పునాదుల్లో నీటిని ఎప్పటికప్పుడు తోడితీస్తూ నదిలో నీటి లెవెల్‌ను బాగా తగ్గించి త్వరితంగా పని జరిపించారు.

విద్యా, వైద్య సౌకర్యాలు

ఈ ఆనకట్ట ప్రాంతంలో 200 కుటుంబాలు వున్నాయి. వారి పిల్లల చదువులకుగాను ఒక ఎలిమెంటరీ పాఠశాల వుంది. 4 పడకలతో ఆసుపత్రిని ఏర్పాటు చేయడానికి మంజూరీ రావలసి వుంది.

ఇటీవలే శ్రీకాకుళం నుంచి ఒక పాత్రికేయ బృందం యీ ఆనకట్టను సందర్శించి అక్కడ జరుగుతున్న పనితీరును స్వయంగా చూశారు. సూపరింటెండింగ్ ఇంజనీరు శ్రీ డి. సంజీవరాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీ వై. శ్రీరామమూర్తి, కంట్రాక్టరు శ్రీ డి. శేషారెడ్డి పత్రికలవారికి ప్రాజక్టు ప్రాంతం త్రిప్పిచూపి అక్కడ జరుగుతున్న పనులను గురించి వివరించారు. ★



20

చివరి పోరాటం

ఆంధ్ర కర్ణాటక సైన్యాలన్నీ బయలుదేరి ఓరుగల్లుచేరువకు అర్ధరాత్రికి చేరుకొన్నవి. హోయసల సైన్యాన్ని తీసుకొని కరాళుడొక ప్రక్క, ఆనెగొంది సైన్యానికి నాయకత్వం వహించి అమ్మన దేవుడొక ప్రక్క ముట్టడించడానికి, కాపయ్యానాయకుడు కోట ముందు భాగం నుండి దాడిచేయడానికి పూనుకొని తమ సైన్యాలను సిద్ధం చేసుకొన్నారు.

ఆ రాత్రిలోనే కోటమీద కావలివున్నవారు శత్రుసైన్యాలు వచ్చాయని తెలుసుకొని, ద్వారాలు బంధించి కోటలోని సైన్యానికా విషయంతెలియబరచారు. హఠాత్తుగా శత్రువులు కోటనుచుట్టి వేశారని వింటూనే అందులోవున్న సైనికులు, ముస్లిములు భయపడ్డారు. కాని ఆనగరంలోనున్న హిందువులందరూ అమితానందం జెందారు. త్వరగా తమకు విముక్తి కలుగగలదని సంతోషించారు. ఆ యదృష్టాన్ని కలిగించవలసిందని దేవునికి వేయి మొక్కులు మొక్కుకొన్నారు.

ఉదయమయ్యేవరకు ఆంధ్ర కర్ణాటక సేనలు దాడి ప్రారంభించలేదు. తెల్లవారుతూనే పోరాటాన్ని ప్రారంభించవలసిందని కాపయ్యా నాయకుడు తన సేననాజ్ఞాపించాడు. ఆ వెంటనే కరాళుడు అన్నమదేవుఢు గూడ తమ సైన్యాలను ముందుకు వెళ్లమన్నారు.

ఈ దండయాత్ర ఓరుగల్లు సైనికాధికారికి ముందుగా తెలియక పోవడం వల్ల అతడు తన సేనల్ని సంసిద్ధ పరచివుంచ లేదు. కనుకనే కంప దుర్గం అంటూ ఒకటి లేకపోయింది. కనుక హిందూ సైన్యాలు మట్టికోట నాక్రమించడానికి పూనుకొన్నాయి.

సంసిద్ధంగా లేకపోయినప్పటికీ ముస్లిం సేనలు తమ సైన్యాధిపతియైన ముబారక్ ఆజ్ఞ యిచ్చినదే తడవుగా కోట గోడలను రక్షించడానికి బయలుదేరి వచ్చినవి. గోడలవద్దకు వస్తున్న వారిపై ఆయుధాలను ప్రయోగింపసాగినవి. పైనుండి గుండ్లను దొరలింప నారంభించినవి. కాలిన నూనెను పోయబూనుకొన్నవి. కాని హిందూ సైన్యాలు ఏ మాత్రం వెనుకంజ వేయలేదు. ఆయుధాలు తమ అవయవాలను ఖండిస్తున్నప్పటికీ, పైనుండి పడుతున్న గుండ్లు తమ్ము నలిపివేస్తున్నప్పటికీ, పోయబడుతున్న నూనెలు తమ్ము కాల్చివేస్తున్నప్పటికీ వెనుదీయకుండా ముందుకు వెళ్లి గోడల నెగబ్రాక నారంభించినారు.

అన్నమదేవుడున్న వైపున గోడ కొంత బలహీనంగావుంది అచ్చట అతడు కేంద్రీకరించి ఆ గోడను పడగొట్టడానికి ఆనతిచ్చాడు, ఆనెగొంది సైనికులెంతో ధైర్యంతో చొరబడి దానిని కొద్దిగా త్రోసివేశారు. అప్పుడు సైనికులెగబ్రాకటం సాధ్యమయింది, అయినప్పటికీ వారికి పైకెక్కడానికి సాధ్యం కాలేదు. కోటలోపలనున్న సైన్యంలో హెచ్చుభాగాన్ని ఆ వైపుకు పంపాడు ముబారక్. కనుక ఆనెగొంది సైన్యం గోడనెక్కి క్రిందికి దిగలేక పోయింది.

కరాళుడు గూడ రెండో ప్రక్కను ముట్టడించాడు. కాని ఆ ప్రక్కన గూడ గోడ నధిగమించడానికి సాధ్యం కాలేదు.

కాపయ్యా నాయకుడు కోట బహిర్ద్వారాన్ని పగులగొట్టి ముందుకు వెళ్లాలని చూచాడు కాని ఆనాడు ఆ పని సాధ్యం కాలేదు.

కాకతీయ రుద్రదేవుడు కట్టించిన దుర్గమది. గణపతిదేవుడు, రుద్రమదేవి, ప్రతాప రుద్రుడు బలపరచిన కోట అది. ఆ కోటను పడగొట్టాలంటే ఎంతో కష్టం. ప్రతాపరుద్రుని కాలంలోగూడ ముస్లిం సేనలు ఆ కోట గోడను బ్రద్దలు గావించలేక అతన్ని వంచించి బంధించి తీసుకు వెళ్లినవి. ఆలాటి దుర్గాన్ని పట్టుకోవడం అంత సులభమైన పనిగాదు. అందువల్లనే ఆ నాడు హిందూసేనలు ముందుకు వెళ్లలేక పోయినవి.

ఆ విధంగా ఏడు దినాలు పోరు ఘోరంగా జరిగింది. ఇక అది చాల దినాలు జరప కూడదని అన్న మంత్రి కాపయ్యా నాయకునికి సలహా యిచ్చాడు. త్వరగా అటోయిటో తేల్చి వేయాలని

గూడ నచ్చ జెప్పాడు. అందువల్ల వ్యూహరచనలో కొద్దిగా మార్పు గావించారు. అన్నమంత్రి అనపోతనాయకుడు కోట బహిద్వారం ముందుండి పోరాడాలని, కాపయ్యనాయకుడు, అన్నమదేవుడు ఒక ప్రక్కనుండి బలహీనంగావున్న కోటగోడను పడగొట్టి ముందుకువెళ్లి ద్వారాన్ని తెరిచివేయాలని. అప్పుడు లోనున్న సేనలు ద్వారం వద్దనే కేంద్రీకరించి పోరాడవలసి వస్తుంది గనుక ఆ సమయంలో కరాణుడు తన సైన్యాన్ని లోనికి దుమికించి ముస్లిం సైన్యాలమీద బడాలని ఆ వ్యూహం.

ఆ వ్యూహం ప్రకారం అన్నమంత్రి మొట్ట మొదట ద్వారం వద్ద చొచ్చుకొని వెళ్లడానికి ప్రయత్నించాడు. అందువల్ల ముబారక్ ఆ ప్రాంతంలోనే ఎక్కువ సైన్యాల నుంచి పోరాడాడు. ఆ సమయంలో కాపయ్యనాయకుడు, అన్నమ దేవుడు ఇద్దరూ బలహీనమైన ఆ కోట భాగం వైపుకు సైన్యాన్ని నడిపించారు. సైన్యాన్ని గట్టిగా పురికొల్పి ముందుకు వెళ్లమన్నారు.

ఆనెగొంది సైనికులు గూడ ఆవేశంతో విజయకాంక్షతో తీవ్రంగా పోరాడసాగారు. కాపయ్యనాయకుడు ప్రక్కన వున్నాడనే ఉత్సాహంతో అన్నమదేవుడు ప్రళయకాళరుద్రునిలా విజృంభించాడు. అందువల్ల ఆనాడు ఆనెగొంది సైనికులు సులభంగా ఆ కోటగోడను పడగొట్ట గలిగారు.

కోటగోడ పడిందోలేదో హిందూసైనికులు ఒక ప్రవాహం లాగా లోనికి దూసుకొని వెళ్లారు. ఎదురుబడి వచ్చిన ముస్లిం సైనికుల్ని చీల్చి చెండాడుతూ కోట ద్వారంవైపుకు వెళ్లసాగారు.

ఆంధ్రసైన్యం ముందుకు వస్తూండడాన్ని ముబారక్ చూచాడు. వెంటనే తన సైన్యాన్ని అటువైపుకు దుమికించాడు. అప్పుడు ఆంధ్ర ముస్లిం సైన్యాలు గట్టిగా తలపడినవి. పోరు ఘోరంగా జరిగింది. ఏడు దినాలలో జరగని అపారనష్టం అప్పుడు ఒకటి రెండు గడియల్లో జరిగింది.

ముస్లిములెంత ఎదిరించినప్పటికీ ఆంధ్ర సైన్యం నిలవకుండా ముందుకు చొచ్చుకొని వెళ్లింది, ద్వారానికి సమీపంగా వచ్చింది. అంతలో ముస్లింసేనలు ఆ సేనల్ని చుట్టుముట్టాయి. అప్పుడు సంకుల సమరం ప్రారంభ మయింది. ఆ సమరంలో ఎవరు ముస్లిములో, ఎవరు ఆంధ్రులో కనుగొనలేనంత క్లిష్ట పరిస్థితి ఏర్పడింది.

ఒక వైపునుండి ఆంధ్రసైన్యం ముస్లింసైన్యాన్ని నెట్టివేయడానికి ప్రయత్నిస్తూంటే మరొకవైపునుండి ముస్లిం సైనికులు వారిపైబడడానికి ప్రయత్నింపసాగారు. అయినప్పటికీ కాపయ్య అన్నమదేవులు వారిని చీల్చి చెండాడుతూ దారిచేసుకొని ద్వారం వైపుకు వెళ్లసాగారు. కొంత దవ్వునుండి దానిని ముబారక్ పరికించాడు. ధైర్యము చేయకపోతే లాభం లేదనుకొని కాపయ్య అన్నమ దేవులవైపుకు తన అశ్వాన్ని ఉడాయించాడు, కాపయ్య నాయకునిపై విరుచుకొని పడడానికి ప్రయత్నించాడు. ఖడ్గాన్ని తీసి అతణ్ణి నరకడాని కుంకించాడు. కాపయ్యను కంటికి రెప్పలాగా చూచుకుంటున్న అన్నమదేవుడు ఆ ప్రమాదాన్ని వెంటనే గుర్తించి ముబారక్ మీద బడ్డాడు. ముబారక్ ఆగ్రహంతో అన్నమదేవునిపై బడాడు. తన ఖడ్గంతో బలంగా అన్నమదేవుణ్ణి కొట్టాడు, ఆ దెబ్బతో అన్నమదేవుడు కెవ్వున కేక బెట్టి క్రిందికి వాలిపోయాడు. ఆ కేక విని వెనుదిరిగి చూచాడు, కాపయ్యనాయకుడు. వాలిపోతున్న అన్నమదేవుణ్ణి చూచాడు. అన్నమదేవుడు క్రింద బడుతున్నప్పుడు అతని శిరస్త్రాణం పడిపోయింది. అతని శిరోజాలు విచ్చుకొని వ్రేలసాగినవి.

"ఏమిటీ అన్నమదేవుడు పురుషుడు గాదా? స్త్రీయా?"

కాపయ్యనాయకుని కర్తవ్యం తోచ పోయింది. ఆలోచించడానికి గూడ అతనికి వ్యవధి లేకపోయింది. కాని అన్నమదేవుడలా దెబ్బతిని పడిపోవడం అతనికెనలేని విషాదాన్ని, ఆగ్రహాన్ని కలిగించింది. వెంటనే అతడు క్రోధంతో, ఆవేశంతో తన అశ్వాన్ని ముబారక్ మీదకి దుమికించాడు. అతణ్ణి కండలు కండలుగా నరికివేయాలన్నంత కోపంతో అతని మీదకు వెళ్లాడు.

ముబారక్ గూడ ఊరుకోలేదు. తమసైన్యాన్నంతటినీ నాశనం గావించడానికి, తమకిన్ని అపజయాలను కొనితేవడానికి కాపయ్యే కారకుడు. గనుక అతణ్ణి తుదముట్టించాలనే కోరికతో అతడు కాపయ్య నాయకుణ్ణెదుర్కొన్నాడు. ఇద్దరి మధ్య పోరు ఘోరంగా జరిగింది. వారొకరి కొకరు వెనుదీయకుండా తలపడి పోరాడారు. తమకున్న ఖడ్గలాఘవాన్నంతటినీ ప్రదర్శించారు. బలాన్నంతటినీ వినియోగించారు. తమ అశ్వాలను వివిధ గతులలో నడిపించారు. ముందుకు దూకారు, తప్పుకొని పైకి లంఘించారు; కత్తులు విరగగొట్టుకొన్నారు. కడకా మొండికత్తితోనే కాపయ్య నాయకుడు ముబారక్ తలను పగుల వేశాడు. 'అల్లా' అంటూ అతడు పెద్ద కేక బెట్టి క్రింద పడి పోయాడు.

ముబారక్ పడిపోయినప్పటికీ ముస్లిం సేనలు వెనుకంజ వేయలేదు. విజయమో, వీర స్వర్గమో నన్నట్లుగా పోరాడజొచ్చాయి. ముబారక్ క్రింద బడి పోవడం చూచి హిందూసేనలెంతో ఉత్సాహంతో ముస్లిముల మీద బడి వారిని వెనుకకు నెట్టారు. కాపయ్య నాయకుడు విలయకాల రుద్రునిలా వారిని చెండాడుతూ ముందుకు వెళ్లాడు. ఈ లోగా ఆనెగొంది సైనికులు వెళ్లి కోట కవాటాలను తెరిచారు. వీరాంధ్రవాహినులు కట్టలు తెంచుకొన్న ప్రవాహం లాగా, లోనికి చొచ్చుకొని వచ్చాయి, వాటినెదుర్కొనడానికి కర్ణాటక సైన్యాల నెదిరిస్తున్న ముస్లిం సైనికులు వచ్చారు, ఆ యవకాశాన్ని వినియోగించుకొని కర్ణాటక సైన్యాలు కోట గోడ నెక్కి లోనికి రానారంభించాయి.

మూడు వైపుల నుండి లోనికి వచ్చిన హిందూ సేనలు ముస్లింసైన్యాన్ని చుట్టివేసినవి. అందు వల్ల అవి రాతి కోటలోనికి వెళ్లి రక్షణనొంద లేకపోయినవి.

కాపయ్య నాయకుడు ముస్లిం సేనల్ని చూచి "ఎవరు లొంగితే వారు క్షమించబడుతారు. లొంగనివారు దండించబడుతారు' అని రెండు మూడు సార్లు ఎలుగెత్తి చాటాడు. అతని మాటల్ని విన్న తరువాత నాయకత్వం లేని ఆ ముస్లిం సేనలు లొంగిపోయినవి.

ఆంధ్ర కర్ణాటక సేనలు "జై కాపయ్య నాయక! జై అన్నమదేవ! జై బల్లాల!" అంటూ నినాదాలు గావించారు. ముస్లిం సైనికుల్ని నిరాయుధుల్ని గావించడానికి పూనుకొన్నారు.

ఆ సమయంలో కాపయ్య నాయకునికి అన్నమదేవుడు గమనానికి వచ్చాడు. వెంటనే అశ్వాన్ని కోట కవాటం వద్దకు ఉరాయించాడు. కవాటాన్ని చేరుకొంటూనే అచ్చట అశ్వం నుండి క్రిందికి దూకాడు. అన్నమదేవుని కోసం వెదక సాగాడు. ఒక ప్రక్కగా పడివున్న ఆ మూర్తిని కనుగొన గలిగాడు. ఆ మూర్తి నతడు పరికించాడు. అది స్త్రీ మూర్తి — అతడన్నమదేవుడు గాదు. ఆమె అన్నమదేవి. అతడు నిర్ఘాంత పోయాడు.

అప్పుడతనికి గతమంతా ఒక్కసారి గమనమొచ్చింది. ఆమె తనమీద చూపిన ప్రేమ, తనయెడల ప్రదర్శించిన మమకారం తన యెడల చూపిన ఆసక్తి, తనకోసం పడిన ఉబలాటం అన్నీ అతనికి జ్ఞప్తికి వచ్చాయి.

అతడు రెండు మూడు సార్లామెతో వందల కొద్ది మైళ్ళు ప్రయాణం గావించి వున్నాడు. ఆమెతో ఒకటి రెండు సార్లు ఒంటరిగా వాహ్యాళి వెళ్ళి వున్నాడు. ఆమెతో ఎంతో సన్నిహితంగా మాట్లాడి వున్నాడు కాని ఆమె ఒక తరుణీమణి అని గుర్తించ లేక పోయాడు.

తామిద్దరూ తుంగభద్రా తీరంలో నడయాడుతున్నప్పుడామె అడిగిన ప్రశ్నలు, ఆమె ఆడిన మాటలు అతని కప్పుడు చప్పున గమన మొచ్చాయి.

తుంగభద్రా తీరాన్ని గూర్చి "ఇది సొగసుగా వుంది.". అని తానన్నప్పుడు "మీకంటేనా?" అని ఆమె అన్నది.

"ఈ ప్రాంతం చాలా పవిత్రమైన దని తానన్నప్పుడామె "మీహృదయం లాగే" అని నవ్వింది.

"మీకు వివాహమయిందా ?" అని అడిగింది.

"ఆంధ్ర భూమండలాధ్యక్షులయిగూడ చేసుకోలేదా ?" అని ప్రశ్నించింది. "పోనీ, ఎవరైనా మిమ్మల్ని కోరుకొంటేగూడ చేసుకోరా ?" అని జవాబుకోసం ఎదురుచూచింది. తన్నెన్నోమార్లు చిన చూపులతో కలవర పరిచింది. నవ్వులతో ముంచెత్తింది. తానామె కరం పట్టుకొన్నప్పుడు పరవశించింది. తన్నాలింగనం చేసుకొనబోయి ఆగిపోయింది. ఆ విధంగా ఎన్నోమార్లు ప్రేమను ప్రదర్శించింది. కాని తానావిషయాన్ని గుర్తించలేకపోయాడు. ఆమె పురుషవేషంలో ఉండడమే దానికి కారణం.

క్రింద పడివున్నప్పటికీ ఆమె తన్నుచూస్తే నవ్వుతూనే వుంది. "మీకోసం ఈ త్యాగం" అన్నట్లుగావుంది, ఆమెనవ్వు. కాపయ్యనాయకుడు వంగి మరణించివున్న ఆ ముగుదను లేపి కౌగలించుకొని ముద్దుపెట్టుకొన్నాడు. భరించలేక వెక్కి వెక్కి ఏడ్చాడు. ఆలోగా ఆనెగొంది సైనికులచ్చటికి వచ్చారు. వారుగూడ ఆ స్త్రీ మూర్తిని చూచి నివ్వెర పోయారు. తమ యువరాజు ఒక తరుణీమణి అని వారెన్నడూ అనుకొని వుండలేదు. వారామె మరణాన్ని చూచి భోరున ఏడ్చారు.

21

కాపయ్య నాయకుడనుకొన్నట్లే ఓరుగల్లు ఆంధ్రుల స్వాధీనమయినది. వరాహధ్వజం మరొకసారి ఆ కోటగోడలమీద రెపరెపలాడింది. కాని హృదయంలోని కోటగోడలు మాత్రం కూలిపోయినవి. అతని మనస్సు వ్రక్కలయింది. అతనికి జీవితమే వృథా అనిపించింది. ఎల వేళలా అన్నమదేవి అతని కళ్ళముందు కనపడ సాగింది. అతన్ని పలకరించినట్లు, అతన్నిచూచి నవ్వినట్లు, అతన్ని చూస్తూ అలాగే నిలుచున్నట్లు అతని కనిపించింది. ఆమె తోచినప్పుడెల్లా అతని హృదయం వ్రక్కలయినట్లయింది.

ఆనాడు, మరణించిన అన్నమదేవి నలంకరించి ఏనుగుమీద వున్న అంబారీలో కెక్కించి ఆమెను ఆనెగొందికి సాగనంపినప్పుడు తానెలా భరించలేకపోయాడో తనస్థితినే మరచి ఎలా దుఃఖించాడో కాపయ్యకింకా గమనముంది. ఆ దేవి మూర్తి తననుండి శాశ్వతంగా వెళ్ళిపోతున్నట్లనిపించింది

ఓరుగల్లును పట్టుకొన్నందుకె తో సంతసించవలసిన ఆనెగొంది సేనలు ఎంత దుఃఖాక్రాంతమయ్యాయో తలచుకొన్నప్పుడతని మనస్సెంతో బాధపడింది.

ఆ సేన తరలిపోతున్నప్పుడు తాను ఆ ఏనుగుపై అంబారీలో వున్న అన్నమదేవిని, తన హృదయాధిదేవత నొకసారి కన్నీళ్ళతో పరికించాడు. అప్పుడామె "వెళ్ళివస్తాను" అన్నట్లుగావుంది. ఆ సమయంలో తనహృదయమెలా కరిగిపోయిందో అతనికింకా గమనముంది.

నిజంగా ఆమె వెళ్ళిపోయింది. తన్నువీడి శాశ్వతంగా వెళ్ళిపోయింది. ఇక ఆమె రాదు. ఎన్నటికి రాదు. కాని ఆమె తన హృదయంమీద ఒక చెరగిపోని ముద్రనువేసి వెళ్ళింది. తానెప్పుడూ ఆమెను మరచిపోలేడు.

ఇప్పుడు తాను కాపయ్య నాయకుడేగాదు. ఆంధ్రభూమండలాధ్యక్షుడేగాదు, ఆంధ్ర సురత్రాణ. కాని తన కానందంలేదు. ఎలావుంటుంది!. తన్నెంతో ప్రేమించిన తన ప్రియురాలిప్పుడు లేదు, ఆమె తన్నువీడి వెళ్ళిపోయింది. తనకోసం, తనప్రాణాన్ని రక్షించడం కోసం ఆత్మార్పణ గావించింది. ఆలాటి ప్రేమమూర్తిని, ఆలాటి త్యాగమూర్తిని ఆలాటి మహిత మూర్తిని తానెలా మరచి పోగలడు.

అన్నమదేవి మరణాన్ని విని ఆ సోమదేవరాజు అలాగే కూలిపోయాడట. అతడెంతో గొప్పవాడు, త్యాగధనుడు, చిన్నతనంనుండి ఎన్నోకష్టాల నెదుర్కొన్నవాడు. అతి ధైర్యవంతుడు. ఆంధ్రావని విముక్తికోసం తన సర్వస్వాన్ని ఒడ్డి పోరాడిన వాడు. అందుకోసమని, తానెంతో కష్టపడి జయించిన కృష్ణ, తుంగభద్ర అంతర్వేది ప్రాంతాన్నంతటినీ హరిహర రాయలకు సమర్పణ గావించినవాడు. అతడు తన సోదరిమీద తన ప్రాణాలనన్నిటినీ పెట్టుకొనివుంటాడు. అందువల్ల తానే మరణించినట్లు భావించి వుంటాడు. ఆలాటి సాహసవంతురాలైన, మేధావంతురాలైన చెల్లెల్ని గలిగిన ఏ సోదరుడు మాత్రం అలా భావించకుండా వుంటాడు.

కాపయ్య నాయకుడు బాధపడిపోయాడు. అతని కళ్లు చెమ్మగిల్లి, నీరు చిప్పిలి రెప్పలపై జాలు వారజొచ్చింది.

దేవుడు తను కోరినదంతాయిచ్చాడు. తీరాంధ్రాన్ని తన వశం గావించాడు. ఎన్నో యుద్ధాలలో జయాన్నిచ్చాడు. తుదకు ఓరుగల్లునుగూడ తన చేతిలో పెట్టి ఆంధ్రసురత్రాణా అనిపించాడు. కాని తన అన్నమదేవిని మాత్రం లేకుండా చేశాడు. బహుశా ఆమెనుగూడ తనకు దక్కనివ్వమని అర్థించి వేడివుంటే తన్నతడు కరుణించివుండేవాడేమో. కాని అలా తాను కోరలేదు.

అన్నమదేవిని అన్నమదేవుడనుకొన్నాడు తాను. ఆమె ఒక తరుణీమణి అన్న విషయమే తనకు తోచలేదు.

"మీరు వెడుతూనే నన్ను మరచిపోతారేమో" అని ఆమె అన్నప్పుడు — "మిమ్మల్ని విడిచివుండాలంటే నాకెందుకో కష్టంగా వున్నది. అవకాశమున్నచో మీతోటే వుండిపోవాలనుంది" అని ఆమె పలికినప్పుడు,— "ముందుజన్మలో మనం అన్నదమ్ములమో, బావ మరదులమో తెలియదు" అని తానంటే, ఆమె నవ్వుతూ, "అంత కంటె దగ్గరవారమ"ని నుడివినప్పుడు తాను సరిగా అర్థంచేసుకోలేకపోయాడు. ఆమె అంతకంటె స్పష్టంగా తన మనస్సునెలా ప్రకటించగలదు. తన ప్రేమనెలా ప్రదర్శించగలదు. అతని మనస్సు కుళ్ళింగిపోయింది.

అన్నమదేవుడు పురుషుడుకాదని, ఒక స్త్రీమూర్తి అని తనకు ముందుగానే తెలిసివుంటే తానే ఆ మోహనమూర్తి ముందు మోకరించి ప్రేమభిక్షను కోరివుండేవాడు. ఆమె హృదయంలో ఏ మూలనో తనకింత స్థానమివ్వమని అర్థించి వుండేవాడు. ఆ యదృష్టం తనకుండాలిగదా. తాను దురదృష్టవంతుడు.

ఆమె తన జీవితంలో ఒక మెరపులాగా మెరసి మాయమయింది. తనచుట్టూ అంధకారాన్ని పులిమిపారిపోయింది. ఇప్పుడు తానా అంధకారంలో ఆమెను వెతుక్కొంటూ వెడుతున్నాడు. కాని ఆమె ఎలా కనిపిస్తుంది? ఆమె అక్కడేవున్నదో, ఎచ్చటికి వెళ్లిందో ఎవరు చెప్పగలరు?

తన జీవితగమనంలో ఆమె ఎచ్చటోఒకచోట హఠాత్తుగా వచ్చి కలుసుకొన్నది. ఆమె నర్థంచేసుకొనేముందే వెళ్ళిపోయింది.

ఒకప్పుడామె తనతోలేదు, అప్పుడీ బాధలేదు. ఈ కన్నీళ్లు లేవు. కాని ఇప్పుడామె లేకపోయేటప్పటికి జీవితమే శూన్యమనిపిస్తున్నది. ఈ విజయాలు, ఈ పదవులు, ఈ అధికారాలు అన్నీ వృథా అనిపిస్తున్నవి.

ఆమెలో ఏదో అతీతమైన శక్తి వున్నది. ఆమె తన్నిట్లే ఆకట్టుకొన్నది. ఆమెను మరవాలంటేగూడ మరపురావడంలేదు. ఆమె తనకెంత దూరంగా వెళ్లిపోయిదంటే అంత దగ్గరగా వుందామె. తన మనస్సును శాశ్వతంగా బంధించివేసి నవ్వుకొంటున్నది.

ఆమె నిజంగా మరణించిందా? ఏమో, కాని తన హృదయంలో మాత్రం సజీవంగా కానవస్తున్నది. ప్రపంచాన్ని విడిచి తన హృదయంలో స్థానాన్ని ఏర్పరచుకొన్నది. ఆమెను బాహ్య ప్రపంచంలో ఇక చూడలేడు తాను. తన హృదయ ప్రపంచంలో మాత్రమే దర్శించడానికి వీలుంటుంది. ఆమె తన మానవత్వాన్ని కోటిదేవత్వాన్ని పొందింది. అందువల్ల మరింత పవిత్రమయింది. ఆ పవిత్ర మధుర మోహనమూర్తిని ఆరాధించాలి తాను.

తనమీద కొత్త బాధ్యతలు పడినవి. అవి చాల గురుతరమైనవి. కాకతీయ సామ్రాజ్యం నాటి ప్రతిష్ఠను తాను నిలబెట్టాలి. ఆంధ్రావనిని ఆకాశానికెత్తాలి.

అన్నమదేవి వుంటే ఎంత బాగుండేది. ఆమె తన అర్ధాంగియై వుంటే, తనకు బాసటగావుండి పనులు నిర్వహిస్తుంటే రాజ్యనిర్వహణ ఎంత సులభంగావుండేది? ఆయదృష్టం తనకు లేకపోయింది. అయినప్పటికి ఆమెను తలచుకొంటూ ప్రజల్ని కలుసుకొంటూ, వారి సమస్యల్ని పరిష్కరిస్తూ ఆంధ్రావని నభివృద్ధిచేయడానికి తన జీవితాన్ని అంకితం గావించుకోవాలని అనుకొన్నాడు కాపయ్యనాయకుడు. అతనికి తెలియకుండానే అతనికళ్ళు చెమరించాయి.

(సమాప్తం)

కోన సీమలో కొబ్బరి పీచు పరిశ్రమ

(11 వ పేజీ తరువాయి)


7 రోజులలో పూర్తి చేయవచ్చును. ఇందువల్ల కాలము కలసివచ్చుటయే గాక పీచుయొక్క నాణ్యత కూడా పెరుగుతుంది అని.

పరిశ్రమలో పారిశ్రామిక వేత్త నాలుగు కాలాలపాటు నిలద్రొక్కుకొని నిలబడాలంటే తన ఉత్పత్తులకు ఖరారైన మార్కెట్టు ఉండాలంటారు మూర్తిగారు. ఈ సందర్భములో తన దృష్టి నాకర్షించింది, 1966వ సంవత్సరములో మైసూరు రాష్ట్ర ప్రభుత్వముచే స్థాపింపబడిన సెంట్రల్ కోయర్ కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ అంటారు. ఉత్పత్తి దార్లకు ఆ రాష్ట్రంలో ఎంతో చేయూత నిస్తుంది ఈ సంస్థ. ఇది ఉత్పత్తిదార్లనుండి మొత్తంగా సరకును కొంటుంది. దీనివల్ల ఉత్పత్తిదారు తన సరకు అమ్ముడు పోతుందో లేదో అనే ఆందోళన పడనక్కరలేదు. ఇట్టి సంస్థలను కేరళ, తమిళనాడు, ఒరిస్సా, పశ్చిమబెంగాలు రాష్ట్రములు కూడా నెలకొల్పుకొన్నట్లు తెలుస్తుందన్నారు మూర్తిగారు.


మార్కెటింగ్ సంస్థ

కొబ్బరి పీచు పరిశ్రమకు కోనసీమలో మంచి భవిష్యత్తు ఉంది. అయితే మైసూరు రాష్ట్రములో నిర్వహింపబడుతున్న మార్కెటింగ్ సొసైటీ వంటి సంస్థను మనరాష్ట్రములో వీలైతే కొబ్బరి పరిశ్రమ కేంద్రీకృతమైయున్న కోనసీమలో ప్రభుత్వము ప్రారంభించిన నాడే, ఈ పరిశ్రమ అభివృద్ధికై స్వయం ఉపాధి కల్పన పథకముల క్రింద ప్రభుత్వము పెట్టుచున్న పెట్టుబడులు సార్థకమౌతాయని అభిప్రాయ పడుతున్నారు శ్రీకుసుమె కృష్ణమూర్తి. దీని సాధ్యాసాధ్యాలను సాంకేతిక నిపుణులు ఆర్థికశాస్త్ర వేత్తలు ప్రభుత్వాధినేతలు పరిశీలించాలి.


వార్తా చిత్రాలు




గవర్నరు సలహాదారు శ్రీ హెచ్. సి. సరీన్ ఆగస్టు 16న రవీంద్రభారతిలో పండిట్ విష్ణు దిగంబర్ పలుస్కార్ శతజయంతి ఉత్సవానికి ప్రారంభోత్సవం చేశారు.



నగర కేంద్ర గ్రంథాలయానికి సంబంధించిన సంచార గ్రంథాలయ విభాగానికి శ్రీ హెచ్. సి. సరీన్ ఆగస్టు 17న ప్రారంభోత్సవం చేశారు.



కర్నూలు జిల్లా ఎ. గోపాలపాడులో కొత్తగా నిర్మించిన ఆనకట్ట నుండి జూలై 5 వ తేదీన గవర్నరు సలహాదారు శ్రీ హెచ్. సి. సరీన్ నీరు వదలినప్పటి దృశ్యం.



నిజామాబాదు జిల్లా కలెక్టరు శ్రీ ఎన్. కె. సురోయ ఆగస్టు 15న రిక్షా కార్మికుల సహకారసంఘం సభ్యులకు 40 రిక్షాలను అందచేశారు.

209 సామూహిక సేద్యపు బావులు

నల్లగొండ జిల్లా కలెక్టరు, శ్రీ ఎల్. బుల్లయ్య యిటీవల నల్లగొండలో మాట్లాడుతూ హరిజనులు, సన్నకారు రైతుల అభివృద్ధి సంస్థ 209 సామూహిక సేద్యపు బావులను మంజూరు చేసిందనీ ప్రతిదానికి రూ. 3,000 నుంచి రూ. 5,000 లు ఖర్చు అవుతుందని అన్నారు. క్రాష్ ఉపాధి పథకం క్రింద 114 సామూహిక సేద్యపు బావులను మంజూరు చేశారు. వాటిలో 103 బావుల త్రవ్వకం పూర్తిఅయింది.

హరిజనుల నిమిత్తం చేపట్టిన 2175 యిండ్ల నిర్మాణం లో 2128 యిండ్లు నిర్మించడం జరిగిందనీ మిగతా 47 యిండ్ల నిర్మాణం త్వరలోనే పూర్తి చేస్తారని ఆయన అన్నారు.

విస్సకోడేరులో పశు వైద్యశాలకు ప్రారంభోత్సవం

పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరు శ్రీ ఎస్. ఆర్. గోవిందరాజన్, ఆగస్టు 22 న విస్సకోడేరులో రూ. 27,000/-ల ఖర్చుతో నిర్మించబడిన ప్రాథమిక పశువైద్యశాలకు ప్రారంభోత్సవం చేస్తూ మర్లగూడెంలో త్వరలోనే 500 ఎకరాలలో జర్సీ పశుక్షేత్రం ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. శ్రీ ప్రకాశం శత జయంతి ఉత్సవం జరుపుతున్న సందర్భంలో ఈ వైద్యశాలను ఆయన పేరుతో వ్యవహరించడం సముచితంగా ఉంటుందని ఆయన సూచించారు. ఈ వైద్యశాలలో పరికరాల నిమిత్తం జిల్లా సంక్షేమ నిధి నుండి రూ. 10,000/- ల విరాళాన్ని యిస్తున్నట్టు ఆయన ప్రకటించారు.

జిల్లాలో త్వరలో మరో రెండు పాలశీతల కేంద్రాలు ఏర్పాటు చేస్తారని ఆయన తెల్పారు. పాడిపరిశ్రమ అభివృద్ధికి వీలుగా జిల్లాలో పశుగణాభివృద్ధికి తీవ్రంగా కృషిచేయాలని ఆయన సూచించారు. విస్సకోడేరులో రూ. 25,000/- ల ఖర్చుతో మంచి నీటి సరఫరా పథకాన్ని అమలు జరుపుతారని కలెక్టరు అన్నారు.

తెలంగాణా ఉక్కు పరిశ్రమలకు ప్రారంభోత్సవం

ఖమ్మం జిల్లా కలెక్టరు శ్రీ గులామ్ జిలానీ, ఆగస్టు 22న కొత్తగూడెం సమీపంలోని పెంచుపల్లిలో తెలంగాణా ఉక్కు పరిశ్రమల స్థాపనకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ కొత్తగూడెంలో ఒక ఎరువుల పరిశ్రమను ఏర్పాటు చేసే అవకాశం ఉందనీ, దానికొరకు వెయ్యి ఎకరాల భూమి సిద్ధంగా ఉన్నదనీ తెలియజేశారు. ఈ ప్రాంతంలో యితోధికంగా పరిశ్రమలు నెలకొల్పడానికి ముందుకు రావాలని జిల్లా ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. తెలంగాణా ఉక్కు పరిశ్రమల అభివృద్ధికి సాధ్యమైన సహాయం అందజేస్తామని ఆయన హామీ యిచ్చారు.


ఈ పరిశ్రమల స్థాపనకు మొత్తం రూ. 5 లక్షల పెట్టుబడి అవసరమవుతుంది. దానిలో 2.5 లక్షలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సహాయక సంస్థ అందజేస్తున్నది. ఉక్కుతీగలు, హెచ్.బి. వైర్లు యీ పరిశ్రమలో ఉత్పత్తి చేస్తారు. వార్షికంగా 1800 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరుగుతుంది.

పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టరు శ్రీ పి వీరాస్వామి ప్రసంగిస్తూ కొత్తగూడెం, ఖమ్మం సమీపంలో త్వరలోనే రూ. 12 కోట్ల ఖర్చుతో 15 పెద్ద పరిశ్రమలు నెలకొల్పబడ్తాయని అన్నారు. శాసన సభ్యులు శ్రీ సి. హెచ్. కాశయ్య ప్రసంగిస్తూ జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నందుకు పరిశ్రమల శాఖను అభినందించారు. కొత్తగూడెంలో వెంటనే ఎరువుల ఫ్యాక్టరీ ఏర్పాటు అయ్యే విధంగా శ్రద్ధ వహించాలని కలెక్టరుకు విజ్ఞప్తి చేశారు.

పొలిశెట్టి గూడెం లిఫ్ట్ ఇర్రిగేషన్ విస్తరణ పథకం అమలు

ఖమ్మం జిల్లా, పొలిశెట్టిగూడెం గ్రామంలో లిఫ్ట్ ఇర్రిగేషన్ విస్తరణ పథకం అమలు జూలైలో పూర్తి అయిందనీ, ఈ నెలలో 110 ఎకరాలకు నీరు సరఫరా చేయబడిందనీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీ ఎం. జీవన్ సింగ్ తెల్పారు

ఈ పథకం క్రింద ప్రస్తుతం 485 ఎకరాల ఆయకట్టు ఉంది. విస్తరణ పథకం అమలు వల్ల అదనంగా 140 ఎకరాలకు నీటి సౌకర్యం కల్పించారు. దీనికి రూ. 72,000/- ల ఖర్చు అయింది.



విశాఖ జిల్లా కలెక్టరు శ్రీ ఎస్. ఎన్. అచంట ఆగస్టు 16న భీమిలి పంచాయతీ సమితిలోని తాళ్ళవలస గ్రామంలో కొబ్బరి మొలకను నాటుతున్న దృశ్యం.

అవనిగడ్డ సమితిలో మహిళాలోక పాదయాత్రా బృందం

శ్రీమతి లక్ష్మీబెన్ ఫకీన్, శ్రీమతి నిర్మలావేద్, శ్రీమతి బెన్‌రజనిలతో కూడిన మహిళాలోక పాదయాత్రా బృందం యిటీవల కృష్ణాజిల్లాలోని చల్లపల్లి, అవనిగడ్డలను సందర్శించారు మాజీమంత్రి శ్రీ ఎం వి కృష్ణారావు, చల్లపల్లి మహిళా మండలి సభ్యురాండ్రు, పంచాయతీ సభ్యులు, దివి సీమ మహిళా మండలి, యువజన సంస్థ, అవనిగడ్డ పంచాయతీ సమితులకు చెందిన సభ్యుల బృందానికి చల్లపల్లిలో స్వాగతం చెప్పారు చల్లపల్లి, అవనిగడ్డలలో జరిగిన సభలకు శ్రీ ఎం వి కృష్ణారావు అధ్యక్షత వహించారు

పూదోటల పెంపకం అభివృద్ధికి తీవ్ర కృషి

విశాఖపట్నంలోను, పరిసర ప్రాంతాల్లోను పూదోటల పెంపకం అభివృద్ధికి విస్తృతంగా తీవ్రతర కృషి జరపడానికి వ్యవసాయ శాఖ వారు ఒక కార్యక్రమాన్ని రూపొందించారు విశాఖ వ్యవసాయ–పూదోటల సంఘం సభ్యులు ఆగస్టు 20న ఒక ప్రాథమిక సమావేశాన్ని జరిపారు. హిందూస్థాన్ షిప్‌యార్డు సివిల్ ఇంజనీరింగ్ మేనేజరు శ్రీ జె. బి. శాస్త్రి అధ్యక్షత వహించారు పారిశ్రామిక సంస్థలకు చెందిన ప్రతినిధులు, పూదోటల పెంపకం నిపుణులు, ఇతరులు యీ సమావేశంలో పాల్గొన్నారు.

జిల్లా కలెక్టరును ఎక్స్-అఫీషియో అధ్యక్షులుగాను, వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టరును ఎక్స్-అఫీషియో కార్యదర్శిగాను నియమించడానికీ సంఘంలో సభ్యత్వాన్ని విశాఖపట్టణానికి పరిమితం చేయడానికీగాను తీర్మానించారు. పూలు, ఫలాలు, కూరగాయల మొక్కలు పెంచటానికి ఎక్కువ స్థలం అందుబాటులోగల సంస్థలపై దృష్టి కేంద్రీకరించాలని సమావేశంలో సూచించారు. వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టరు శ్రీ ఎం. ఎస్. హబీబుల్లా ప్రసంగిస్తూ వ్యవసాయ–పూదోటల పెంపక సంఘం ఉద్దేశాలను వివరించారు. హైదరాబాదు–కాకినాడ సంఘాల మాదిరిగా ఈ సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఐదుగురు సభ్యులతోకూడిన అడ్-హాక్ కమిటీని రూపొందించారు; ఇది సంఘం కార్యక్రమావళి పట్టికను తయారు చేస్తుంది.

సోడా గ్యాస్ కర్మాగారానికి శంకుస్థాపన

పశ్చిమ గోదావరి జిల్లా పెదపాడు పంచాయతీ సమితిలోని కామరవోలులో సోడా గ్యాస్ కర్మాగారానికి జిల్లా కలెక్టరు శ్రీ ఎస్. ఆర్. గోవిందరాజన్ శంకుస్థాపన చేస్తూ వ్యవసాయ ప్రాతిపదికపై నిర్మించే పరిశ్రమలకు పశ్చిమ గోదావరి జిల్లాలో విస్తృతావకాశాలు ఉన్నాయని అన్నారు. ఔత్సాహిక పారిశ్రామికులు యిక్కడి ఇతోధికావకాశాలను, అందుబాటులోవున్న ప్రభుత్వ సహకారాన్ని వినియోగించుకోవాలని ఆయన వారిని కోరారు గత కొద్ది సంవత్సరాలుగా విస్తృత ఉద్యోగావకాశాలను, మంచి వస్తూత్పత్తిని సాధించేందుకు లఘు పరిశ్రమలు తీవ్రంగా కృషి చేస్తున్నాయని ఆయన అన్నారు

పంచాయతీ సమితి అధ్యక్షులు శ్రీ గారపాటి వీసంనయ్య సమావేశానికి అధ్యక్షత వహించారు పరిశ్రమలశాఖ అసిస్టెంటు డైరెక్టరు శ్రీ ఎం వి రత్నం, శ్రీ సి. ఎస్ ఆర్ మూర్తి ప్రాజెక్టు ఉద్దేశాలను వివరించారు

నాగార్జునసాగర్‌లో 'సి. ఇ. బి. ఇ. ఎం. ఒ.' పునరావాస కేంద్రము

'సి ఇ.బి ఇ ఎమ్ ఒ' అభివృద్ధి విషయాల కేంద్ర సహాయక సంస్థ అధ్యక్షులు, నెదర్లాండ్సు మాజీ ప్రధాన మంత్రి డా డిజోంగ యిటీవల విజయవాడలో పత్రికా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ ప్రాంతాలలో ప్రణాళికల ద్వారా జరిగిన అభివృద్ధి తమను ముగ్ధులను చేసిందని అన్నారు. రాష్ట్రంలో బలహీనవర్గాల సంక్షేమానికి మరింత సహకారాన్ని అందించే ప్రతిపాదనలను తాము పరిశీలించగలమని ఆయన అన్నారు. గుంటూరు జిల్లా నాగార్జునసాగర్‌లోని తుఫాను బాధితుల కాలనీని, తెనాలిలోని హోమ్‌సైన్సు సంస్థను ఆయన సందర్శించారు

తమ సంస్థ 82 దేశాలలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని ప్రతి సంవత్సరం రూ. 250 నుండి 300 కోట్ల మొత్తాన్ని ఖర్చు చేస్తోందని ఆయన అన్నారు. నెదర్లాండ్సు ప్రభుత్వం యీ సంస్థ ద్వారా సహాయక నిధులను సమకూరుస్తున్నది. రోటరీ వారి సహకారంతో నాగార్జున సాగర్‌లో కుటుంబాలకు పునరావాస కేంద్రాన్ని నిర్మించేందుకు, జె.సి.ఎస్. వారి తోడ్పాటుతో విశాఖపట్నంలో కుష్ఠురోగుల కేంద్రాన్ని నెలకొల్పేందుకు నిర్ణయించామని డా. డిజోంగ వెల్లడించారు.

'సి ఇ.బి.ఇ ఎమ్ ఒ' సంస్థ ఉపాధ్యక్షులు డా. కెరోటియస్సు మాట్లాడుతూ రాజకీయాలకు, వ్యాపార లక్ష్యాలకు అతీతంగా వ్యవహరిస్తున్న తమ సంస్థ ఎటువంటి నిర్బంధాలు లేకుండా సహాయాన్ని



చిత్తూరు జిల్లా కలెక్టరు శ్రీ ఎ. వలియప్పన్ ఆగస్టు నెలలో తిరుపతిలో నేత్ర శిబిరానికి ప్రారంభోత్సవం చేశారు.

అందిస్తున్నదని అన్నారు. ఖారతదేశంలో ఇంతవరకు రు. 2.25 కోట్లు ఈ సంస్థ ఖర్చు చేసిందని ఆయన వివరించారు.

ఉట్నూరులో మాస్ కమ్యూనికేషన్ కార్యక్రమం

ఇటీవల ఉట్నూరులో ఆదాయపుపన్నుశాఖ ఆధ్వర్యాన మాస్ కమ్యూనికేషన్ సమావేశం జరిగింది. దానికి శాసనసభ్యులు శ్రీ ఎస్. ఎ దేవ్‌షా అధ్యక్షత వహించారు నిజామాబాదు జిల్లా ఆదాయపుపన్ను శాఖాధికారి శ్రీ ఎం ఎ. ఆర్. షెరీఫ్ ఆదాయపు పన్నును గురించిన ముఖ్యాంశాలను వివరించి చెప్పారు. నిర్మల్ లోని ఆదాయపుపన్ను శాఖాధికారి శ్రీ సి హెచ్ సుబ్రహ్మణ్యం ఈ కార్యక్రమ ప్రాముఖ్యతను గురించి ప్రసంగించారు. శ్రీ జి రామయ్య వందన సమర్పణ చేశారు

పోచంపాడు ఆయకట్టు అభివృద్ధి అమలు సంఘం సమావేశం

కరీంనగర్ జిల్లా కలెక్టరు శ్రీ వి కె శ్రీనివాసన్ అధ్యక్షులుగాను, వివిధ అభివృద్ధి శాఖల అధికారులు సభ్యులుగాను ఏర్పాటు చేయబడిన పోచంపాడు ఆయకట్టు అభివృద్ధి అమలు సంఘం సమావేశం యిటీవల కరీంనగర్‌లో జరిగింది. కాలువల అభివృద్ధిపనులను త్వరితంచేస్తూ ఎక్కువమంది ఆయకట్టుదార్లకు సంఘం పనిని విస్తరింపజేయాలని సమావేశంలో నిర్ణయించారు. లోకలైజ్ చేయబడిన ఆయకట్టును మూడు సంవత్సరాలలో-అంటే మొదటి సంవత్సరం 70 శాతం, రెండు సంవత్సరాలలో 85 శాతం, అభివృద్ధి పర్చాలని ప్రతిపాదించారు. ఈ సంవత్సరం నవంబరు ఆఖరువరకు పోచంపాడు కాలువల నుండి నీరు ఉపయోగించు కోడానికి అనుమతించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరాలని సమావేశంలో నిర్ణయించారు.

ప్రపంచ బ్యాంకు బృందం పోచంపాడు ఆయకట్టు సందర్శన

ప్రపంచ బ్యాంకుకు చెందిన ఐ. డి. ఎ. సలహా మండలి నీటి పారుదల విభాగం ఇంజనీరు శ్రీ జి. జె. షైబర్, ప్రాజక్టు ఇంజనీరు శ్రీ హాషింఆలీ, చీఫ్ ఇంజనీరు శ్రీ డి. తిరుపతి రెడ్డి, కరీంనగర్ జిల్లా కలక్టరు శ్రీ వి. కె. శ్రీనివాసన్ ఆగస్టు 19, 20 తేదీలలో పోచంపాడు ఆయకట్టును సందర్శించారు. ప్రాజక్టు సమీపప్రాంతంలో వ్యవసాయదారులు శాస్త్రీయ పద్ధతులలో భూమిని అభివృద్ధి చేసే కార్యక్రమాలను వారు తనిఖీచేసి, ఆ ప్రాంతంలో శాస్త్రీయ పద్ధతులలో వ్యవసాయ అభివృద్ధి పథకాల అమలుకు మరింతగా కృషిచేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

చింతకుంట గ్రామంలో జరిగే నీటి పారుదల పద్ధతిని శ్రీ షైబర్ బృందంవారు పర్యవేక్షించి ఆ మాదిరిగానే ప్రాజక్టు ఏరియాలోని పరిసర గ్రామాల్లో కూడా నీటిపారుదల పద్ధతులు అమలు జరగాలని సలహా ఇచ్చారు.

బలహీన వర్గాలకు పరపతి సౌకర్యాలపై చర్చా గోష్ఠి

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యదర్శి, కోశాధికారి, శ్రీ కె. డి. శాండిల్య, ఆగస్టు 25 న గుంటూరులో "జాతీయం చేయబడిన బ్యాంకుల ద్వారా బలహీన వర్గాలకు పరపతి సౌకర్యం" పై చర్చాగోష్ఠికి ప్రారంభోత్సవం చేస్తూ బలహీన వర్గాల ప్రజలు తమ జీవన పరిస్థితుల మెరుగుదలకు లఘు పరిశ్రమలను చేపట్టే పక్షంలో వారికి తమ బ్యాంకు పరపతి సౌకర్యాలు అందజేస్తుందని హామీ యిచ్చారు. గుంటూరు జిల్లాలో తమ బ్యాంకుకు చెందిన 27 శాఖలు ఉన్నాయనీ, వాటిలో ఒకటి ప్రత్యేకంగా వ్యవసాయ విషయాలను నిర్వహిస్తున్నదనీ ఆయన అన్నారు. ఇంతవరకు వ్యవసాయం నిమిత్తం రూ. 15 కోట్లు, లఘు పరిశ్రమల ఏర్పాటుకు రూ 21 కోట్లు మంజూరు చేసినట్లు ఆయన తెల్పారు తమకాళ్ళపై తాము నిలబడడానికి స్వయం ఉపాధి పథకం క్రింద వ్యాపారం, పరిశ్రమల ఏర్పాటు చేపట్టి నిరుద్యోగులకు ప్రోత్సాహం కల్పించడానికీ, నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికీ తాము కృషి చేస్తున్నామని ఆయన అన్నారు

పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టరు శ్రీ ఆర్. రామనాథ రెడ్డి ప్రసంగిస్తూ జిల్లాలో 1000 మంది వృత్తి పనివారలకు రూ. 12 5 లక్షల మేరకు రుణాలు మంజూరు చేశారని అన్నారు. తమ బ్యాంకులకు చెందిన బ్రాంచీలలో సిబ్బందిని ఎక్కువ చేసి, స్వయం ఉపాధి పథకాలను త్వరితంగా అమలు జరపాలని స్టేట్ బ్యాంకు అధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

బొండపల్లిలో సంజీవయ్య నగర్ కాలనీకి ప్రారంభోత్సవం

కేంద్ర కార్మిక శాఖా మంత్రి శ్రీ కె. వి. రఘునాథరెడ్డి విశాఖపట్టణానికి 60 కి. మీ. దూరంలో వున్న బొండపల్లిలో హరిజనుల కొరకై నిర్మించబడిన సంజీవయ్య నగర్ సహకార కాలనీకి ప్రారంభోత్సవం జరిపారు. ఈ సందర్భంలో ఆయన ప్రసంగిస్తూ, దేశంలో దారిద్ర్యాన్ని నిర్మూలించడానికి సోషలిస్టు సమాజం ఒక్కటే శరణ్యమని చెప్పారు. దళితవర్గాల ప్రజలకు సాధ్యమైనన్ని సౌకర్యాలతో గృహవసతి కల్పించడం జరుగుతున్నది. యువకులు, వ్యవసాయ కూలీలు, పారిశ్రామిక కార్మికులు పరస్పర సహకారంతో కలిసిమెలిసి జీవించాలని వారికి ఆయన విజ్ఞప్తి చేశారు. విశాఖపట్టణం జిల్లా కలెక్టరు పురోభివృద్ధికరమైన చర్యలు తీసుకొంటున్నందుకు ఆయనను కేంద్ర మంత్రి శ్రీ రఘునాథ రెడ్డి అభినందించారు.

ఈ సందర్భంలో ఏర్పాటైన సభకు జిల్లా కలెక్టరు శ్రీ అచంట అధ్యక్షత వహించారు. ఆయన ప్రసంగిస్తూ విశాఖపట్నంలో త్వరలో ఆధునిక సౌకర్యాలు గల ఒక పాడిక్షేత్రం ఏర్పాటు చేయడం జరుగుతుందనీ, ఈ ప్రాజెక్టుకు మొత్తం రూ. 60 లక్షలు ఖర్చు కాగలదనీ, ఇందులోనుంచి ఇంతవరకు రూ. 11 లక్షలు

మంజూరు చేయడం జరిగిందనీ తెలిపారు. ఈ పథకం క్రింద ప్రతిరోజు 50,000 లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతుంది. చుట్టుప్రక్కల పరిసర గ్రామాలనుంచి లక్షలీటర్ల పాలు సేకరించడం జరుగుతుంది. ఈ ప్రాజెక్టు ఫలితంగా సమాజంలో బలహీనవర్గాలకు లాభం చేకూరగలదని ఆశిస్తున్నానని కలెక్టరు చెప్పారు.

శాసన సభ్యులు శ్రీ పి. సాంబశివరాజు వందన సమర్పణ చేశారు.

343 గ్రామాలలో 762 బోరింగ్ బావుల త్రవ్వకం

పంచాయతీరాజ్ శాఖ సరఫరా చేసిన రిగ్‌తో బోరింగ్ బావుల త్రవ్వకానికి గుంటూరు జిల్లా కలెక్టరు, శ్రీ కె. జయభారతరెడ్డి గుంటూరులో యిటీవల ప్రారంభోత్సవం చేస్తూ గ్రామీణ మంచినీటి సరఫరా పథకం క్రింద కేంద్ర ప్రభుత్వం గుంటూరుజిల్లాకు రూ 37లక్షలు కేటాయించిందని అన్నారు. గుంటూరు కాలువనుండి కాజా గ్రామంలోని 600 ఎకరాలకు లిఫ్ట్ ఇర్రిగేషన్ ద్వారా నీరు సరఫరా చేస్తామని ఆయన హామీ యిచ్చారు. గుంటూరు జిల్లాలో అదనంగా 20,000 ఎకరాలను సేద్యం క్రిందికి తేవడానికి ఉత్పత్తితో కూడిన పథకాలను అమలు జరపడానికి రు. 30 లక్షలు ఖర్చు చేశారని ఆయన అన్నారు. గుంటూరు జిల్లాలో మంచినీటి సౌకర్యం కల్పించడానికి 343 గ్రామాలలో 762 బోరింగ్ బావులు త్రవ్వుతారని కలెక్టరు తెలియజేశారు.

మంగళగిరి పంచాయతీ సమితి అధ్యక్షుడు, శ్రీ గంగాధర రెడ్డి ప్రసంగిస్తూ మంగళగిరిలో బోరింగ్ బావులు త్రవ్వాలని, సమితి ప్రాంతంలో మురుగునీటి కాలువల సౌకర్యం కల్పించాలని కలెక్టరును విజ్ఞప్తి చేశారు.

పంచాయతీరాజ్‌శాఖ సూపరింటెండింగ్ ఇంజనీరు ప్రసంగిస్తూ రాష్ట్రమంతటా 17 రిగ్గులు పనిచేస్తున్నాయనీ, అనంతపురం జిల్లాలో 900 బోరింగ్ బావులు త్రవ్వారనీ తెలియజేశారు.

క్రీడోత్సవాలకు ప్రారంభోత్సవం

మహబూబునగర్ జిల్లా కలెక్టరు, శ్రీ సయ్యద్ హైదర్ రజా, ఆగస్టు 26 న మహబూబునగర్‌లో క్రీడోత్సవాలను ప్రారంభిస్తూ క్రీడలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఉదారంగా నిధులను మంజూరు చేస్తున్నదని అన్నారు. యువజన సంక్షేమ కార్యక్రమాల అమలుకు ప్రభుత్వం నుండి ఎక్కువ గ్రాంట్లను పొందడానికి వీలుగా విరివిగా విరాళాలు అందజేయాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

ఉత్సవాలకు అధ్యక్షత వహించిన జిల్లా పరిషత్తు అధ్యక్షుడు, శ్రీ కె. కె.రెడ్డి ప్రసంగిస్తూ క్రీడలను పెంపొందించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఆటల పోటీలను నిర్వహిస్తున్నందుకు తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

కిలో రూపాయి చొప్పున 639 క్వింటాళ్ళబియ్యం అమ్మకం


శ్రీకాకుళం జిల్లా కలెక్టరు, శ్రీ కె. పురుషోత్తమనాయుడు ఆగస్టు 25 పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ భారత ఆహార కార్పొరేషన్‌కు లెవీ బియ్యం నిల్వలను అందజేయని నేరంపై 37 మంది మిల్లర్లను 11 మంది డీలర్లను ప్రాసిక్యూట్ చేసినట్లు తెలియజేశారు సిమెంటును అక్రమంగా రవాణా చేస్తున్న యిద్దరు వ్యక్తులను అరెస్టు చేసి 253 బస్తాల సిమెంటు జప్తు చేశారు. 626 బస్తాల వరి ధాన్యాన్ని 30 బస్తాల బియ్యం దొంగ నిల్వలను వెలికి తీశారు. దొంగచాటుగా చేరవేసిన 20 బస్తాల ఎరువులను జప్తు చేశారు. జిల్లాలో 'సి' తరగతి కార్డులు గలవారికి ఒక రూపాయకు కిలో చొప్పున 639 క్వింటాళ్ళ దొర బియ్యాన్ని విక్రయింపజేశారని కలెక్టరు అన్నారు.

యువకులచే రోడ్డు నిర్మాణం

కృష్ణాజిల్లా గుడివాడలోని ఎ.ఎన్. ఆర్ కళాశాలకు చెందిన 52 మంది విద్యార్థులు, 25 మంది యువకులు ఆగస్టు 6 నుండి నిర్వహిస్తున్న యువజన శిబిరంలో పాల్గొంటున్నారు. కంచికచర్ల సమీపంలోని గిరిజన కాలనీలో 2.5 ఫర్లాంగుల రోడును వారు నిర్మించారు. ఆగస్టు 31 న శిబిరం పూర్తి అయ్యేలోపుగా 2.5 ఫర్లాంగుల మరొక రోడ్డును నిర్మిస్తారని ఆశిస్తున్నారు.

అల్లూరులో బాలికల యువజన శిబిరం సమాప్తం

యువజన శిబిరాల కార్యక్రమాల డైరెక్టరు, ఆంధ్ర విశ్వవిద్యాలయం సాంఘికశాస్త్ర ప్రొఫెసరు డా. రంగారావు, ఆగస్టు 26 న అల్లూరులో బాలికల యువజన శిబిరం స్నాతకోత్సవంలో ప్రసంగిస్తూ గ్రామాలలోని వాతావరణం, గ్రామీణుల సమస్యలను,



ప్రకాశం జిల్లా డి. ఎం. ఓ. డా. జె. వీరాస్వామి జూలై 20 న రాళ్ళపాడు ప్రాజెక్టు వద్ద 'కరువు నివారణకు యువత కృషి' శిబిరానికి ప్రారంభోత్సవం చేశారు.

వారి ఆచారాలను భారతదేశ యువజనులు తెలుసుకునే అవకాశం కల్పించడానికీ. గ్రామీణ అభివృద్ధిలో వారికి ఆసక్తి కల్పించడానికీ "కరువులకు వ్యతిరేకంగా యువతి" కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతున్నదని అన్నారు

ఆగస్టు 11 న ప్రారంభించిన యీ శిబిరంలో 75 మంది విద్యార్థులు, 25 మంది యితర బాలికలు యీ శిబిరంలో పాల్గొంటున్నారు. శిబిర నిర్వహణకాలంలో బాలికలు 2 30 ఎకరాలలో వరి నాట్లు వేశారు. అల్లూరులోని హరిజనవాడలో 575 గజాల రోడ్డు వేశారు.

జయంతి గ్రామానికి విద్యుచ్ఛక్తి సరఫరా

అనంతపురం జిల్లాలోని రాడిపర్తి బ్లాకులోని జయంతి గ్రామంలో జయంతి సంవత్సరం కార్యక్రమాలలో భాగంగా ఆగస్టు 15 న విద్యుచ్ఛక్తి సరఫరా చేశారు.

పంచాయతీ సమితి అధ్యక్షులు శ్రీ ఒ. పీరారెడ్డి ఉత్సవానికి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో 51 హరిజన కుటుంబాలకు యిండ్ల స్థలాలను ఆయన పంపిణీ చేశారు. ఆటల పోటీలలో పాల్గొన్నవారికి బహుమతులు యిచ్చారు.

ఆలూరులో బాలికల శిబిరం
బాలికలు, గ్రామస్తుల అనుభవాలు

కృష్ణాజిల్లాలోని ఆలూరులో 16 రోజులపాటు నిర్వహించబడిన బాలికల శిబిరం ఆగస్టు 26 వ తేదీన ముగిసింది. ఇందులో మారిస్ స్టెల్లా కళాశాలకు చెందిన 75 మంది విద్యార్థినులు, 25 మంది ఇతర బాలికలు పాల్గొన్నారు. వీరంతాకలిసి హరిజనవాడకు అప్రోచ్ రోడ్డు వేశారు. సమిష్టి వ్యవసాయ క్షేత్రంలో వరి నారు పోశారు. శిబిరం ముగింపు రోజున పాత్రికేయులు ఈ ప్రాంతాన్ని సందర్శించారు. శిబిరం నిర్వహించబడిన కాలంలో తాము గడించిన అనుభవ విశేషాలను నేర్చుకున్న విషయాలను బాలికలు పాత్రికేయులకు తెలిపారు.

కుమారి క్రాంతి యిలాచెప్పింది: "ఏదైనా ఒక నిర్మాణాత్మక కృషిలో పాల్గొనాలని మాకు అభిలాష వుండింది. ఈ శిబిరం వల్ల మా కోరిక నెరవేరింది". కుమారి లీలాకుమారి ఇలా చెప్పింది: "నేను యింతవరకు కాయకష్టం చేసి ఎరుగను. ఇప్పుడు కాయకష్టం చేసే అలవాటు కలిగినది. అంతేకాదు. ఈ కొద్దికాలంలోపల మేము సాధించిన కృషికి మేము గర్వపడుతున్నాము." కుమారి పద్మ అనే విద్యార్థిని బాల్యంలో పూనాలోను పుదుచ్చేరిలోను నివసించింది. ఆమెకు జర్మన్, ఫ్రెంచి భాషలు వచ్చు. ఆమె ఇలా అంది: "పాముల భయంవల్ల వరిపొలాల్లో కాలు పెట్టడానికి మొట్టమొదట మేము చాలా భయపడ్డాము. అయితే హాని చేయని క్రిములు మాత్రమే పొలాల్లో వున్నందున, మేము నిర్భయంగా పనుల్లోకి దిగాము". గ్రూపు లీడరు కుమారి జిజియా తోటి సహాధ్యాయినుల భావాలను వ్యక్తంచేస్తూ ఇలా చెప్పింది. "గ్రామస్తులందరూ మాకు సంపూర్ణ సహకారమిచ్చారు. మాకు ఇక్కడే వుండాలనిపిస్తుంది".

గ్రామస్తులు ఇలా అన్నారు: "చదువుకున్న అమ్మాయిలు వరినారు పోస్తుంటే చూడముచ్చటగా వుంది". మరికొందరు గ్రామస్తులు ఇలా అన్నారు: "గ్రామమంతా వివాహమంటపంలాగా కళకళలాడుతూ వుంది"

ఈ సంచికలోని రచయితలు

శ్రీ వి మధుసూదనరావు, సి.155, మలక్ పేట కాలనీ, బి. బ్లాక్స్, హైదరాబాదు-36
శ్రీమతి కె. రామలక్ష్మి, 1 శివప్రకాశ మొదలిస్ట్రీట్, త్యాగరాయనగర్, మద్రాసు-17
శ్రీ ఎస్. వై. హుస్సేన్, బి.ఎ.పి.ఆర్.ఒ. పాత గన్నవరం, తూ. గో. జిల్లా
శ్రీ వి. పాండురంగారావ్, శాస్త్రీభవన్, వ్యవసాయ మంత్రిత్వశాఖ క్షేత్రసమాచార విభాగం, న్యూఢిల్లీ
శ్రీ మాదల వీరభద్రరావు, ఆంధ్రప్రభ కార్యాలయం, క్వీన్స్‌రోడ్, బెంగుళూరు-1
శ్రీ ముదిగొండ వీరభద్రమూర్తి, 13-6-675 కార్వాన్‌సాహు, హైదరాబాదు-6
శ్రీ సిద్దాని నాగభూషణం, బి.ఎ.పి.ఆర్.ఒ. బెండపూడి, తూ. గో. జిల్లా
శ్రీమతి కోట కమలాదేవి, 3-1-526/12 బర్కత్‌పురా, హైదరాబాదు
శ్రీ పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు, లెక్చరర్, గవర్నమెంట్ ఆర్ట్స్‌సైన్సు కాలేజి, ఖమ్మం
శ్రీ ఆదిరాజు వీరభద్రరావు, సఫీఫా పోస్టాఫీసు వెనుక, అజంపురా, హైదరాబాదు
శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, 69, ఆదర్శనగర్, హైదరాబాదు-4
శ్రీ పి. రాజగోపాలనాయుడు, ఎం.ఎల్.సి. చిత్తూరు

PRINTED BY THE DIRECTOR OF PRINTING, GOVT. OF ANDHRA PRADESH, AT THE GOVT. CENTRAL PRESS HYDERABAD
PUBLISHED BY THE DIRECTOR OF INFORMATION, PUBLIC RELATIONS & TOURISM ANDHRA PRADESH, HYDERABAD.